www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మోసపూరిత కాల్స్, ఎస్ఎంఎస్‌లకు చెక్!

'సంచార్ సాథీ' మొబైల్ యాప్ తెచ్చిన డాట్

మొబైల్ కాల్‌లాగ్స్ నుంచి నేరుగా రిపోర్ట్

వినియోగదారుడి పేరిట ఉన్న మొబైల్ కనెక్షన్లను తెలుసుకోవచ్చు

పోగొట్టుకున్న ఫోన్లనూ బ్లాక్ చేయొచ్చు

2

గర్భిణులకు రూ. 21వేలు

6 పోషకాహార కిట్లూ.. మొదటి బిడ్డకు 5 వేలు

300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

రూ.500కే సిలిండర్, ఏడాదికి 2 సిలిండర్లు

మహిళలకు నెలకు రూ.2,500

ఢిల్లీ ఓటర్లపై బీజేపీ వరాల వర్షం

2

శనివారం | 18-1-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 290 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ.2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా.10.50-12.37; దుర్ముహూర్తం: ఉ.6.52-8.21; అమృతఘడియలు: ఉ.7.53-9.37; రాహుకాలం: ఉ.9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



PREMIUM 3 & 4 BHK HOMES STARTING AT ₹2.75 CR*

The stars will have company tonight,
witness the grand unveil at HITEC City at 8pm.

9513443803

Godrej | PROPERTIES

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

క్రీడా రత్నాలకు పురస్కారాలు

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకుంటున్న తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ జీవాంజీ దీప్తి. ఖేల్‌రత్న పురస్కారాన్ని స్వీకరిస్తున్న చదరంగ చాంపియన్ గుకేశ్ 11



శనివారం | 18-1-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 290 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

పెట్రోల్ బంకు, ఫంక్షన్ హాల్‌కూ
రైతుబంధు

- తెల్లాపూర్‌లో రూ.500 కోట్ల ఆసామికి 'రైతు బంధు' వర్తింపు
- విల్లాలు, అపార్ట్‌మెంట్ల మధ్య 5 గుంటలకు పెట్టుబడి సాయం
- పార్కింగ్‌కు ఇచ్చిన ఈ స్థలానికి సాయం ఆపవద్దంటూ వినతి
- పలుచోట్ల అనధికార లేవుట్లు, నాలా భూములకూ చెల్లింపు
- రైతు భరోసా క్షేత్రస్థాయి సర్వేలో సిత్రాలు.. అధికారుల విస్మయం
- సర్వే నంబర్ల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సర్వే
- సాగుకు తగని భూములు తక్కువే.. 'ఆంధ్రజ్యోతి' పరిశీలన



నారాయణపేట జిల్లా కోస్గి మండలం సజ్జకాన్‌పేట్‌లో రైతు భరోసా సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలోని తెల్లాపూర్‌లో ఓ రైతుకు 10 ఎకరాల భూమి ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఆ భూమి ధర ఎకరా రూ.50 కోట్లకు పైనే పలుకుతోంది. ఆ లెక్కన భూమి విలువ రూ.500 కోట్లు పైనే ఉంటుంది. ఇంత ఆస్తి ఉన్న ఆ పెద్దమనిషి. తనకున్న భూమిలోని ఓ 5 గుంటల స్థలానికి రైతు బంధు' తీసుకుంటున్నాడు. రైతు భరోసా క్షేత్రస్థాయి సర్వేకి వచ్చిన అధికారులు ఆ 5 గుంటల స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు అద్దెకు ఇచ్చినట్టు గుర్తించారు. అటూ ఇటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు వంటి నిర్మాణాల మధ్య ఉండి, వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్న ఆ స్థలానికి పెట్టుబడి సాయం ఆగిపోకుండా చూడాలని సదరు రైతు అధికారులను వేడుకున్నాడు. దీంతో సర్వేకు వెళ్లిన సంగారెడ్డి అదనపు కలెక్టర్(రెవెన్యూ) మాధురి, బృందం కంగుతిన్నది. ఇదే కాదు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు' పథకం అమలులో

మిగతా 7వ పేజీలో...



రేవంత్, శ్రీధర్‌బాబు సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న ఐటీఈ, స్కిల్స్ వర్సిటీ ప్రతినిధులు

కళాశాలలో ఉండగానే..
కొలువు ఖాయం!

- తెలంగాణలో సింగపూర్ తరహా విద్యా విధానం
- ఆ దేశ ఐటీఈతో స్కిల్స్ యూనివర్సిటీ ఒప్పందం
- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సిలబస్
- పట్టా పొందగానే ఉద్యోగం దక్కేలా శిక్షణ
- విద్యా విధానంలో విప్లవాత్మకమన్న సీఎం రేవంత్
- ఐటీఈ ప్రతినిధులతో సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు భేటీ
- సింగపూర్ విదేశాంగ శాఖ మంత్రితోనూ సమావేశం

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాలేజీలో చదువుతుండగానే విద్యార్థికి ఉద్యోగావకాశం సిద్ధంగా ఉండే విద్యా విధానాన్ని తెలంగాణలో అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సింగపూర్‌లో ప్రభుత్వ అధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)లో ఈ విధానం అమల్లో ఉందని, దీనిని రాష్ట్రంలోని సాంకేతిక విద్యాసంస్థల్లో అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో తొలుత పూర్తిస్థాయిలో ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు, ఆ తర్వాత ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ లాంటి సాంకేతిక విద్యలో అమలు చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగపూర్ ఐటీఈ.. పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి, చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణనిస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫ్యూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం 100 ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ లభిస్తుంది. దీనికి తోడు ఐటీఈకి 5వేల

మిగతా 13వ పేజీలో...

డిస్కంలలో కొలువులు!
2812 జేఎల్‌ఎం, 330 సబ్ ఇంజనీర్, 118 ఏఈ పోస్టులు

భర్తీకి త్వరలో నోటిఫికేషన్ 13

విడిగా కాదు.. ఉమ్మడిగానే...
- దావో‌స్‌లో నేరుగా భారత్‌కే రాష్ట్రాల ప్రాతినిధ్యం
- కొత్తగా 'ఒక దేశం- ఒకే వేదిక'.. సమయం కుదింపు
- సదస్సుకు ఏపీ, తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలు

2

స్థానిక ఎన్నికలు
ఫిబ్రవరి చివర్లో?

- లేదా ఏప్రిల్‌లో నిర్వహించే యోచనలో సర్కారు!
- ఈ నెల 26 నుంచి గ్రామాల్లో పథకాల జాతర
- ఇదే వేడిలో జరిపితే ఉత్తమం అంటున్న నేతలు
- కోడ్ లోపు పథకాలు అమలు కాకుంటే ప్రభావం
- బీసీ రిజర్వేషన్ పెంపు కూడా చిక్కుముడే!
- రిజర్వేషన్లు పెంచాలని కేంద్రాన్ని కోరే యోచన
- ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేసే చాన్స్
- దావోస్ నుంచి సీఎం తిరిగి వచ్చాక స్పష్టత!



హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తులకు ఎన్నికలు ఫిబ్రవరిలోనే జరగనున్నాయా? ఈ నెల 26 నుంచి అమలు కానున్న పథకాల వేడిలోనే ఈ ఎన్నికలను కానిచ్చేందుకు రేవంత్ సర్కారు సన్నద్ధమవుతోందా? ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా జరుగుతున్న చర్చ ఇది. స్థానిక సంస్థలకు ఎన్నికలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఆయా సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో పడుతున్నాయి. దీనికితోడు ఎన్నికలను త్వరగా నిర్వహించాలంటూ స్థానిక నేతల నుంచి ప్రభుత్వంపై, పార్టీపై ఒత్తిడి పెరుగుతోంది. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా స్థానిక సంస్థలకు ఎన్నికలు త్వరగా జరపాలంటూ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిందని, కార్యకర్తలను, స్థానిక నాయకత్వాలనూ కాస్త పట్టించుకోవాలని నేతలకు చురకలు వేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి మూడు, నాలుగు

మిగతా 13వ పేజీలో...



ఫార్ములా-ఈ కేసులో నేడు
గ్రీన్‌కో ఎండీ విచారణ

- చలమలశెట్టి అనిల్‌ను ప్రశ్నించనున్న ఏసీబీ
- ఏస్ నెక్స్ట్‌జెన్ పుట్టుక, అంతర్ధానం వెనుక సంగతి ఏమిటన్న దానిపై విచారించే అవకాశం!
- బీఆర్‌ఎస్‌కు రూ.41 కోట్ల ఎన్నికల బాండ్లు
- ఫార్ములా-ఈ కథ మొదలైనప్పుడు రూ.31 కోట్లు
- ఒప్పందానికి 15 రోజుల ముందు 10 కోట్ల బాండ్లు
- కేటీఆర్‌కు అనిల్‌తో స్నేహం ఉందంటున్న కాంగ్రెస్

12



షాబాద్ రైతు ధర్నాలో మహిళతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

6 హామీల్లో అర గ్యారెంటీనే అమలు
- మహిళలకు ఉచిత బస్సు తప్ప మిగతావి తుస్సు
- రేవంత్.. రుణమాఫీపై గ్రామాల్లో తేల్చుకుందామా?
- ఈ నెల 26న రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలి
- లేదంటే వెంటాడుతాం.. ఎన్ని కేసులైనా తగ్గం: కేటీఆర్

హెచ్-1బీ కొత్త నిబంధనలు
అమల్లోకి..
భారత టెకీలకు మరింత మేలు

2

హైదరాబాద్ యువకుడు సాయి వర్షిత్‌కు 8 ఏళ్ల జైలు

వైట్‌హౌ‌స్‌పై దాడి యత్నం కేసు తీర్పు చెప్పిన అమెరికా కోర్టు

2



31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!
- తొలి విడత ఫిబ్రవరి 13 వరకు
- 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మల

2



ఇమ్రాన్‌కు 14 ఏళ్ల జైలు
- పాకిస్థాన్ మాజీ ప్రధానికి శిక్ష
- ఆయన సతీమణికి ఏడేళ్ల జైలు
- అవినీతి కేసులో కోర్టు తీర్పు

ఏపీ సీనియర్ ఐపీఎస్ సునీల్‌కు
బిగుస్తున్న ఉచ్చు!

- అగ్రిగోల్డ్ నకిలీ డిపాజిటర్ల పేరిట రూ. 7.2 లక్షలు స్వాహా
- సాంకేతికత అభివృద్ధి మాటున రూ. 75 లక్షల దోపిడీ
- బిల్లు అడిగిన కాంట్రాక్టర్‌పై కేసుల పేరిట బెదిరింపులు
- అక్రమార్జనతో వ్యాపారాలు
- ఏసీబీకి రఘురామ ఫిర్యాదు
- విచారణకు ఏపీ సర్కార్ ఆదేశం



అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ సర్కారు హయాంలో పలు అక్రమాలకు, అవినీతికి పాల్పడిన సీఐడీ మాజీ ఏడీజీ పీవీ సునీల్ కుమార్‌కు ఉచ్చు బిగుస్తోంది. 96 మంది నకిలీ డిపాజిటర్లను సృష్టించి అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించాల్సిన సొమ్ము రూ.7.2 లక్షలు స్వాహా చేశారని, సీఐడీలో సాంకేతికత అభివృద్ధి పేరుతో రూ.75లక్షలు

మిగతా 12వ పేజీలో...

బ్రిజేష్ ట్రిబ్యునల్-2పై 'స్టే' కోరదాం!
- 23న సుప్రీం కోర్టులో ఆ మేరకు విన్నవిద్దాం
- కృష్ణా జలాలపై ఏపీ ప్రభుత్వ నిర్ణయం

13

కర్ణాటకలో భారీ బ్యాంకు దోపిడీ

- తుపాకీ గురిపెట్టి రూ.10 కోట్ల పైగా చోరీ
- ఆయుధాలతో ఖాతాదార్లకు బెదిరింపులు
- లాకర్లలో నగదు, ఆభరణాల అపహరణ
- అంతా పది నిమిషాల వ్యవధిలోనే..
- బీదర్ ఘటన జరిగిన మరుసటి రోజే..
- పోలీసులపై సీఎం సిద్దరామయ్య ఆగ్రహం

2

ఆ దొంగలు ఎక్కడ?
- హైదరాబాద్ కాల్పుల ఘటనలో నిందితుల వేటకు 10 బృందాలు
- చోరీ బిహారీ అమిత్ గ్యాంగ్ పనే!
- బస్సులో అతడి పేరిటే టికెట్
- కాల్పుల తర్వాత సికింద్రాబాద్‌కు

3

మోసపూరిత కాల్స్, ఎస్ఎంఎస్‌లకు చెక్!

» 'సంచార్ సాథీ' మొబైల్ యాప్ తెచ్చిన డాట్

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలో 90 కోట్ల మందికి పైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులున్నారు. వీరిలో ఎందరో మోసపూరిత కాల్స్, ఎస్ఎంఎస్‌ల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు టెలికాం విభాగం (డాట్) చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా అనుమానిత కాల్స్, ఎస్ఎంఎస్‌లను మరింత సులభతరంగా రిపోర్ట్ చేయడానికి వీలుగా డాట్ 'సంచార్ సాథీ' పేరుతో మొబైల్ అప్లికేషన్‌ను తెచ్చింది. దీన్ని శుక్రవారం కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా విడుదల చేశారు. దీంతో వినియోగదారులు అనుమానిత కాల్స్, ఎస్ఎంఎస్‌లను తమ మొబైల్ ఫోన్ కాల్ లాగ్స్ నుంచి నేరుగా రిపోర్ట్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ కొత్త యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ మొబైల్ ఫోన్లకు అందుబాటులో ఉంది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ పేరు మీద జారీ అయిన అన్ని మొబైల్ కనెక్షన్ల గురించి కూడా తెలుసుకోవచ్చు. దీని వల్ల తమ పేరుపై ఉన్న అనధికార కనెక్షన్ల వినియోగం జరగకుండా చూసుకోవచ్చు. అలాగే పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్ల బ్లాకింగ్ సదుపాయం కూడా కల్పించారు. అంతేకాకుండా మొబైల్ ఫోన్ల ప్రామాణికతను సైతం తెలుసుకునే ఫీచర్ కూడా ఉంది. దీని వల్ల వినియోగదారులు



అసలైన డివైజ్‌లను కొనుగోలు చేసే అవకాశం ఏర్పడుతుంది. మోసపూరిత కాల్స్‌ను కట్టడి చేసేందుకు 2023లో డాట్ 'సంచార్ సాథీ' పోర్టల్‌ను ప్రారంభించింది. కొత్తగా తెచ్చిన యాప్ ద్వారా వీటికి మరింత సమర్థంగా చెక్ పెట్టే అవకాశం ఏర్పడనుంది. సంచార్ సాథీ మొబైల్ యాప్‌తో పాటు జాతీయ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0 విజన్, 'డిజిటల్ భారత్ నిధి'తో ఏర్పాటు చేసిన 4జీ మొబైల్ సైట్ల వద్ద ఇంట్రా సర్కిల్ రోమింగ్‌లను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు.

ఇంట్రా సర్కిల్ రోమింగ్‌తో టవర్ ఏదైనా సెల్ సిగ్నల్ పక్కా..

విజయవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీలో మారుమూల ప్రాంతాలు, గిరిజన గ్రామాల్లో సర్వీసు ప్రొవైడర్, అక్కడున్న సెల్‌టవర్‌తో సంబంధంలేకుండా మొబైల్ వినియోగదారులు ఇంట్రా సర్కిల్ రోమింగ్ ద్వారా సిగ్నల్స్‌ను పొందవచ్చని భారత టెలికాం శాఖ అదనపు డీజీ రాజారెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్ సమస్యను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్) ఏర్పాటు చేసిందని, ఇందులో బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో భాగస్వాములుగా ఉన్నాయన్నారు. డీబీఎన్, సంచార్‌సాథీ మొబైల్ యాప్‌లను కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించిన కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజారెడ్డి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. డీబీఎన్‌తో బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు.

లోకం తీరు

ఉచితాలు మంచివని బీజేపీ అంగీకరించాలి: కేజ్రీవాల్



ఫిబ్రవరి 15న సికింద్రాబాద్ నుంచి కుంభమేళాకు ప్రత్యేక రైలు!

» 8 రోజుల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పాల్గొనే భక్తుల కోసం ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ప్రత్యేక రైలును నడుపుతోంది. ఫిబ్రవరి 15న సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ రైలు 22న తిరిగి నగరానికి చేరుతుంది. వారంరోజుల పాటు జరిగే ఈ మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర ప్రత్యేక రైలుకు ఐఆర్‌సీటీసీ ప్యాకేజీని ప్రకటించింది. భక్తులు వారణసీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లను దర్శించుకుని ఎనిమిది రోజుల్లో తిరిగి చేరుకునేందుకు వీలుగా ఈ ప్యాకేజీని రూపొందించింది. మొత్తం 578 మంది సామర్థ్యంతో కూడిన ఈ రైలు ఫిబ్రవరి 15న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరి 18న ప్రయాగ్‌రాజ్‌కు చేరుతుంది. కుంభమేళాలో భక్తులు పాల్గొంటారు. 19న వారాణసీలో కాశీవిశ్వనాథ్, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణాదేవి ఆలయాలను దర్శించుకుని, ఆ రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకుని 20న అయోధ్య చేరుకుంటారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమి, హనుమాన్ గర్హిని సందర్శించిన అనంతరం తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. 22 రాత్రికి సికింద్రాబాద్ చేరుకుంటుంది. యాత్రికులు ఎక్కి, దిగేందుకు ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, చత్రపూర్, కుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలసూర్ స్టేషన్లలో ఆగుతుందని ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. యాత్ర ప్యాకేజీలో ఎకానమీ (ఎస్ఎల్) పెద్దలకు రూ.23,035, పిల్లలకు (5-11 ఏళ్లలోపు) రూ.22,140లుగా చార్జీలు ఖరారు చేశారు. ఏసీ బోగీల చార్జీలు వేరుగా ఉంటాయి.

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!

న్యూఢిల్లీ, జనవరి 17: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. ఈసారి కూడా రెండు విడతల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడత సమావేశాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు కొనసాగనున్నాయి. రెండో విడత సమావేశాలను దాదాపు నెల రోజుల విరామం తరువాత మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్నారు. కాగా, మొదటి విడత సమావేశాల తొలిరోజు ఈ నెల 31న లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. అనంతరం మరుసటి రోజు ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. 2025-26కు సంబంధించి కేంద్ర వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారు. బడ్జెట్‌ను నిర్మల ప్రవేశపెట్టడం వరుసగా ఇది 8వసారి కావడం గమనార్హం. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీయే సర్కారు మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రవేశపెడుతున్న పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే.

అమల్లోకి హెచ్-1బీ వీసా కొత్త నిబంధనలు..

న్యూఢిల్లీ, జనవరి 17: అమెరికాలో హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌కు సంబంధించి కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఇకపై ఎఫ్-1 వీసాలపై ఉన్న విద్యార్థులు హెచ్-1బీకి మారే ప్రక్రియ సరళతరం కానుంది. వీసా పొడిగింపు దరఖాస్తుల ప్రాసెసింగ్ ప్రక్రియ వేగవంతం కానుంది. దరఖాస్తుదారులు కొత్తగా ప్రవేశపెట్టిన ఐ-129 ఫాంను ఉపయోగించడం తప్పనిసరి చేశారు. కంపెనీలు తమ అవసరాలకు తగినట్లు నియామకాలు చేసుకొని పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకొనే అవకాశం కల్పించారు. లాటరీ విధానంలో బల్క్‌గా దరఖాస్తులు సమర్పించే కంపెనీలపై కఠిన నిబంధనలు విధిస్తారు. యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలు ఇకపై ఎలాంటి పరిమితి లేకుండా ఏడాది పొడవునా దరఖాస్తులు సమర్పించవచ్చు. 2023లో అమెరికా జారీ చేసిన 3,86,000 వీసాల్లో 72.3% భారతీయులే దక్కించుకున్న నేపథ్యంలో తాజా నిబంధనలు వారిపై సానుకూల ప్రభావం చూపించనున్నాయి. అలాగే హెచ్-1బీ వీసాలను అమెరికాలోనే పునరుద్ధరించే ప్రక్రియను ప్రవేశపెట్టడంతో అక్కడున్న భారతీయ టెకీలకు ప్రయోజనం చేకూరనుంది.

కెనడా వెళ్లారు... కాలేజీల్లో చేరలేదు!

» రిపోర్టు చేయని 20వేల మంది భారత విద్యార్థులు

అట్టవా, జనవరి 17: భారత్ నుంచి గతేడాది దాదాపు 2.5 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం కెనడాకు వెళ్లారు. అయితే వీరిలో సుమారు 20వేల మంది అక్కడి కాలేజీల్లో రిపోర్టు చేయలేదనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇది ఆ దేశంలో ఉన్న మొత్తం భారత విద్యార్థుల్లో 5.4 శాతానికి సమానం. కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ) నివేదిక ప్రకారం.. 2024 మార్చి, ఏప్రిల్ నెలల్లో దాదాపు 50వేల మంది అంతర్జాతీయ విద్యార్థులు స్టడీ పర్మిట్లు జారీ అయిన తర్వాత కూడా కళాశాలలకు హాజరు కాలేదు. వీరిలో భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నా. కాగా, చైనా నుంచి వచ్చిన వారిలో 6.4శాతం, ఫిలిప్పీన్స్ నుంచి 2.2శాతం మంది విద్యార్థులు కాలేజీల్లో చేరలేదని తేలింది.

రష్యాలో 16 మంది భారతీయుల మిస్సింగ్

» ఇప్పటి వరకు యుద్ధంలో 12 మంది మృత్యువాత: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 17: ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతున్న భారతీయుల్లో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 16 మంది ఆచూకీ తెలియడం లేదని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఓ ప్రకటన చేశారు. ఇప్పటి వరకు రష్యా తరఫున 126 మంది భారతీయులు యుద్ధంలో పాల్గొన్నారని చెప్పారు. వారిలో 96 మందిని రష్యా డిశ్చార్జి చేయడంతో కొందరిని స్వదేశానికి తీసుకువచ్చామని వెల్లడించారు. ఇంకా 18 మంది మాత్రం ఇప్పటికీ రష్యా ఆర్మీలో ఉన్నారని, వారిలో 16 మంది ఆచూకీ లేదని పేర్కొన్నారు. రష్యా వారిని కనిపించకుండా పోయినట్లు ప్రకటించిందన్నారు. మిగిలిన వారిని స్వదేశానికి పంపాలని రష్యాను భారత్ కోరిందని రణధీర్ జైస్వాల్ చెప్పారు.

ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందం రేపు అమల్లోకి!

» నేడు ఆమోదించనున్న నెతన్యాహు క్యాబినెట్

టెల్ అవీవ్, జనవరి17: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చించి ఆమోదం తెలిపేందుకు ఇజ్రాయెల్ కేబినెట్ ప్రత్యేకంగా సమావేశం కానుంది. నెతన్యాహు కేబినెట్ దీనికి ఆమోదం తెలిపితే ఆదివారం(ఈ నెల 19) నుంచి ఇది అమల్లోకి రానుంది. ఒప్పందం అమల్లోకి వస్తే 470 రోజులుగా జరుగుతున్న యుద్ధానికి తెరపడుతుంది. బుధవారం ఒప్పందం కుదిరినా చివరి దశలో కొన్ని చిక్కులు రావడంతో మధ్యవర్తిత్వం వహిస్తున్న అమెరికా- ఖతార్ వీటిని పరిష్కరించినట్లు తెలిసింది. మొత్తం 33 మంది బందీలను హమాస్ విడిచిపెట్టనుంది. ఇందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టాల్సి ఉంటుంది. అయితే ఎంతమంది ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెట్టనుందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. హమాస్ వద్ద ఇంకా ఎంతమంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా ఉన్నారనేది కూడా తెలియరాలేదు. కాగా, యుద్ధంలో ధ్వంసమైన గాజా తిరిగి కోలుకోవడానికి 350 సంవత్సరాలు పట్టవచ్చని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. 18.5 బిలియన్ల అమెరికా డాలర్ల నిధులు కనీసంగా అవసరమవుతాయని తెలిపింది.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ట్రంప్ ఫోన్

వాషింగ్టన్, జనవరి17: డొనాల్డ్ ట్రంప్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఫోన్ చేశారు. వాణిజ్యం, టిక్‌టాక్ తదితర అంశాలపై చర్చించారు. ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకోవాలని నిర్ణయించారు. కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని, అయితే ఒకరినొకరు గౌరవించుకుంటూ పరిష్కారం కోసం యత్నించాలని నిర్ణయించారు. జిన్‌పింగ్‌తో ఫోన్ సంభాషణ తర్వాత ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారా ఈ విషయాలు వెల్లడించారు. సంయుక్తంగా అనేక సమస్యలను పరిష్కరించగలమనే ధీమాను వ్యక్తం చేశారు. ఈ నెల 20న ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నారు.

బీజాపూర్‌లో 12 మంది మావోయిస్టుల హతం

» మృతుల్లో ఐదుగురు మహిళలు.. బస్తర్ ఐజీ సుందర్ వెల్లడి

చర్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారని, మృతులను గుర్తిస్తున్నామని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్‌కౌంటర్ వివరాలను వెల్లడించారు. సౌత్‌బస్తర్ డివిజన్‌లోని మల్లంపేట, మారేడుబాక అడవుల్లో హిడ్మాతో పాటు ఇతర సభ్యులు ఉన్నట్లు సమాచారం అందడంతో బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, కోబ్రా బలగాలు కూబింగ్ చేపట్టాయన్నారు. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ జరిగిందని చెప్పారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారని తెలిపారు. కాగా, హిడ్మా కోసం బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఇదిలా ఉండగా, బీజాపూర్ అడవుల్లో నక్సలైట్లకు చెందిన భారీ బంకర్‌ని కేంద్ర బలగాలు గుర్తించాయి. సుమారు 10 మీటర్ల పొడవుతో ఈ బంకర్‌ను పోలీసులు, డ్రోన్‌ల నుంచి తప్పించుకోవడం కోసం మావోయిస్టులు నిర్మించినట్లు భావిస్తున్నారు. ఇందులో ఆయుధాలను తయారుచేసే ఫ్యాక్టరీ తరహాలో ఏర్పాట్లు ఉన్నాయి.

గర్భిణులకు రూ.21వేలు

ఆరు పోషకాహార కిట్లు కూడా.. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

» మహిళలకు నెలకు రూ.2,500

» ఢిల్లీ ఓటర్లపై బీజేపీ వరాల వర్షం

న్యూఢిల్లీ, జనవరి 17: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రజలపై బీజేపీ వరాల వర్షం కురిపిస్తోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన హామీలతో బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం సంకల్ప్ పత్ర్ పేరిట దానిని విడుదల చేశారు. అందులో ఢిల్లీలో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తే గర్భిణులకు రూ.21 వేల ఆర్థిక సాయం, ఆరు పోషకాహార కిట్లు అందిస్తామని ప్రకటించారు. వాటితో పాటు ప్రస్తుతం అందిస్తున్న మొదటి కాన్పుకు రూ.5 వేలు, రెండు కాన్పుకు రూ. 6 వేల సహాయం కొనసాగిస్తామని చెప్పారు. అలాగే మహిళా సమృద్ధి యోజన కింద మహిళలకు ప్రతినెలా రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్ అందించడంతో పాటు హోలీ, దీపావళి పండుల సందర్భంగా ఒక్కొక్క సిలిండర్ ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఇక 60 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న వృద్ధులకు నెలకు రూ.2,500, 70 ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు, వితంతువులకు నెలకు రూ.3000 వేల సాయం ఇస్తామని ప్రకటించారు. అయుష్మాన్ భారత్ అమలు చేస్తామని, దీనికి అదనంగా రూ.5 లక్షల కవరేజీ ఇస్తామని ప్రకటించారు. అటల్ క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి రూ.5 లకే భోజనం అందిస్తామని ప్రకటించారు.



బీజేపీ సంకల్ప పత్ర విడుదల సందర్భంగా విలేకరులతో మాట్లాడుతున్న నడ్డా

ఉచితాలపై మోదీ ఏమంటారు: కేజ్రీవాల్

ఢిల్లీ ఎన్నికల వేళ బీజేపీ ఉచిత పథకాలు ప్రకటించడంపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. ఆప్‌ను కాపీ కొట్టి బీజేపీ పథకాలను ప్రకటించిందని ఆయన ఆరోపించారు. కేజ్రీవాల్ ఉచితాలు ఇస్తారని బీజేపీ నన్ను విమర్శించేది, ఇప్పుడు ఆ పార్టీనే ఢిల్లీ ప్రజలకు ఉచితాలు ప్రకటించిందని మండిపడ్డారు. 'ఇంతకాలం ఉచితాలు మంచివి కావని మోదీ అన్నారు. కానీ వారి మేనిఫెస్టో ద్వారా ఇన్నాళ్లు వారు అన్నవి తప్పని తేలింది. ఉచితాలు హానికరం కాదని, మంచివేనని ప్రధాని ఇప్పుడు అంగీకరించాల'ని డిమాండ్ చేశారు. బీజేపీ మేనిఫెస్టోను అబద్ధాల కట్ట అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. మరోవైపు ఢిల్లీలో విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. మెట్రోలో 50 శాతం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడిపే అన్ని ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తున్నామని గుర్తు చేశారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ దాఖలుకు ఆఖరి రోజైన శుక్రవారం బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

ఏఐతో ఆప్ దూకుడు

ఢిల్లీ పీఠాన్ని వరుసగా మూడోసారి దక్కించుకోవడానికి ఆమ్ ఆద్మీ పార్టీ అందివచ్చిన ప్రతి అవకాశాన్ని తన ఎన్నికల ప్రచారానికి వాడేస్తోంది. ఫిబ్రవరి 5న జరిగే ఎన్నికల కోసం అటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, ఇటు సంప్రదాయ ప్రచారాన్ని కొనసాగిస్తూ దూసుకెళుతోంది. విపక్ష నేతలపై ఏఐ సాయంతో కామెడీ కంటెంట్‌తో వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ.. మరోపక్క ర్యాలీలు, పాదయాత్రలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా బీజేపీ నేతలను లక్ష్యంగా చేసుకున్న స్వాప్ వీడియోలు ఆప్ ప్రచారంలో కీలకంగా మారాయి.

ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ అమలుపై సుప్రీంకోర్టు స్టే

ఆరోగ్య పథకాల అమలు విషయమై కేంద్రంతో ఒప్పందం చేసుకోవాలంటూ ఢిల్లీ ప్రభుత్వానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై శుక్రవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. కేంద్రం అమలు చేసే పీఎం-ఆయుష్మాన్ భారత్, ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ఉద్దేశించిన పీఎం-అభీం పథకాల అమలుపై జనవరి 5లోగా కేంద్రంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాలని గత నెల 24న హైకోర్టు ఆదేశించింది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కేంద్ర పథకాలను అమలు చేస్తుండగా, ఒక్క ఢిల్లీ ప్రజలే ఆ సేవలకు ఎందుకు దూరం కావాలంటూ ఈ ఉత్తర్వులిచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ కేంద్రంతో ఎంఓయూ కుదుర్చుకోవాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం స్టే ఇచ్చింది.

తుపాకీ గురిపెట్టి రూ.10 కోట్లు చోరీ

» కర్ణాటకలో పట్టపగలే బ్యాంకు దోపిడీ

» పోలీసులు ఏం చేస్తున్నారు: సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బీదర్‌లో సెక్యూరిటీ వాహనంపై కాల్పులు జరిపి, ఏటీఎంలో పెట్టాల్సిన రూ.93 లక్షలను దోచుకువెళ్లిన మరుసటి రోజే.. దుండగులు మంగళూరు సమీపంలో ఏకంగా బ్యాంకును దోచుకోవడం కలకలం రేపుతోంది. దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల తాలూకా కేసీ రోడ్డులోని కోటికారు వ్యవసాయ సేవా సహకార సంఘం(వీఎస్ఎస్) బ్యాంకులో శుక్రవారం మధ్యాహ్నం మరో భారీ చోరీ జరిగింది. ఆయుధాలతో వచ్చిన దుండగులు బ్యాంకులో ఉన్న రూ.10 కోట్లకు పైగా నగదు, ఆభరణాలను దోచుకుపోయారు. ఐదుగురు దొంగలు కారులో వచ్చి బ్యాంకులోకి ప్రవేశించారు. తుపాకులు, తల్వార్‌లతో ఖాతాదారులు, ఉద్యోగులను బెదిరించారు. క్యాషియర్ వద్ద ఉన్న నగదును తీసుకున్నారు. సేఫ్ రూం నుంచి అప్పుడే బయటకు వచ్చిన మేనేజర్‌కు తుపాకీ గురిపెట్టి, సేఫ్ రూమ్‌ను తెరిపించారు. లాకర్లలోని నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని వచ్చిన కారులో పరారయ్యారు. చోరీ జరిగిన బ్యాంకును ఉళ్లాల ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ పరిశీలించారు. దోపిడీ దొంగల ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. కేవలం పది నిమిషాల వ్యవధిలో దోపిడీ చేశారని బ్యాంకు ఉద్యోగి రామచంద్ర తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో రిపేర్ చేసేందుకు ఓ వ్యక్తి వచ్చాడు. దొంగలు వచ్చే సమయానికి సీసీ కెమెరాలను పూర్తిగా విప్పి పరిశీలిస్తుండగా, అతడి ఉంగరాన్ని కూడా లాక్కున్నారు. ఈ మార్గంలో బ్యాంకులో తప్ప మరెక్కడా సీసీ కెమెరాలు లేవు. కాగా, మంగళూరులో సీఎం పర్యటన ఉండటంతో ఎక్కువమంది పోలీసులు బందోబస్తు నిమిత్తం వెళ్లారు. బ్యాంకు దోపిడీపై సీఎం సిద్దరామయ్య తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సైఫ్‌పై దాడిలో అండర్‌వరల్డ్ హస్తం లేదు

» మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ స్పష్టీకరణ

ముంబై, జనవరి 17: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి వెనుక అండర్‌వరల్డ్ గ్యాంగ్ హస్తం లేదని.. మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ అన్నారు. సీసీటీవీ ఫుటేజీ వీడియోల ఆధారంగా.. అనుమానితుడి ముఖకవళికలున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, మరొక వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేస్తున్నారని మంత్రి తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తికి క్రిమినల్ రికార్డు ఉందని వెల్లడించారు. ఈ దాడి వెనుక నేరముఠాల పాత్ర ఏమైనా ఉందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. అలాంటిదేమీ లేదని ప్రాథమిక విచారణలో తేలిందని, నిందితుడు చోరీ చేసే ఉద్దేశంతోనే వచ్చినట్టు కనిపిస్తోందని బదులిచ్చారు. తనకు ముప్పు ఉన్నట్టుగా సైఫ్ నుంచి పోలీసులకు ఇప్పటిదాకా సమాచారమేదీ లేదని.. ఆయన ఎలాంటి సెక్యూరిటీ కోరలేదని, ఒకవేళ కోరితే నిబంధనల మేరకు వ్యవహరిస్తామని ఆయన వెల్లడించారు. కాగా, సైఫ్‌పై దాడి జరిగిన ఫ్లాట్ వద్ద అసలు నిఘా కెమెరాలేవీ లేవని పోలీసు వర్గాల సమాచారం. అపార్ట్‌మెంట్ భవనంలో అమర్చిన సీసీ కెమెరా ఫుటేజీ ద్వారానే అనుమానితుణ్ని గుర్తించారు.

వేతనాలు ఎంత పెరుగుతాయి?

» 8వ వేతన కమిషన్‌తో పలు అంచనాలు

» వేతన పెంపు రూ.45 వేల వరకూ!

న్యూఢిల్లీ, జనవరి 17: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్ల కోసం 8వ వేతన కమిషన్‌ను నియమిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించటంతో.. వేతనాలు, పింఛన్లు ఏ మేరకు పెరుగుతాయన్న దానిపై రకరకాల విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ మేరకు ప్రముఖ బిజినెస్ పత్రిక 'ఎకనమిక్ టైమ్స్' పలువురు నిపుణులను సంప్రదించి వారి అభిప్రాయాలను వెల్లడించింది. టీమ్ లీజ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణేందు చటర్జీ స్పందిస్తూ.. 'ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఉద్యోగుల వేతనాలు సగటున రూ.40 వేల నుంచి రూ.45 వేల మధ్యన పెరగవచ్చు' అని తెలిపారు. ఈసారి పనితీరు ఆధారిత వేతన పెంపు అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. 'కింగ్ స్టబ్ అండ్ కాసివా' అనే సంస్థకు చెందిన రోహితాశ్వ సిన్హా మాట్లాడుతూ.. కొత్త వేతన కమిషన్ వల్ల మూల వేతనంలో 186% పెంపు ఉండవచ్చని, తద్వారా కనీస మూల వేతనం నెలకు రూ.51,480కి పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్‌కేవీ లా ఆఫీసర్స్ సీనియర్ అసోసియేట్ నీహాల్ భరద్వాజ్.. గత పే కమిషన్ల ద్వారా సంభవించిన వేతనాల పెంపును దృష్టిలో పెట్టుకొని చూస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు 25-30% పెరిగే అవకాశం ఉందన్నారు. 2006-16 కాలవ్యవధికి సంబంధించి ఏర్పాటైన 6వ వేతన కమిషన్ వేతనాల్లో 40 శాతం పెంపునకు సిఫార్సు చేయగా, 2016-26కి సంబంధించిన 7వ వేతన కమిషన్ 23-25% వేతన పెంపును సిఫార్సు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

విడిగా కాదు..ఉమ్మడిగానే

దావోస్‌లో నేరుగా భారత్‌కే రాష్ట్రాల ప్రాతినిధ్యం

కొత్తగా 'ఒక దేశం- ఒకే వేదిక' విధానం

రాష్ట్రాలకు ఇస్తున్న సమయం కుదింపు

సదస్సుకు తెలంగాణ సీఎం రేవంత్

న్యూఢిల్లీ, జనవరి 17: దావోస్ సదస్సు అంటేనే పెట్టుబడుల వేట. మనదేశం నుంచి వెళ్లే పలు రాష్ట్రాల ప్రతినిధులు అధిక పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటాపోటీగా తలపడే ప్రపంచ వేదిక అది. అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా ఒక టీమ్‌ను పంపుతుంది. 'ఒక దేశం-పలు వేదికలు' అన్నట్టు ఇప్పటివరకు నడిచింది. మరిన్ని గ్లోబల్ కంపెనీలను ఆకట్టుకుందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు తమలో తాము ఈ వేదికపై తీవ్రంగా తలపడుతుండేవి. అయితే, ఈసారి ఇటువంటి దృశ్యాలు దావోస్ సదస్సులో కనిపించకపోవచ్చు. ఈ నెల 20 నుంచి ఐదు రోజులు జరిగే ఈ సదస్సులో మునుపటిలా ఆర్థిక ప్రయోజనాలు రాబట్టుకునేందుకు మన రాష్ట్రాలు సాగించే పరస్పర బాహాబాహీలకు వీలులేకపోవచ్చు. 'ఒక దేశం-ఒకే వేదిక' అనే విధానాన్ని ఈ సదస్సును నిర్వహిస్తున్న దావోస్ సిటీ కౌన్సిల్ ముందుకు తేవడమే దీనికి కారణం. ఒక దేశం నుంచి ఒక ప్రాతినిధ్యం సరిపోతుంది కదా అని కౌన్సిల్ అభిప్రాయపడినట్టు 'మనీ కంట్రోల్' అనే పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఈ కథనం ప్రకారం.. ఈసారి తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలు దావోస్ సదస్సులో పాల్గొంటున్నాయి. అయితే కొత్త విధానం ప్రకారం ఈ రాష్ట్రాలకు ఇస్తున్న ప్రాధాన్యం, సమయం కూడా ఈసారి బాగా తగ్గిపోనుంది. తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఈ దస్సుకు హాజరు కానున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ కూడా సదస్సుల్లో పాల్గొంటారు. ఇక.. కర్ణాటక, కేరళ, యూపీ నుంచి మంత్రులు హాజరవుతారు. కేంద్ర ప్రభుత్వం కూడా మంత్రుల బృందాన్ని పంపిస్తోంది. అయితే, రాష్ట్రాలన్నీ ఒకే గొడుగు కింద పనిచేయాలన్న నిర్ణయంపై కర్ణాటక అసంతృప్తి వ్యక్తం చేసింది. తన ప్రతినిధి బృందాన్ని పంపడానికి దావోస్‌కు పంపించడానికి నిరాకరించింది.



గతేడాది దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో రేవంత్

హైదరాబాద్ యువకుడికి అమెరికాలో 8 ఏళ్ల జైలు శిక్ష

» 2023లో ట్రక్కుతో వైట్‌హౌస్‌పై దాడికి యత్నించిన సాయి వర్షిత్

» అతనివి నాజీ సిద్ధాంతాలు: అమెరికా

వాషింగ్టన్, జనవరి 17: అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌పై ట్రక్కుతో దాడికి యత్నించిన తెలుగు యువకుడు సాయి వర్షిత్ కందుల(20)కు అమెరికాలోని జిల్లా కోర్టు 8 ఏళ్ల జైలు శిక్షను విధించింది. ఆయన విడుదల అయిన తర్వాత కూడా మూడేళ్ల పాటు పర్యవేక్షణ కొనసాగుతుందని జడ్జి డాబ్నే ఎల్ ఫ్రెడ్‌రిచ్ తన ఆదేశాల్లో స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని చందానగర్‌లో జన్మించిన సాయి వర్షిత్.. తర్వాత అమెరికా వెళ్లి గ్రీన్ కార్డు పొందారు. అయితే, 2023, మే 22న ఓ ట్రక్కును అద్దెకు తీసుకుని వైట్ హౌస్‌పై దాడికి యత్నించారు. తాజాగా ఈ కేసు విచారణ పూర్తయింది. "నియంత నాజీ సిద్ధాంతాలను ఒంటబట్టించుకున్న సాయి వర్షిత్.. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన అమెరికా ప్రభుత్వాన్ని కూల్చేసే ప్రయత్నం చేశారు" అని అమెరికా న్యాయ శాఖ నిప్పులు చెరిగింది. సాయి తన నేరాన్ని అంగీకరించినట్టు తెలిపింది. కోర్టుకు సమర్పించిన నివేదికల ప్రకారం.. 2023, మే 22న సాయి సెయింట్ లూయిస్ నుంచి వాషింగ్టన్ డీసీకి చేరుకున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో ఓ ట్రక్కును అద్దెకు తీసుకుని శ్వేత సౌధం వైపు దూసుకువెళ్లారు. ఈ క్రమంలో వైట్ హౌస్ సహా ప్రెసిడెంట్ పార్క్‌కు రక్షణగా ఉన్న బారికేడ్లు ధ్వంసమయ్యాయి. అనంతరం ట్రక్కు నుంచి దిగిపోయిన సాయి.. దాని వెనుకకు వెళ్లి ట్రక్కుకు కట్టిన 'నాజీ-స్వస్తిక్' ముద్రలున్న తెల్లటి బ్యానర్లను తొలగించారు. ఈ సమయంలోనే పోలీసులు సాయిని అరెస్టు చేశారు. కాగా, డ్రగ్స్ కేసుల్లో దీర్ఘకాలంగా జైల్లో మగ్గుతున్న 2500 మందికి అమెరికా అధ్యక్షుడు బైడెన్ శుక్రవారం క్షమాభిక్ష ప్రసాదించారు. తద్వారా అమెరికా అధ్యక్షులుగా చేసిన వారిలో ఇప్పటి వరకు ఎవరూ ప్రసాదించని క్షమాభిక్షలు, శిక్ష తగ్గింపులు చేసిన అధ్యక్షుడిగా బైడెన్ రికార్డు సృష్టించినట్టు అయింది.



సాయి వర్షిత్ (ఫైల్)

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

» ఆయన సతీమణికి ఏడేళ్ల శిక్ష

» మరో అవినీతి కేసులో పాక్ కోర్టు తీర్పు

ఇస్లామాబాద్, జనవరి 17: ఒక అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, ఆయన సతీమణి బుష్రా బీబీలకు వరుసగా 14, ఏడేళ్ల జైలుశిక్షలు విధిస్తూ పాకిస్థాన్ కోర్టు ఒకటి శుక్రవారం తీర్పు ఇచ్చింది. 190 మిలియన్ పౌండ్ల అల్ ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో ఈ ఇద్దరిని దోషులుగా నిర్ధారించి కోర్టు శిక్ష విధించింది. ఇమ్రాన్‌ఖాన్‌ను ఉంచిన అదీల జైలులో ఏర్పాటు చేసిన తాత్కాలిక కోర్టులో జడ్జి ఈ తీర్పు ఇవ్వడం విశేషం. ఇమ్రాన్‌ఖాన్‌కు జైలు శిక్షతో పాటు పది లక్షల పాకిస్థాన్ రూపాయల జరిమానా, బుష్రా బీబీకి జైలుశిక్షతోపాటు 5 లక్షల పాకిస్థాన్ రూపాయల జరిమానా కూడా విధించడం గమనార్హం. అలాగే ఇమ్రాన్‌ఖాన్ దంపతులు ఏర్పాటు చేసిన అల్ ఖాదిర్ విశ్వవిద్యాలయం భూమిని కూడా జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. కాగా ఇమ్రాన్‌ఖాన్ ఇప్పటికే జైలులో ఉండగా... ఆయన సతీమణిని కోర్టు వద్దే తీర్పు అనంతరం అరెస్టు చేశారు. 2022లో పాక్ పార్లమెంటులో విశ్వాస పరీక్ష ఓడిపోయిన నాటి నుంచి ఇమ్రాన్‌ఖాన్ 12 కేసులను ఎదుర్కొంటున్నారు. తాను వాటి నుంచి ఎటువంటి ఉపశమనం కోరుకోవడం లేదని, ఆ కేసులను ఎదుర్కొంటానని.. ఒక నియంత దీనంతటికి కారణమని ఆయన అన్నట్లు సమాచారం.

ఆ దోపిడీ దొంగలు ఎక్కడ?

అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో నిందితుల వేటలో 10 పోలీసు బృందాలు

- బిహార్‌కు చెందిన అమిత్ గ్యాంగ్ పనే!
- ట్రావెల్స్ బస్సులో అమిత్ పేరిటే టికెట్ బుక్

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక బీదర్‌లో, హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లో కాల్పులతో కలకలం సృష్టించిన దోపిడీ దొంగల కోసం హైదరాబాద్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర ఆధ్వర్యంలో 10 పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. బీదర్‌లో వివిధ ఏటీఎంలలో నింపాల్సిన రూ.93 లక్షలను పథకం ప్రకారం కొట్టేసిన దొంగలు, అడ్డొచ్చిన సెక్యూరిటీ గార్డులపై కాల్పులు జరిపి, పరారయ్యారు. డబ్బును బ్యాగుల్లో సర్దుకొని హైదరాబాద్ మీదుగా రాయ్‌పూర్ వెళ్లేందుకు పథకం వేసిన దొంగలు అఫ్జల్‌గంజ్‌లో రోషన్ ట్రావెల్స్ బస్సును ఎక్కడానికి ప్రయత్నించారు. బస్సెక్కుతుండగా లగేజీని చెక్ చేసుకోవాలని జహంగీర్ (40) అనే బస్సు క్లీనర్ చెప్పగా ఆగ్రహించిన దొంగలు తమ వద్ద తుపాకీతో అతడిపై కాల్పులు జరిపారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒక సెక్యూరిటీ గార్డు ప్రాణాలు కోల్పోయాడు. మరో సెక్యూరిటీ గార్డు తీవ్రగాయాలతో చావు బతుకుల మధ్య ఉన్నాడు. అఫ్జల్‌గంజ్‌లో కాల్పుల అనంతరం దుండగులు.. అక్కడి స్వీకార్ హోటల్ వద్ద ఆటో ఎక్కి, సిద్దంబర్ బజార్, ఎంజే మార్కెట్, ట్యాంక్‌బండ్ మీదుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌వైపు పారిపోయినట్లు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. రాత్రి 8 గంటలకు రైల్వేస్టేషన్ పరిసరాల్లో దొంగలు తిరిగినట్లు ఆధారాలు లభించాయి. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. వారు ఎక్కడ దిగారు? ఆటోలో ఏం మాట్లాడుకున్నారు? అనే విషయాలు తెలిసినట్లు సమాచారం. అయితే ఆ వివరాలేవీ పోలీసులు వెల్లడించలేదు. రాత్రి 8 గంటల తర్వాత సికింద్రాబాద్ నుంచి చత్తీస్‌గడ్ వెళ్లిన రైళ్లపై దృష్టి సారించిన పోలీసులు దొంగలను గుర్తించి పట్టుకోవడానికి, వారి జాడ తెలుసుకోవడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఫొటోలతో రైల్వే పోలీసుల సహకారం కూడా తీసుకున్నట్లు తెలిసింది. దొంగలు రాత్రికి రాత్రే రైల్లోగానీ, రోడ్డు మార్గం ద్వారా గానీ.. నగరం విడిచి వెళ్లారా? లేక నగరంలోనే ఎక్కడైనా ఆశ్రయం పొంది నక్కి ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నగరంలోని లాడ్జిలు, హోటళ్లు, వసతి గృహాలపై పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని హోటళ్లు, లాడ్జిలు, వసతి గృహాలకు ఎవరైనా కొత్తవాళ్లు వచ్చినా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే తెలియజేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

నిందితుడిపై 10 మర్డర్ కేసులు

బీదర్, హైదరాబాద్ పోలీసులకు దొరికిన ప్రాథమిక ఆధారాల ప్రకారం.. దుండగులు బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ దొంగల ముఠాగా నిర్ధారించినట్లు తెలిసింది. రోషన్ ట్రావెల్స్ బస్సులో అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అందులో ఇచ్చిన ఫోన్ నంబర్ మాత్రం అతడిది కాదని తెలిసింది. ఆ ఫోన్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించగా.. నిందితులు బిహార్‌కు చెందిన ముఠాగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. కాగా అమిత్ కుమార్ గ్యాంగ్‌పై బిహార్‌లో ఇప్పటికే 10 మర్డర్‌కేసులు ఉన్నట్లు బిహార్ పోలీసులు హైదరాబాద్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

కోలుకుంటున్న జహంగీర్

బిహార్ గ్యాంగ్ కాల్పుల ఘటనలో గాయపడిన జహంగీర్ (40) శాలిబండలోని అస్రా ఆస్పత్రిలోని అత్యవసరం విభాగంలో చికిత్స పొందుతున్నాడు. అతడికి పొత్తి కడుపు, ఎడమ కాలు తొడ భాగంలో తూటాలు దూసుకెళ్లాయి. వాటిని శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. జహంగీర్ కోలుకుంటున్నాడని అక్కడి వైద్యులు తెలిపారు. కాల్పుల విషయం తెలియడంతో జహంగీర్ భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఆస్పత్రికి వచ్చి.. అతడిని చూసి భోరున విలపించారు. అతడి ప్రాణాలను కాపాడాలంటూ వారు వైద్యులను వేడుకోవడం అక్కడున్నవారిని కలిచివేసింది. కాగా బస్సు ఎక్కే సమయంలో బ్యాగులను తనిఖీ నిందితుల్లో ఒకరు జహంగీర్‌కు రూ.50వేలు ఇస్తామని ఆశ చూపించినట్లు తెలిసింది. ఆ డబ్బును అతడు తీసుకోకుండా తనిఖీకి పట్టుబట్టడంతోనే కాల్పులు జరిపినట్లు సమాచారం.

గ్యాస్ స్టవ్ పరికరాల్లో హెరాయిన్..
బైక్ ట్యాక్సీల ద్వారా డోర్ డెలివరీ

- హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు
- 190 గ్రాముల హెరాయిన్ స్వాధీనం, ఇద్దరి అరెస్టు

హైదరాబాద్ సిటీ/నేరేడ్‌మెట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ స్టవ్‌ల రిపేర్ల వ్యాపారం మాటున హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా చేస్తోన్న ఓ ముఠా గుట్టురట్టయింది. గ్యాస్‌స్టవ్ పరికరాల్లో హెరాయిన్ దాచిపెట్టి బైక్ ట్యాక్సీల ద్వారా వినియోగదారులకు డ్రగ్స్ డోర్ డెలివరీ చేస్తున్న ముఠాకు చెందిన ఇద్దరిని ఎల్బీనగర్ ఎస్ఓటీ, నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23లక్షల విలువైన 190 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. వారి కథనం మేరకు.. రాజస్థాన్ జోధ్‌పూర్‌కు చెందిన మహేష్ సరెమ్ (28), మహిపాల్ (19) నేరేడ్‌మెట్‌లోని సైనిక్‌నగర్‌లో వేర్వేరుగా నివాసముంటున్నారు. గ్యాస్ స్టవ్‌ల మరమ్మతు పనులు చేస్తూ ఉపాధి పొందే వీరు విలాసాలకు అలవాటు పడి.. పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ వ్యాపారంలోకి దిగారు. ఇందులో భాగంగా రాజస్థాన్‌లోని లోహటీ గ్రామానికి చెందిన షంషుద్దీన్ అనే వ్యక్తికి మహేష్ రూ.లక్ష ఇచ్చి 200 గ్రాముల హెరాయిన్ కొనుగోలు చేశాడు. ఆ హెరాయిన్‌ను రైలు మార్గంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి మహిపాల్ ఇంట్లో ఉంచాడు. వీరిద్దరూ కలిసి నగరంలోని వినియోగదారులకు హెరాయిన్ సరఫరా చేసేవారు. అయితే, వినియోగదారులను నేరుగా కలవకుండా పీకే గౌతమ్ అలియాస్ ప్రకాష్, సురేష్ అలియాస్ నితిష్ బిష్ణోయ్, వినోద్ అలియాస్ సోహూ బిష్ణోయ్, ముఖేష్ కుమార్ ద్వారా దందా చేస్తున్నారు. వీరంతా కలిసి గ్యాస్‌స్టవ్ పరికాల మధ్య హెరాయిన్‌ను పెట్టి.. ర్యాపిడో, ఓలా, ఉబెర్ యాప్‌ల్లో బైక్‌లు బుక్ చేసి వాటిని వినియోగదారులకు పంపేవారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మహేష్, మహిపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. కాగా, డ్రగ్స్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో 2024 నుంచి వివిధ కేసుల్లో రూ.88.83 కోట్ల విలువైన పలు రకాల డ్రగ్స్‌ను సీజ్ చేశామని సీపీ సుధీర్‌బాబు ఈ సందర్భంగా ప్రకటించారు.

ఎడతెగని 'మంచు' ఎపిసోడ్

- ఎంబీయూ వద్ద ఘటనపై పరస్పర ఫిర్యాదులు
- ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన ఏపీ పోలీసులు

చంద్రగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంచు కుటుంబంలో వివాదాల ఎపిసోడ్ కొనసాగుతూనే ఉంది. తాజాగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం (ఎంబీయూ) వద్ద జరిగిన ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మంచు మనోజ్, ఆయన భార్య భూమా మౌనికరెడ్డి ఈనెల 15న శ్రీవిద్యానికేతన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు వెళ్లకూడదని పోలీసులు చెప్పడంతో అక్కడి నుంచి డెయిరీ ఫామ్ వద్ద ఉన్న తన తాత, నానమ్మల సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోజ్ దౌర్జన్యంగా అక్కడున్న సిబ్బందిని బూతులు తిడుతూ, రాళ్లతో దాడి చేసి, లోపలికి ప్రవేశించారని మోహన్‌బాబు పీఏ చంద్రశేఖర నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మనోజ్, మౌనికారెడ్డి, వారి అనుచరులు, మరి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా తన భార్యతో కలిసి సంక్రాంతికి శ్రీవిద్యానికేతన్‌కు వస్తే ఎంబీయూ సిబ్బంది విజయసింహా, సురేంద్ర, బాలాజీ, సారథి, కిరణ్, రవిశేఖర్, హేమాద్రి, జీఎం చంద్రశేఖర్, కేవీఎస్ మణి, మరికొందరు తమపై దౌర్జన్యం చేశారని మనోజ్ ఫిర్యాదు చేశారు. వీళ్లు ఇది వరకే తమపై హత్యాయత్నం చేశారని, వారి నుంచి తప్పించుకున్నానని పేర్కొన్నారు. మనోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులపై పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

పీజీ రేడియాలజీ పరీక్షకు పాత ప్రశ్నపత్రం

- కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారుల నిర్లక్ష్యం

వరంగల్ మెడికల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పీజీ రేడియాలజీ డయాగ్నోసిస్ పరీక్షల్లో కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారుల నిర్లక్ష్యం మరోమారు వెలుగుచూసింది. 2023 నవంబరు నాటి పరీక్షకు ఇచ్చిన ప్రశ్నపత్రాన్నే ఈ నెల 16న జరిగిన పేపర్3 పరీక్షలో ఇచ్చారు. అది కూడా అప్పటి కోడ్ నంబరుతోనే ఇవ్వడం గమనార్హం. గత ప్రశ్నపత్రమే మళ్లీ రావడంతో విద్యార్థులు విస్మయానికి గురయ్యారు. గతంలో ఎంబీబీఎస్ వార్షిక పరీక్షల్లో కూడా మొదటి సంవత్సరం విద్యార్థులకు బయో కెమిస్ట్రీ పేపర్ 1, పేపర్ 2లలో సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చినట్టు ఆరోపణలు వచ్చాయి. తాజాగా రేడియాలజీ డయాగ్నోసిస్ 3 పరీక్షకు పాత పేపరే ఇచ్చి నిర్లక్ష్యాన్ని మరోసారి చాటుకున్నారు. వర్సిటీలో అన్ని రకాల వార్షిక పరీక్షలకు నిపుణులతో పరీక్ష పేపర్‌ను తనిఖీ చేయిస్తారు. పరీక్షల నియంత్రణ అధికారితోపాటు సదరు సబ్జెక్టుకు సంబంధించిన మోడరేటర్ 9 గంటలకు పరీక్ష ఉంటే 8 గంటలకల్లా విశ్వవిద్యాలయంలో పరీక్ష పత్రాన్ని క్షుణ్నంగా పరిశీలించాలి. అనంతరం పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు ఆన్‌లైన్ ద్వారా విశ్వవిద్యాలయంలోని అన్ని వైద్య కళాశాలలకు పేపర్‌ను పంపాలి. పకడ్బందీగా జరగాల్సిన ఈ ప్రక్రియ విషయంలో కాళోజీ విశ్వవిద్యాలయం విఫలమవుతోందని, యూనివర్సిటీ ప్రతిష్ఠ మసకబారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు గుణపాఠం తప్పదు

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి గుణపాఠం తప్పదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలే ఢిల్లీలో పునరావృతం కాబోతున్నాయని చెప్పారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. హామీలను తుంగలో తొక్కే పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. తెలంగాణలో ఎన్నికల హామీలను అమలు చేస్తున్నట్లు సీఎం రేవంత్ ఢిల్లీలో చేసిన ప్రకటనపై డీకే అరుణ స్పందించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా రేవంత్ ఇలాగే ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదని తెలిపారు. ఫార్ములా- ఈ రేసు కేసుకు సంబంధించి ఈడీ విచారణలో అధికారులు కేటీఆర్‌ను ఏం అడిగారో.. ఆయన ఏం చెప్పారో ఎవరికీ తెలియదన్నారు. అమెరికా రిసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్‌ను సమర్థించడం దేశ ద్రోహమే అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ అన్నారు. జాతి వ్యతిరేక శక్తులకు మద్దతు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పసుపు సేద్యం

మన సంస్కృతీ సంప్రదాయాలలో పసుపు ప్రాధాన్యం గురించి సంపూర్ణ అవగాహన లేనివారు సైతం ఆ సుగంధ ద్రవ్యం ఆరోగ్యవర్ధిని అని చెప్పడం కద్దు. ముఖ్యంగా కోవిడ్ భయానక అనుభవాలను ఇంకా మరచిపోనివారు ఆ విషయాన్ని మరీ ఘంటాపథంగా ఘోషిస్తారు. ఆ విపత్కర కాలంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు నెలల తరబడి రోజూ పాలలో చిటికెడు పసుపు పొడి కలుపుకుని తాగిన వారు సంఖ్యానేకంగా ఉన్నారు. పసుపు ఆరోగ్య ప్రదాయిని మాత్రమే కాదు, ఐశ్వర్య ప్రదాయిని కూడా. ఆ ఐశ్వర్యాభివృద్ధిలో రైతులకు చేదోడు వాదోడుగా ఉండేందుకై కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసింది.

రాజకీయాలతో ముడివడని వ్యవహారం ఈ రోజుల్లో ఏదీ ఉండదు కదా. అందునా రైతులకు సంబంధించిన విషయాన్ని పాలకులు ఖాయం చేయడమనేది అంత త్వరగా జరగదు. కనుకనే రైతులు పసుపు బోర్డుకై మొక్కవోని దీక్షతో పోరాడారు. ఈ క్రమంలో ఒక నాయకురాలిని పార్లమెంటుకు ఎన్నుకోవడానికి నిరాకరించారు, అంతకంటే ముఖ్యంగా 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాని పైనే పోటీ చేసేందుకు నిజామాబాద్ నుంచి వారణాసి వెళ్లి నామినేషన్లు వేశారు. తెలంగాణ పసుపు రైతుల డిమాండ్‌కు సరైన రీతిలో ప్రతిస్పందించడంలో కాలవిలంబన చేసినా మోదీ అంతిమంగా శ్రేయోదాయకమైన నిర్ణయాన్ని తీసుకున్నారు.

మకర సంక్రాంతి రోజున నిజామాబాద్‌లో ప్రారంభమైన పసుపు బోర్డు 'మోసుకొచ్చాం స్వరాజ్యమ్మూట మూట విప్పితే ఏమీ లేదు' చందం కాకూడదు. ఒక నిర్దిష్ట పంట అభివృద్ధికి ప్రత్యేకంగా ఏర్పడే బోర్డుకు కొత్త వంగడాలు సృష్టించడం, తెగుళ్ల నివారణకు కృషి చేయడం, దిగుబడుల నాణ్యత పెంచడం, మార్కెట్ విస్తరించడం, కొత్త మార్కెట్ సృష్టించడం మొదలైన బాధ్యతలు ఉంటాయి. తెలంగాణతో సహా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలోని పసుపు రైతుల సంక్షేమ సాధనకు ఈ జాతీయ బోర్డు బాధ్యత వహిస్తుంది. అయితే దేశంలో ఆర్థికంగా వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉన్న అవిభక్త నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం మరే ప్రాంతంలో కంటే ఎక్కువ. కనుక ఈ గోదావరీ తీరస్థ ప్రాంతం రైతుల (బోర్డు కోసం పోరాడడంలో ముందున్నదీ వీరే కదా) అభ్యున్నతిపై పసుపు బోర్డు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

పసుపు సేద్యం, వాణిజ్యంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఉన్నది. ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70 శాతం వాటా, వాణిజ్యంలో 62 శాతం వాటా భారత్ సొంతం. 2023–24లో 226.5 మిలియన్ డాలర్ల విలువైన 1.62 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసింది. అంతర్జాతీయ పసుపు విపణిలో మరింత వాటాను సాధించుకోగల సత్తా మన దేశానికి ఉన్నది. అయితే అందుకు నవీన సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా మరింత నాణ్యమైన పసుపును ఉత్పత్తి చేయడంపై దృష్టి పెట్టవలసిన అవసరమున్నది. 2030 సంవత్సరం నాటికి 100 కోట్ల డాలర్ల విలువైన పసుపు ఎగుమతులను లక్ష్యంగా కేంద్రం నిర్దేశించింది. ఈ లక్ష్య పరిపూర్తిలో పసుపు బోర్డు బృహత్తర పాత్ర నిర్వహించవలసి ఉన్నది. ఔషధాలు, సౌందర్య సాధనాల తయారీలో పసుపును విరివిగా వాడుతున్నందున అంతర్జాతీయంగా ఈ సుగంధ ద్రవ్యానికి మంచి గిరాకీ ఉన్నది. విదేశీ మార్కెట్లకు మరింతగా సరఫరా చేయడం ద్వారా రైతులు తమ ఆదాయాన్ని ఇతోధికంగా పెంచుకోవచ్చు. అంతర్జాతీయ విపణి అవసరాలకు అనుగుణంగా దేశీయ పసుపు సాగు పద్ధతులు మార్చుకోవల్సిన అవసరమున్నది. నాణ్యమైన పసుపును ఎగుమతి చేసినప్పుడు ఈ సుగంధ ద్రవ్యం ద్వారా దేశానికి సమకూరుతున్న ఆదాయం మరింతగా పెరుగుతుంది.

పసుపు సాగుతో సొంత ఆదాయాన్ని, స్వరాష్ట్ర, స్వదేశ ఐశ్వర్యాన్ని మరింత సమృద్ధం చేయగల అవకాశం నిజామాబాద్ రైతులకు లభించింది. శతాబ్దాల క్రితం తెలుగునాట ఒక కొత్త ధర్మాన్ని (బౌద్ధం) తొట్టతొలుత ప్రవేశపెట్టిన బావరి అనే జ్ఞాని ఈ ప్రాంతీయుడే. జ్ఞానాన్వేషణలో కొత్త భావాలను ప్రవేశపెట్టి తెలుగు వారి బౌద్ధిక చరిత్రకు ఆద్యుడైన అలనాటి బావరి స్ఫూర్తితో ఈనాటి రైతులూ పసుపు బోర్డు సహకారంతో వినూత్న సాగు పద్ధతులతో పసుపు ఉత్పత్తిలో తద్వారా ఐశ్వర్యాభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కాలి. పసుపు సాగులో కొత్త అధ్యాయానికి నాంది పలకడంతో పాటు ఇదే ప్రాంతంలో నిన్నగాక మొన్నటివరకు సిరులు సృష్టించిన నిజాం చక్కెర కర్మాగారాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు బావరి నడయాడిన ప్రాంత రైతులు, ప్రజాహితులు వినూత్న ఆలోచనలతో సమష్టిగా కృషి చేయాలి.

పని, జీవితం.. సమతుల్యత ఎలా?

ఆలోచించేలా నన్ను ప్రేరేపించే లేదా రెచ్చగొట్టే వాళ్లను నేను అభిమానిస్తాను. వారి అభిప్రాయాలలో కొన్నిటిని నేను అంగీకరించకపోవచ్చు గాని అవి నన్ను నా ఆలోచనల నుంచి విరామం తీసుకుని మననశీలమయ్యేలా, పునరాలోచించేలా చేసినందుకు నేను సంతోషపడతాను. అలా ఆలోచనలు పురిగొల్పే వాళ్లు మన దరిదాపుల్లో ఎంతో మంది ఉండరు. ఎస్.ఆర్. నారాయణమూర్తి (ఎన్ఆర్ఎన్), ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ (ఎస్ఎన్ఎస్) లాంటి విజ్ఞులు ఉన్నందుకు వారికి మనం కృతజ్ఞతాబద్ధులమవాలి. మన సమాజంలో, విశాల ప్రపంచంలో తమ సమున్నత స్థానాలను సొంతంగా సముపార్జించుకున్న వివేకశీలురు వారు. తమ సుదీర్ఘ, విలక్షణ వృత్తి జీవితాలలో తమ మనసులోని మాటలను సూటిగా చెప్పడాన్ని అలవరచుకున్న సుజనులు వారు. ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్ ఎప్పుడు ఏమి చెప్పినా ప్రజలు శ్రద్ధగా వింటారు, ప్రతిస్పందిస్తారు— కొందరు కలహశీలంగా!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్ ఇరువురూ సంపదను వారసత్వంగా పొంద లేదు. అలా అని కూలీ లేదా వేతన భత్యాలు పొందే ఉద్యోగులు/ పారిశ్రామిక కార్మికులూ కాదు. సమగ్ర, సమర్థ యోగ్యతలు ఉన్న వృత్తి నిపుణులు వారు. ఇంజినీర్లుగా జీవితాలను ప్రారంభించి మొదటి తరం వ్యవస్థాపకులుగా ఎదిగిన వారు. తమ తమ సంస్థల లాభాలలో వాటాలు ఉన్నవారు. ఆ వాటాలకు పూర్తిగా అర్హులైన వారు. వారి ప్రపంచ దృక్పథం 'వారసుల', 'ఉద్యోగుల' ప్రపంచ దృక్పథాలకు భిన్నమైనవి. పర్యవసానంగా పని — జీవితం సమతౌల్యతపై వారి దృక్పథం కూడా భిన్నమైనది.


వారసులు అనేవారు అత్యున్నత స్థాయికి చేరేందుకు క్రింది స్థాయి నుంచి కష్టపడి పని చేయనక్కర లేదు. వారికి తెలుసు, అలాగే వ్యాపార జగత్తులోని ప్రతి ఒక్కరికీ తెలుసు— వారసులు ఏదో ఒక రోజున తమ సంస్థలో అత్యున్నత స్థాయికి చేరుకుంటారని. చాలా మంది వారసులు, పాత తరానికి చెందిన ఒక డజన్ కుటుంబాల వారు మినహా, సంపదనుగానీ, వ్యాపార విలువలను గానీ సృష్టించనివారేనని నేను భావిస్తున్నాను. దురదృష్టవశాత్తు అటువంటి వారసులలో కొంత మంది సమున్నత వ్యాపార విలువలు, సంపదను ధ్వంసం చేసినవారే. 1991కి పూర్వమూ, ఆ తరువాత అగ్రగామి పది దిగ్గజ వ్యాపార కుటుంబాల జాబితాలను పోల్చి చూడండి. మొదటి తరం వ్యవస్థాపకులలో అత్యధికులు అపూర్వ సంపద స్రష్టలే. ఇక కార్మికులు, ఉద్యోగుల విషయానికి వస్తే వారిలో అత్యధికులు నెలా నెలా వేతనభత్యాలు అందుకోవడం పట్ల సంతృప్తి చెందే వారే. వారి ప్రస్తుత హోదాను మించి ఉన్నత అంతస్థుకు చేరుకోవాలన్న ప్రగాఢ ఆకాంక్ష, ఆవశ్యక నైపుణ్యాలు లేనివారే. ఒక ఉద్యోగి ఒక వారంలో ఎన్ని గంటలపాటు పనిచేయాలన్న విషయమై ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్ వ్యాఖ్యలను విమర్శించినవారు చాలవరకు వారసులు, ఉద్యోగులుగా నేను గమనించాను.

వారానికి 70 గంటల పాటు పనిచేయాలని ఎన్ఆర్ఎన్ అన్నారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలని ఎస్ఎన్ఎస్ అన్నట్టు వార్తలు వెలువడ్డాయి. ఆ అభిప్రాయాలు వారి వారి దృక్పథాల నుంచి సరైనవేనని నేను భావిస్తున్నాను. ఎన్ఆర్ఎన్ ఇలా అన్నారు: "భారతదేశ ఉత్పాదక సామర్థ్యం ప్రపంచంలోనే చాలా తక్కువ.. కనుక మన యువజనులు 'ఇది నా దేశం, వారానికి 70 గంటలు పని చేయదలుచుకున్నాను అని తమకు తాము చెప్పుకోవాలి, సంకల్పించుకోవాలి'. నారాయణ మూర్తి వ్యాఖ్యలపై చాలా చర్చ జరిగింది. తీవ్ర విమర్శలు చెలరేగాయి. అయితే ఆయన వెనక్కి తగ్గ లేదు. ఒక ఎస్ఎన్ఎస్, ఎప్పుడు రికార్డు అయిందో తెలియని ఒక వీడియోలో ఇలా అన్నారు: 'ఆదివారాలూ కూడా మీ చేత పనిచేయించలేక పోతున్నందుకు నేను నిజంగా విచారిస్తున్నాను. అలా ఆదివారాలు కూడా మీ చేత పనిచేయించగలిగితే నేను చాలా సంతోషిస్తాను. నేను ఆదివారాలూ పని చేస్తుంటాను'.

పారిశ్రామిక కార్మికులకు 8 గంటల పనిదినం తొలుత జర్మనీలో 1918లో చట్టబద్ధమయింది. దరిమిలా 8 గంటలు శ్రమ, 8 గంటలు వినోదాలు (రిక్రియేషన్), 8 గంటలు విశ్రాంతి అన్నది ఒక విశ్వజనీన నియమయింది. వినోదాలకు రోజూ 8 గంటల సమయాన్ని వెచ్చించే వ్యక్తి ఒక్కరినీ నేను చూడలేదు. 'ఆహారం భుజించడం, బట్టలు ఉతుక్కోవడం, వ్యాయామం చేయడం, ఆటలు ఆడడం, సినిమాలు చూడడం, వార్తాపత్రికలు, పుస్తకాలు చదవడం, షాపింగ్ చేయడం, ఉబుసుపోక కబుర్లు చెప్పుకోవడం మొదలైనవన్నీ రిక్రియేషన్ కిందకు వస్తాయా? ఆ విధంగా చూస్తే రిక్రియేషన్‌కు 8 గంటలు సరిపోవేమో!

పారిశ్రామిక కార్మికులలో చాలా మంది చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తుంటారు. చాలా తక్కువ మంది మాత్రమే కొత్త నైపుణ్యాలు నేర్చుకుని మరింత సంక్లిష్ట పనులు చేసే అర్హతలు సంపాదించుకుంటారు. డెస్క్ ఉద్యోగాలు ప్రాచుర్యంలోకి వచ్చినప్పుడు 8–8–8 నియమాన్నే అనుసరించడం ఆరంభమయింది. డెస్క్ ఉద్యోగులలో చాలా మంది చేసేవి కూడా పునరుక్తమవుతుండేవి. ఈ దృష్ట్యా కార్మికులు/ ఉద్యోగులలో అత్యధికులకు 8–8–8 నియమం బాగా ఆమోదయోగ్యమయింది. ఆటోమేషన్, రోబోలు, కృత్రిమ మేధ (ఏఐ) వచ్చిన దరిమిలా ఆ నియమం కొద్ది గంటలుగా మారింది. కార్మికులు/ ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయవలసిన అవసరం లేకపోయింది. అయితే ఉత్పాదక సామర్థ్యం పెంచుకునేందుకు కొత్త పరికరాలు, సాంకేతికతలు, యంత్ర వ్యవస్థలు అవసరమయ్యాయి. ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్‌ల వ్యాఖ్యలు ఇటువంటి కార్మికులు/ ఉద్యోగుల నుద్దేశించి చేసినవి కావని నేను భావిస్తున్నాను.

కార్మికులు/ఉద్యోగులకు భిన్నంగా రైతులు 8–8–8 నియమాన్ని అనుసరించారు. వ్యవసాయంలో మొదటి 8 గంటల వ్యవధి 10 నుంచి 12 గంటలకు పొడిగింపబడుతుంది. ఆ అదనపు గంటల్లో కూడా పూర్తిగా పనిచేస్తేనే మొదటి 8 గంటల్లో జరగాల్సినవి జరుగుతాయి. అదేవిధంగా డాక్టర్లు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, వాస్తుశిల్పులు, శాస్త్రవేత్తలు, నటీనటులు మొదలైన వృత్తి నిపుణులు రోజుకు కేవలం 8 గంటలు మాత్రమే పని చేయరు. రోజుకు 12 గంటలు, అంతకంటే ఎక్కువ సమయం పనిచేసే వృత్తి నిపుణులు నాకు తెలుసు. అలాగే శని, ఆదివారాలు కూడా మామూలు రోజుల్లో మాదిరిగానే పనిచేసే వృత్తి నిపుణులు ఎంతో మంది ఉన్నారు. విజయాలు సాధించిన వృత్తి నిపుణులు సుదీర్ఘ పనిగంటలు గురించి ఫిర్యాదు చేయరు. వారు ఇష్టపూర్వకంగానే ఎక్కువ గంటల పాటు పనిచేస్తారు. కనుక 8–8–8 నియమం అనేది మానవులు అందరికీ ఒక విధంగా వర్తించదు.



యువజనులు సుదీర్ఘ గంటల పాటు చేసే ఉత్పాదక కృషే ఒక వర్ధమాన దేశాన్ని సంపద్వంతం చేస్తుందనే సత్యాన్ని యువతరం మనసుల్లో పాదుకొల్పేందుకే వారానికి 70 లేదా 90 గంటలపాటు పనిచేయాలని నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యన్ చెప్పారు. వారి ఆ వ్యాఖ్యలు నేటి యువతరాన్ని జాతి నిర్మాణానికి పురిగొలిపే పిలుపులు.

ప్రతి రోజూ సాధారణ సమయం కంటే ఎక్కువ గంటల పాటు పని చేయడం నాకు సంతోషంగానూ, సంతృప్తికరంగానూ ఉంటుంది. 'పని'కి నా నిర్వచనంలో న్యాయవాదం (ప్రాక్టీసింగ్‌లా) పార్లమెంటరీ కార్యకలాపాలు, చదవడం, రాయడం, ప్రసంగించడం, ప్రజలు చెప్పే విషయాలు వినడం, పార్టీ కార్యకర్తలతో చర్చలు జరపడం, వివాహాలు, పుట్టినరోజు వేడుకలు లేదా పుస్తకావిష్కరణలు మొదలైన సామాజిక కార్యక్రమాలకు హాజరవడం మొదలైనవన్నీ చేరతాయి. నేను నిద్రపోకుండా ఉన్న సమయమంతటినీ 'పని చేసే సమయం' గానే పరిగణిస్తాను పని–జీవితం సమతౌల్యత అనేది ఏ వ్యక్తికి ఆ వ్యక్తి సొంతంగా, స్వతంత్రంగా సాధించుకోవల్సినది అని నేను విశ్వసిస్తున్నాను. పని–జీవితం మధ్య నేను ఒక సమతౌల్యతను పాటించగలుగుతున్నానని చెప్పేందుకు సంతోషిస్తున్నాను.

ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్‌లు తమ తమ వృత్తి జీవితాలలో గొప్ప విజయాలు సాధించినవారు. సమాజంలో ఒక ఉన్నత స్థానాన్ని సముపార్జించుకున్నవారు. కనుక భారతీయులు మామూలు కంటే ఎక్కువ గంటలు పనిచేసి తీరాలని చెప్పేందుకు వారు పూర్తిగా అర్హులు. ఈ విషయంలో వారిపై పలువురు చేసిన విమర్శలు, వ్యంగ్య దూషణలు అర్థం లేనివి. భారీ ఆదాయం, అపరిమిత ఆస్తులు ఉన్న స్త్రీ పురుషులు ఎంతో మంది నాకు తెలుసు. అయితే ఆ భాగ్య రాశులేవీ వారిలో ఎలాంటి అతిశయాలకు కారణమవలేదు. వారు చాలా నిరాడంబర జీవితాన్ని గడుపుతారు ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. మంచి దుస్తులు ధరిస్తారు— అయితే మిరుమిట్లు గొల్పేవి కావు. ఎటువంటి పటాటోపాలకు పోకుండా తమను కలిసినవారందరితోనూ నమ్రంగా మాట్లాడతారు.

యువజనులు సుదీర్ఘ గంటల పాటు చేసే ఉత్పాదక కృషే ఒక వర్ధమాన దేశాన్ని నిజంగా సంపద్వంతం చేస్తుందని కోట్లాది ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తుందనే సత్యాన్ని ఆకాంక్షాభరిత యువతరం మనసుల్లో పాదుకొల్పేందుకే ఎన్ఆర్ఎన్, ఎస్ఎన్ఎస్‌లు ఆ విధంగా మాట్లాడారని నేను భావిస్తున్నాను. నిజానికి వారి ఆ వ్యాఖ్యలు నేటి యువతరాన్ని జాతి నిర్మాణానికి పురిగొలిపే పిలుపులు. ఆ వ్యాఖ్యలు ఎంత మాత్రం వివాదాస్పదమైనవి కావు. ప్రజలను ఆలోచించేలా అవి అనుద్దేశపూర్వకంగానే ప్రేరేపిస్తున్నాయి. పని–జీవితం మధ్య సమతౌల్యాన్ని అన్వేషిస్తున్న వారికి అదేమంత చెడ్డ విషయం కాదు కదా.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చిన్న లగచర్ల మీద పెద్ద పిడుగు

మన దేశంలో అభివృద్ధి పేరిట భారీ పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేసిన సందర్భాలలో భూమి ఎక్కువగా ఉన్నవాళ్లకే అధిక ప్రయోజనం చేకూరుతున్నది. గత పదేళ్ళుగా అన్ని రకాల భూ సేకరణలు 2013 భూసేకరణ చట్టం ఆధారంగానే జరుగుతున్నాయి. వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం 632 ఎకరాల 26 గుంటల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. ఇందులో సగం వరకు ప్రభుత్వ భూములు. కొన్ని దశాబ్దాల క్రితం లావునీ/ అసైన్మెంట్ పట్టాలు పొందిన గిరిజన లంబాడీ తెగవారు సాగు చేస్తున్నారు. మిగతావి ఎస్సీలు, బడుగు, బలహీన కులాలకు చెందినవి. గమనించవలసిన విషయం ఏమిటంటే— ఆధిపత్య కులాలుగా ఉన్న రెడ్డి సామాజికవర్గాల భూములు ఇందులో కేవలం ఒక ఎకరా పందొమ్మిది గుంటలు మాత్రమే!

అందుకనే సామాజికంగా బలహీనులైన వారికి హక్కులు కల్పించే చట్టాలు వాటంతట అవి అమలు కావు. వాటి సాధనకు పోరాటాలు చేయాలి. 2013 చట్టంలో సామాజిక అంచనా అని ఒక వెసులుబాటు ఉన్నది. 75 శాతం భూయజమానులు "మా భూములు ఇవ్వం" అని అసమ్మతి తెలియజేస్తే అట్టి భూసేకరణను నిలుపుదల చేయాలి. ఇలాంటి హక్కులు ఉన్నాయని ప్రజలకు తెలియదు. వాటిని తెలియజేసే సంస్కృతి మన పాలనా యంత్రాంగానికి లేదు.



ఇది పూర్తిగా వెనకబడిన ప్రాంతం. ఇక్కడి ప్రజలు సరైన ఉపాధి పనులు లేక వలసలు వెళుతుంటారు. ముఖ్యమంత్రి తన స్వంత నియోజకవర్గ ప్రజల మీద అభిమానంతో లగచర్లలో నమోదైన క్రిమినల్ కేసులు వెనక్కి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లగచర్ల గ్రామ ప్రజల బతుకు తెరువు కోసం వారికి ఆత్మ స్థైర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం లగచర్ల గ్రామంలో 2092 మంది జనాభా ఉన్నది. ఇప్పుడు పెరిగి ఉంటుంది. గ్రామంలో మొత్తం 372 ఇళ్ళు ఉన్నాయి. ఎస్టీలు (లంబాడీ) తెగలు 33శాతం, ఎస్సీలు 9.8శాతం ఉండగా, మిగతా అంతా బడుగు బలహీన వర్గాల కుటుంబాలు. ఇళ్ళు అన్నీ తాండూరు, షాబాద్ బండలు పైకప్పులుగా ఉన్నాయి. ఈ మధ్యనే భూముల ధరలు పెరిగి కొన్ని సిమెంటు స్లాబులు వచ్చాయి. 39 శాతం అక్షరాస్యత ఉంది. అందరివీ వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. ఈ ప్రాంత ప్రజల జీవితాలు పూర్తిగా ప్రకృతి తోనే ముడిపడి ఉన్నాయి. ఇక్కడ ఒక ఫార్మా కంపెనీ అనేది ఊహకందని ఆలోచన. అభివృద్ధి పేరుతో వాళ్ల భూములు పోతాయన్న బాధతో గ్రామస్థులంతా మా చిన్న లగచర్ల మీద పెద్ద పిడుగు పడింది అన్న విషయం తెలుసుకొని గత రెండు నెలల నుంచి నిరసనలు చేస్తున్నారు. ఏ కమ్యూనిస్టులు, ఇతర రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలు, హక్కుల సంఘాలు వీరిని పలకరించ లేదు.

జిల్లా కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా లగచర్లకు చేరగానే నిరసనలు మొదలయ్యాయి. అక్కడి ప్రజలకు వచ్చిన వ్యక్తి కలెక్టరా, అంతకంటే చిన్న అధికారా, పెద్ద అధికారా అనే విషయం తెలియదు. వాళ్ళ భూములు పోతున్నాయన్న బాధలో ఎవ్వరు వచ్చినా అడ్డగించాలని చూస్తారు. ప్రజలను రెచ్చగొట్టడంలో ప్రతిపక్షాలు విజయం సాధించి ఉండవచ్చు. కానీ, కలెక్టర్ మీద దాడి అంటూ అక్కడి యువతపై, రైతు కూలీలపై, రైతులపై అనేక క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. అరెస్టు అయిన వారిని సంగారెడ్డి జైలుకు తీసుకువెళ్ళి అక్కడ చాలా రోజులు నిర్బంధంలో ఉంచారు. నిరసన తెలిపే హక్కు మనకు భారత రాజ్యాంగం కల్పించిందనేది మరవరాదు.

"రెవిన్యూ రికార్డులలో ప్రభుత్వ భూములుగా ఉన్న అసైన్మెంట్ పట్టాలు. ప్రభుత్వం తన భూములను తాను తీసుకుంటుంది. అయినా డి–ఫారం పట్టా పొంది సాగు చేసుకుంటున్న వారికి ఎకరాకు రూ.10 లక్షలు, పట్టా భూములకు రూ.15 లక్షలు ఇస్తారు. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తుంది" అంటూ మరో పక్క దళారీలు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ గ్రామస్థుల చెవులు కొరుకుతూనే ఉన్నారు. ఒక పక్క పిల్లల అరెస్టులు, మరోవైపు భూములు పోవడం, ఎలా బతకాలనే బాధ, భయాలతో గ్రామస్థులంతా ఊరు వదిలి బయటకు వెళ్ళిపోతున్నారు. లగచర్ల, హకీంపేట, పోలేపల్లి... ఈ ఊళ్ళలో వ్యవసాయ ఆధారిత కుటుంబాల సంఖ్యకూ, ప్రభుత్వం ఇవ్వజూపిన ఉద్యోగ ఉపాధి అవకాశాల సంఖ్యకూ ఎక్కడా పోలికే ఉండదు. అంతేగాక అక్కడున్న పచ్చని వాతావరణం అంతా కలుషితం అవుతుంది. అసలే అరకొర పంట పొలాలు, అవి కూడా పనికిరాకుండా పోతాయి. పరిశ్రమల స్థాపన పేరిట హైదరాబాద్ చుట్టూ పటాన్ చెరువు, జీడిమెట్ల, ఐడీఏ బొల్లారం, ఐడీఏ నాచారం, ఐడీఏ కాటేదాన్ ఈ ప్రాంతాలన్నీ వాతావరణ కాలుష్యంతో పాటు భూగర్భ జలాలను, వాయువును, నీటిని కలుషితం చేశాయి అన్నది మనం గుర్తు పెట్టుకోవాలి.

కొడంగల్ అసెంబ్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (కాడ) పేరిట అభివృద్ధిలో భాగంగా ఈభూములన్నీ కలుషితం అవుతాయి. దానికి తోడు ఎంతోమంది రైతులు భూనిర్వాసితులుగా రోడ్డున పడతారు. ప్రభుత్వాలు, మీడియా వీరిని మరిచిపోతాయి. ఇది పూర్తిగా వెనకబడిన ప్రాంతం. ఇక్కడి ప్రజలు సరైన ఉపాధి పనులు లేక వలసలు వెళుతుంటారు. ఇలా జరగకుండా ఉండాలంటే— ఏ స్థాయిలో ఉపాధి, ఉద్యోగాలు దొరకుతాయో చూడాలి. నా నియోజకవర్గ ప్రజలకు నేను అన్యాయం చేస్తానా అంటూనే అభివృద్ధి జరగాలి అంటే భూములు కావాలి అంటున్నారు ముఖ్యమంత్రి. అలాగే ముఖ్యమంత్రి తన స్వంత నియోజకవర్గ ప్రజల మీద అభిమానంతో లగచర్ల ప్రజలపై నమోదైన క్రిమినల్ కేసులు వెనక్కి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికీ కొనసాగుతున్న వేటను ఆపమని అడుగుతున్నారు. భూసేకరణతో విస్థాపనకు గురి కాబోతున్న లగచర్ల గ్రామ ప్రజల బతుకు తెరువు కోసం వారికి ఆత్మ సై[illegible]ర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నారు.

○ వి. బాలరాజు
తహశీల్దారు రిటైర్డు

అమెరికాలో 'చెత్త' రాజకీయాలు!

అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ రెండవసారి ప్రమాణ స్వీకారం చేసే సమయంలో కార్మికవర్గాన్ని ఆకర్షించబోయే శకటం ఒకటి ఇప్పుడు వార్తాంశం అయ్యింది. అది చెత్త సేకరించే వాహనం. చెత్త వాహనానికీ, దేశాధ్యక్షుని ప్రమాణ స్వీకారోత్సవానికీ మధ్య విడదీయరాని ఎన్నికల ప్రచార బంధమే పెనవేసుకుని ఉంది. దేశాధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌ని, ఆయన మద్దతుదారులనీ తక్కువ చేసి చూపే ఉద్దేశంతో అంతా 'చెత్త' అని అభివర్ణించారు. ట్రంప్‌ని తక్కువ చేయాలని చూసిన బైడెన్ వ్యూహం బెడిసికొట్టింది. చెత్త అనే మాటని పట్టుకుని, ట్రంప్ వెంటనే చెత్త సేకరించే ఓ వాహనాన్ని నడుపుతూ తన ఎన్నికల ప్రచారానికి వినూతన ఒరవడి పెట్టారు. ఈ దృశ్యం కార్మిక వర్గాన్ని బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా మిషిగన్, పెన్సిల్వేనియాలో చెత్త నినాదం బ్రహ్మాండంగా పేలింది. ట్రంప్ విజయంలో ఈ రెండూ చాలా కీలకం. ఇప్పుడు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆనాడు ఆయన నడిపిన చెత్త వాహనం డిట్రాయిట్ నుంచి వస్తోంది.

సరే, మరి మూడు రోజులలో గృహోన్ముఖం పట్టవలసిన అధ్యక్షుడు జో బైడెన్ నిజంగానే కొన్ని చెత్త మాటలు మాట్లాడారు. పోటీలో కొనసాగినట్టయితే తానే తప్పక విజేతగా నిలిచేవాడినన్నది ఆయన తాజాగా చేసిన ప్రకటన! ఇది ఎవ్వరూ ఊహించనిది! హర్షించనిదీ! చింత చచ్చినా పులుపు చావలేదంటే ఇదే మరి. అవతల కాలిఫోర్నియా కార్చిచ్చుకు తగలబడుతుంటే ఈ పిచ్చి ప్రేలాపన ఏమిటో?! ఈ పైత్యానికి కొనసాగింపుగా డెమొక్రటిక్ పార్టీలో సమైక్యతను కాపాడడానికే పెద్దలు చెప్పడంతో తాను పోటీ నుంచి తప్పుకున్నట్టు బైడెన్ మరో ప్రకటన చేశారు. ఇంతకీ ఎవరా పెద్దలు? ఆ పెద్దలు నడిపిన చెత్త రాజకీయం ఏమిటి? తమకోసం ఏమీ చేయలేదని నల్లవారి శాపనార్థాలు మూటకట్టుకున్న ఒబామా ఒక పెద్ద అయితే, ఈ రోజు కాకపోతే రేపైనా తన జీవిత సహచరిణి అమెరికా అధ్యక్షురాలు కాకపోతుందా అని ఆశగా ఎదురుచూసిన బిల్ క్లింటన్ మరో పెద్ద! నిజమే, ఈ పెద్దలు అతిగా జోక్యం చేసుకోకపోతే ఆ పార్టీకి ఇన్ని కష్టాలు ఉండేవి కావేమో! ఇప్పుడే కాదు, గతంలో కూడా ఈ పెద్దలు తమ పెద్దరికాన్ని పార్టీ మీద రుద్ది, పార్టీ మనుగడని బలహీనపరిచారు. వర్తమాన రాజకీయ చిత్రాన్నే ఉదాహరణగా తీసుకుంటే పార్టీ అభ్యర్థిగా జో బైడెన్‌ను ఎంపిక చేయడానికి ముందు ఆయనతో పోటీ పడిన వ్యక్తి బెర్నీ సాండర్స్ కార్మిక వర్గంలో మంచి పట్టున్న నాయకుడు. బెర్నీ ఎక్కడకు వెళ్లినా మావాడు మంచివాడు అనే పేరు సంపాదించుకున్నాడు. విద్యార్థి దశలో ఉద్యమాలలో పాల్గొని, ఆ తర్వాత కార్మిక వర్గంతో మమేకమై కార్మిక వర్గ పక్షపాతిగా పేరు తెచ్చుకున్నాడు. వెర్మాంట్ సెనెటర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు. 2016లో హిల్లరీ క్లింటన్‌పై, మళ్లీ 2020లో జో బైడెన్‌పై అమెరికా అధ్యక్ష పదవికి తలపడ్డారు. అన్ని విధాలా డెమొక్రటిక్ పార్టీకి ఉజ్వలమైన భవిష్యత్తుకు బంగారుబాట వేయగలిగిన సాండర్స్‌ను ఈ రెండు సందర్భాలలోనూ ఒబామా, క్లింటన్ ద్వయం బరి నుంచి ఉపసంహరించుకునేట్టు చెత్త యంత్రాంగం నడిపారు. సాండర్స్ నాయకత్వ లక్షణాలను కీర్తిస్తూనే ఆయనలోని ప్రగతిశీల భావజాలాన్ని ఒబామా, క్లింటన్ తిరస్కరించారు. సరే పెద్దలు చెబుతున్నారు కదా అని సాండర్స్ వెనుదిరిగారు. మరి హిల్లరీ క్లింటన్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారా అంటే అదీ లేదు. ఎన్నికల ప్రచారంలో చాలా సందర్భాలలో అవాకులు చెవాకులు మామూలైపోయాయి. రిపబ్లికన్లు అంటేనే దేశానికి అరిష్టం అన్నట్టు ఆమె మాట్లాడేవారు. వెళ్లిన ప్రతిచోటా డాబూ దర్పం ప్రదర్శించడం ఆమె విజయావకాశాలను బాగా దెబ్బ తీసింది. డెమొక్రటిక్ పార్టీకి పట్టం కడితే తమ ఉపాధి అవకాశాలపైన తామే నీళ్లు పోసుకున్నట్టు అవుతుందని యువత భావించడం, మరొక పక్క డోనాల్డ్ ట్రంప్ అరచేతిలో వైకుంఠం చూపించడంతో ట్రంప్ విజయం నల్లేరుపై నడకే అయ్యింది. కాని అంత అద్భుతమైన విజయం దరిమిలా మరోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా చాలా తేలికగా గెలవవలసి ఉంది. కాని అలా జరగలేదు. 2020లో జరిగిన ఎన్నికలు జో బైడెన్‌ను అధికార పీఠంపై కూర్చోపెడితే, ఎన్నికల వ్యవస్థనే కూల్చే విఫలయత్నం ట్రంప్ చేశారు. ఆయన ఎంత బుకాయించినా, ఆయన పిలుపు మేరకే ఆయన మద్దతుదారులు వాషింగ్టన్ డి.సి.లోని కేపిటల్‌పై దాడి చేయడం మాయని మచ్చే. తన నడవడికతో, అతి వాచాలత్వంతో తన గొయ్యి తానే తవ్వుకునే పరిస్థితిని ట్రంప్ సృష్టించుకున్నాడు. అంతటితో అమెరికా చరిత్రలో ఆయన శకం ముగిసినట్టు అనిపించింది.

మరో మూడు రోజులలో గృహోన్ముఖం పడుతున్న జో బైడెన్ అత్యంత నిష్క్రియాశీలిగా అమెరికా చరిత్ర పుటలలో నిలిచిపోతున్నారు. అమెరికా అధ్యక్షులలో రెండుసార్లు అభిశంసనకు గురైన వ్యక్తి ట్రంప్ ఒక్కరే. ఆయన గత కాలపు అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకుని పాలిస్తారా? లేక మరింత దూకుడుగా ముందుకు పోతారా?







కాని అధ్యక్ష భవనంలో అడుగుపెట్టిన నాటి నుంచే జో బైడెన్ మతి స్థిమితం లేని మాటలు, చేతలూ కొట్టొచ్చినట్టు కనిపించాయి. బైడెన్ చేష్టలు పార్టీకి చెరుపు చేస్తాయని మొదటి వారంలోనే బెర్నీ సాండర్స్ డెమొక్రటిక్ పార్టీని హెచ్చరించారు. అయినా పెద్దలు కళ్లు తెరవలేదు. ఫలితంగా బైడెన్ ఇప్పుడు అత్యంత నిష్క్రియాశీలిగా అమెరికా చరిత్ర పుటలలో నిలిచిపోతున్నారు. ఆయన క్రిందపడడం, దేశాధినేతలు, దౌత్య ప్రతినిధులూ ఉన్నప్పుడు వారివైపు గాక అటు ఇటు దిక్కులు చూడడం వంటివి వయసుకు సంబంధించిన సమస్యలు కావచ్చు. వాటితో ఒక దేశాధ్యక్షుని పాలనా సామర్థ్యాన్ని అంచనా వేయడం సబబు కాదు గాని, ఈ నాలుగేళ్లూ ఏ విషయంపైనా స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పలేని వ్యక్తిగా అమెరికన్ ప్రజలు భావిస్తున్న మాట మాత్రం నిజం. ఎన్నో అపవాదులను మూటకట్టుకుని కూడా జో బైడెన్ చివరి రోజులలో తన కుమారుని సహా ఎందరికో క్షమాభిక్ష పెట్టడం దుస్సాహసాలలో మహా దుస్సాహసం! 2014 నుంచి 2024 మధ్య కాలంలో కుమారుడు హంటర్ బైడెన్ చేసిన ఎన్నో నేరాలకు తండ్రి క్షమాభిక్ష పెట్టడం చరిత్రలో ఎన్నడూ కనీవినని దృశ్యం. ఇంతకన్నా చెత్త నిర్ణయం మరొకటి ఉండదు. ఇంకా బ్యాంకులను మోసం చేసినవాళ్లకి కూడా జో బైడెన్ పదుల సంఖ్యలో క్షమాభిక్ష పెట్టడం మరో చెత్త నిర్ణయం. ఒక పక్క ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థి వలసలకు అడ్డుకట్ట వేస్తానంటుంటే, మరో పక్క బైడెన్ తీసుకున్న మరో నిర్ణయం చూసి అందరూ భృకుటి ముడుస్తున్నారు. ఎల్ సాల్వడార్ సహా కొన్ని దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చినవారికి సంవత్సరంన్నర పాటు తాత్కాలిక రక్షిత హోదా కల్పిస్తూ చివరి రోజులలో బైడెన్ తీసుకున్న నిర్ణయం కూడా సహజంగానే వివాదాస్పదంగా మారింది.

సరే, వర్తమానానికి కాస్త వెనక్కి వెళ్తే, కమలా హ్యారీస్ ఎంపిక విషయంలో సైతం ఈ పెద్దలు చేసిన జాప్యం ఆక్షేపణీయమే. మళ్ళీ నేనే... మళ్ళీ నేనే... అధ్యక్షుణ్ణి అవుతా... అంటూ బైడెన్ చిన్న పిల్లలు చోకొలేట్ కోసం మారాము చేసినట్టు అంటుంటే, ఇప్పటికే మీ వల్ల పార్టీ పరువు, పదవి పరువూ హడ్సన్ నదిలో కలిసిపోయాయి, ఇక చాలు, బుద్ధిగా కూర్చొమ్మని చెప్పారా? లేదు. చివరివరకూ బైడెన్ ఆడింది ఆటగా పాడింది పాటగా అనుమతించారు. దేశాధ్యక్ష పదవికి ఒకసారి ఏ పార్టీ వారు ఎన్నికయినా అమెరికన్ ప్రజలు సంప్రదాయబద్ధంగా రెండోసారి కూడా వారినే ఎన్నుకుంటారు -ఎప్పుడో తప్ప! అలాగే తాను కూడా మళ్లీ గెలుస్తానని బైడెన్ ఆశ పడి ఉండవచ్చు. తప్పు లేదు. కాని పరిస్థితిని అంచనా వేయవలసిన పెద్దలకు ఏమైంది? తమ అభ్యర్థి విజయావకాశాలపై పార్టీ పెద్దలకు బ్రహ్మాండమైన విశ్వాసం ఉందా అంటే అటువంటిదేమీ లేదు. అయినా వారెవరూ బైడెన్‌ను కట్టడి చేయలేదు. ఈలోగా ట్రంప్‌పై ఆగంతకుని తూటా పేలడం, అది ఆయన తలను రాసుకుంటూ పక్కనుంచి పోవడం, అంతలోనే ట్రంప్ చేతులు పైకెత్తి నేనున్నాను అంటూ పైకి లేవడం... అంతా లిప్తకాలంలో జరిగిపోయాయి. ఇక ట్రంప్ అప్పటి నుంచి వెనకకు తిరిగి చూసుకోనవసరం లేకపోయింది. అప్పటి ఎన్నికల ఊపు చూసి డెమొక్రటిక్ పార్టీ శ్రేణులు బెంబేలు ఎత్తిపోయి పార్టీకి ఒక్క పెన్నీ కూడా రాల్చని పరిస్థితి తలెత్తాక గాని పార్టీ పెద్దలు కళ్లు తెరవలేదు. వారికి జ్ఞానోదయం అయ్యేలోగా పరిస్థితి చేజారిపోయింది. అప్పుడు కమలా హ్యారిస్‌ను ఎంపిక చేసి, ఇక నువ్వు ఇంట్లో కూర్చునే సమయం వచ్చిందని బైడెన్‌కు నచ్చజెప్పారు. కమల కష్టపడింది గాని ఉపయోగం లేని పరిస్థితి. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం ఏమిటన్నది అర్థం అయ్యేసరికి పుణ్యకాలం కాస్తా గడిచేపోయింది!

ఇప్పుడు, ట్రంప్ మళ్లీ విజయగర్వంతో అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండవసారి అధిరోహించబోతున్నారు. రిపబ్లికన్ పార్టీ శ్రేణులకు ఇంతకు మించిన పండుగ మరొకటి లేదు. ట్రంప్ మళ్ళీ పోటీ అయినా చేయగలరా అన్న అనుమాన దశ నుంచి ఆయన నాలుగేళ్ళ విరామం తరువాత ఏకంగా మళ్ళీ ఆ పీఠాన్ని అధిరోహిస్తున్నారు. ఆయన వస్తున్నారంటేనే కొందరికి సింహస్వప్నం... మరి కొందరికి ఆక్షేపణీయం. అమెరికా అంటే భూతల స్వర్గం అనుకుని ఏదో రకంగా ఆ గడ్డమీద కాలు పెట్టాలని ఆశ పడేవారికి అది ఇక ముందు అంత తేలిక కాదు. కాని ఆయనపై దాదాపు 4000 పైనే రకరకాల కేసులు ఉన్నాయి. ఇన్ని కేసులున్న దేశాధ్యక్షుడు మరొకరు లేరు. ఈ మధ్యే కోర్టు ఆయనకు దేశాధ్యక్షునిగా కొన్ని మినహాయింపులు ప్రకటించినా, అవి అధికార పరిధిలో ఆయన తీసుకునే నిర్ణయాలకే తప్ప వ్యక్తిగతంగా గతంలో చేసిన తప్పిదాలకు వర్తించవని కూడా స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షులలో రెండుసార్లు అభిశంసనకు గురైన వ్యక్తి ట్రంప్ ఒక్కరే. అయితే రెండుసార్లూ ఆయనను సెనేట్ కాపాడింది. మరి భవిష్యత్తు ఎలా ఉంటుందో? ఆయన గత కాలపు అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకుని పాలిస్తారా? లేక మరింత దూకుడుగా ముందుకు పోతారా?


■ ---జగన్
(సీనియర్ జర్నలిస్ట్)



అడ్డంకులు తొలగేదెన్నడో?

'సూపర్' వైద్యానికి విచారణలు, నిధుల గండం

- వరంగల్ హెల్త్ సిటీ పనులపై వీడని గ్రహణం
- ఎయిర్ పోర్టు, టెక్స్‌టైల్ పార్కు యూజీడీపైనే ప్రభుత్వం దృష్టి
- పాలన మారి ఏడాది దాటినా వైద్యంపై దృష్టిపెట్టని వైనం
- ఎంజీఎంను పట్టించుకోరు.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పూర్తి చేయరు
- మంత్రివర్గ భేటీల్లో ఒక్కసారీ చర్చించింది లేదు
- గత ప్రభుత్వ తప్పిదాలనే కాంగ్రెస్ కూడా కొనసాగిస్తోందంటూ విమర్శలు
- సర్కారు వైద్యాన్ని విస్మరిస్తున్నారంటూ ప్రజల అసంతృప్తి


నిర్మాణం పూర్తి కాని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. ఇందిరమ్మ ప్రజాపాలనలో పేదల జీవితాలను మారుస్తామంటూ సర్కారు పదే పదే మాటలు చెబుతోంది. కానీ చేతలు మాత్రం గత ప్రభుత్వం తీరుగానే ఉన్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులే నిదర్శనంగా నిలుస్తున్నాయన్న అభిప్రాయా లున్నాయి. ఇప్పటికే పేదల బతులకు ఆధారంగా ఉన్న వరంగల్ ఎంజీఎంను పట్టించుకోవడం లేదని.. గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను ప్రస్తుత సర్కారు పూర్తి చేయడం లేదని పేదలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెడలో పుస్తెల తాడు నుంచి గుడిసెలను కూడా తాకట్టు పెట్టి ఆస్పత్రి బిల్లులు చెల్లించాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ ఏడాది కాలంగా ఎయిర్ పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, ఐటీ పార్కు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులకే ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం పేదలకు ప్రాణం పోసే వరంగల్ ఎంజీఎంతో పాటు సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనన్న ప్రశ్నలు ఉత్పన్నమవు తున్నాయి. పలుమార్లు మంత్రి వర్గ సమావేశాలు జరిగినా.. వరంగల్ హెల్త్ సిటీ, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులపై సమీక్షించకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. అడ్డంకులు తొలగి ఎప్పుడు తమకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుండోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా..

56 ఎకరాల్లో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రితో పాటు ఎంజీఎం అస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అన్ని కూడా ఒకే కాంప్లెక్స్ పరిధిలోకి తెచ్చేలా వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అన్ని రకాల వైద్య సేవలతో పాటు మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీలు ఒకే గొడుకు కిందికి వస్తుండటంతో సుమారు 215 ఎకరాల్లో వరంగల్ హెల్త్‌సిటీగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని గత ప్రభుత్వం భావించింది. ప్రధానంగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రిలో పేదలకు 34 విభాగాల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించనున్నారు. ప్రధానంగా గుండె మార్పిడికి ప్రత్యేకంగా థియేటర్, కాలేయ, కిడ్నీ తదితర అవయాల మార్పిడి, యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, జనరల్ మెడిసిన్, క్యాన్సర్ ట్రీట్‌మెంట్ తదితర వాటి కోసం ప్రత్యేకంగా విభాగాలను ఈ సూపర్ స్పెషాలిటీ అస్పత్రిలో ఏర్పాటు కానున్నాయి. డెంటల్ కాలేజీని

మిగతా 7వ పేజీలో...

మంత్రులు, ఎమ్మెల్యేలూ జర చూడండి...

ఎంజీఎం పరిస్థితి దారుణంగా మారింది. వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు కనీసం పూర్తిస్థాయిలో మందులు కూడా లేని దుస్థితి. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోనే ఎంజీఎం ఉండగా.. ఆమె కూడా ఎంజీఎంలో నెలకొన్న సమస్యలపై ఎంజీఎం వైద్యాధికారులతో సమీక్షించకపోవటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పేదల పక్షాన పోరాడే వ్యక్తులుగా పేరున్న కొండా దంపతులు పేదల అస్పత్రిపై దృష్టి పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మొదట్లో ఎంజీఎం అభివృద్ధిపై దూకుడుగా వెళ్లిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇటీవల మౌనం వహిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌లో కూడా మెరుగైన ప్రభుత్వ వైద్యం పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో పాటు ఎమ్మెల్యేలపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంజీఎంలో పేదలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా చూడటంతో పాటు సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేసి, పేదలకు సూపర్ వైద్య సేవలు అందేలా మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఓరుగల్లు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదల ఆస్పత్రికి అభ్యంతరాలు, విచారణల గ్రహణం

వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మిస్తే చుట్టుపక్కల ఉన్న నాలుగైదు ఉమ్మడి జిల్లాల ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుతుందనే గత ప్రభుత్వం వరంగల్ హెల్త్ సిటీకి ప్లాన్ చేసింది. గత ప్రభుత్వం 24 అంతస్థుల్లో రూ.1,100 కోట్ల అంచనా వ్యయంతో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రి పనులు చేపట్టినట్లుగా జీవో నెం.158ని విడుదల చేసింది. అయితే ఏడాది కాకముందే ఏలాంటి అనుమతులు లేకుండా రూ.1,725.95 కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.95 కోట్ల వ్యయాన్ని పెంచటంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తప్పు పట్టింది. అంతేకాకుండా అస్పత్రి నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు లేకపోవటంతో తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ హస్పిటల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్)ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759గజాల స్థలాన్ని (56 ఎకరాలు) బదిలీ చేస్తూ జీవో నెం.81ని జారీ చేసింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి కోసం బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర, హైదరాబాద్ నుంచి రూ.1,173 కోట్ల రుణం తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ రెండు ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. ఆగస్టు 30వ తేదీన విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అర్జున అవార్డు అందుకుంటున్న జీవంజి దీప్తి

రాష్ట్రపతి నుంచి.. 'అర్జున' అందుకున్న దీప్తి

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్యాన్ని జయించి రికార్డుల రారాణిగా సత్తా చాటి ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా ఒలింపియన్ జీవంజి దీప్తి కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన ఆమె శుక్రవారం న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అర్జున అవార్డును అందుకున్నారు. విధి రాతను చెరిపి, ఎన్నో అవమానాలు, అవహేళనలు భరించి క్రీడల్లో రాణించమే ధ్యేయంగా దేశ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్ నుంచి శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఆమె ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకోవడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పారా ఒలింపిక్స్‌లో అర్జున పురస్కారాన్ని అందుకున్న తొలి తెలుగు పారాలింపియన్‌గా దీప్తి నిలవడం గర్వకారణమంటూ ఉమ్మడి వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ అథ్లెట్లు, క్రీడా అభిమానులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

అసైన్డ్ భూములను అమ్మొద్దు, కొనొద్దు

- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలి
- ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్
- హనుమకొండ, వరంగల్ కలెక్టర్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్ష


హనుమకొండలో మాట్లాడుతున్న ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్

హనుమకొండ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గతంలో ప్రభుత్వం ఎస్సీలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఎవరు అమ్మవద్దు, కొనవద్దని ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రావీణ్య ఇతర అధికారులతో కలిసి ఎస్సీలకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు, వివిధ రాయితీల అమలుపై ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు రాంచందర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. హనుమకొండ జిల్లాలో షెడ్యూల్ కులాల జనాభా, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలు, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలకు అందించే వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి సమీక్ష సమావేశంలో అధికారులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా వడ్డెపల్లి రాంచందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సబ్సిడీ ఋణాలు సకాలంలో అందకపోవడం వలన షెడ్యూల్ కులాల లబ్ధిదారుల సిబిల్ స్కోర్ తగ్గిపోతుందన్నారు. దీంతో బ్యాంక్‌ల్లో వివిధ ఋణాలు అందకోలేకపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి క్షేత్ర స్థాయిలో తెలియజేయాలన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునిల్‌కుమార్‌బాబు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసుల ఫిర్యాదులను జాతీయ ఎస్సీ కమిషన్ స్వీకరిస్తుందన్నారు.

కలెక్టర్ ప్రవీణ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను అర్హులైన షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదులు చేశారు. ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన దళితులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకుందని ఇప్పటికీ దళితులకు రావాల్సిన నష్టపరిహారం ఇవ్వడం లేదని వాపోయారు.

కాజీపేట మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన ఆరూరికుమార్ తన రెండు ఎకరాల 20గుంటల భూమిని ఒక వ్యక్తి కబ్జా చేసినట్లు కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు.

ఈ కార్యక్రమంలో జాతీయ షెడ్యూల్ కులాల రీసెర్చ్ అధికారి వరప్రసాద్, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఏసీపీలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో సత్వరమే స్పందించాలి

వరంగల్ కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీసులు సత్వరమే స్పందించాలని, బాధితులకు న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామ్‌చందర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సకాలంలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఆదేశించారు. నిరుపేదల అభివృద్ధి కోసం బ్యాంకర్లు రుణాలు అందించాలన్నారు. అసైన్డ్ భూములకు చట్టబద్ధత కల్పించి పాస్ పుస్తకాలు అందించాలన్నారు. సమావేశం అనంతరం ఎస్సీ వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంతకుముందు రామ్‌చందర్‌కు కలెక్టర్ సత్యశారద పూలమొక్క అందించి స్వాగతం పలికారు. సమావేశం అనంతరం ఆయన కలెక్టర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకుడు సునీల్ కుమార్‌బాబు, రీసెర్చ్ అధికారి డి.వరప్రసాద్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, డీఆర్‌వో విజయలక్ష్మీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


స్వామివారికి త్రిశూల స్నానం నిర్వహిస్తున్న ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, అర్చకులు

కన్నులపండువగా త్రిశూలస్నానం

- వీరభద్రస్వామికి పల్లెరం
- కొత్తకొండకు వేలాదిగా తరలొచ్చిన భక్తజనం
- నేడు అగ్నిగుండాలు

7


పరకాల మండలంలోని పోచారంలో సాగేతర భూముల సర్వే చేస్తున్న బృందం

ముమ్మరంగా సర్వే

- జీపీలు, వార్డులు, డివిజన్లలో బృందాల పర్యటన
- షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్న ప్రక్రియ
- సంక్షేమ పథకాల దరఖాస్తుల ఆధారంగా వివరాల సేకరణ

8

ఉత్సాహంగా పోలీస్ క్రీడలు ప్రారంభం

- మూడో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2025ను ప్రారంభించి సీపీ
- పోటీలకు హాజరైన వరంగల్ కమిషనరేట్ పరిధిలోని జట్లు
- ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలన్న అంబర్ కిషోర్ ఝా


పోటీలను ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

7


లెక్కిస్తున్న మహిళలు

ఐనవోలు ఆదాయం రూ.1.80కోట్లు

జాతర హుండీల లెక్కింపు

పర్యవేక్షించిన దేవాదాయశాఖ కమిషనర్

7

ఎడ్‌సెట్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తాం

కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి


కేయూలో స్టేట్ ఎడ్‌సెట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2025 పరీక్షలను ఈ దఫా సమర్థవంతంగా నిర్వహిస్తామని కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కేయూ క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో స్టేట్ ఎడ్‌సెట్-25 కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ఉన్నత విద్యాశాఖ ఐసెట్ నిర్వహణ విధులను వర్సిటీకి ఇచ్చిందని, ఆయా పరీక్షలను వర్సిటీ సమర్థవంతంగా నిర్వహిం చిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాకతీయ యూనివర్సిటీకి మరిన్ని సెట్స్ పరీక్షలను నిర్వహించేందుకు అవకాశం ఉందని తెలిపారు. 13 దఫాలుగా ఉమ్మడి ఏపీతో పాటు తెలంగాణలోనూ ఐసెట్ పరీక్షలను నిర్వహించినట్లు వివరించారు. అలాగే ఎడ్‌సెటల్ ప్రవేశాల పరీక్షలను కూడా నిర్వహించిన అనుభవం వర్సిటీకి ఉందన్నారు. రాష్ట్ర ఎడ్‌సెట్-25 కన్వీనర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి,క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, న్యాయకళాశాల ప్రిన్సిపాల్ వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, డాక్టర్ బి.రమ, ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.రాంనాథ్ కిషన్, ప్రొఫెసర్ వై.వెంకయ్య, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వైద్యులకు సూచించారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ వార్డులను, ఏఎన్‌సీ క్లినిక్‌ను సందర్శించి రోగులకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అందిస్తున్న సేవలపై రోగులు, వారి బంధువులతో ఆరా తీశారు. అనంతరం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతీ రోజు ఫాగింగ్ చేయాలని సూచించారు. ఆస్పత్రి నిర్వహణ రికార్డులను పరిశీలించి రక్త నమూనాలను సేకరించి సకాలంలో రిపోర్టులు ఇవ్వాలని సూచించారు. 24గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని, వైద్యసేవలకు అవసరమైన మందులను సరిపడా నిల్వ ఉంచుకోవాలని సూచించారు. అత్యవసరమైన పాముకాటు లాంటి మందులను అందుబాటులో ఉంచుకునేలా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, ఎంపీడీవో విజయశ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా ఉండాలి

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి


పాలకుర్తిలో లబ్ధిదారులను వివరాలు అడుగుతున్న కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

పాలకుర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు పథకాలకు చేస్తున్న సర్వే సమగ్రంగా ఉండాలని ఆర్అండ్ఆర్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గుట్ట పరిసరాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారుల ఇళ్లలో అధికారులు సర్వే చేస్తుండగా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి వినయ్ కృష్ణారెడ్డి తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియన్నారు. ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఒక కుటుంబంలో 100 రోజులకు కనీసం 20 రోజుల పని దినాలు ఉండాలని, వారికి సెంటు వ్యవసాయ భూమి ఉండకూడదని అప్పుడే ఏడాదికి రూ.12వేలు పథకం ద్వారా వర్తిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు కూడా నిరుపేదలకే చెందేలా అధికారులు సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించారు. ఈ నెల 20 వరకు సర్వేను పూర్తి చేయాలనిసూచించారు. ఆయన వెంట డీఆర్‌డీవో పీడీ వసంత, డీఎస్‌వో బి.సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, హౌసింగ్ డీఈ సాయిరాంరెడ్డి, ఆర్ఐ రాకేష్, ఏపీవో మంజుల, ఎంపీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శి కపిలవాయి వెంకటేశ్వరాచారి ఉన్నారు.

● కొడకండ్ల : గ్రామాల్లో వ్యవసాయానికి యోగ్యం కాని భూముల సర్వేను ప్రభుత్వ అధికారులు శుక్రవారం కొనసాగిస్తున్నారు. లక్ష్మక్కపెల్లిలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను జిల్లా స్పెషల్ ఆఫీసర్ వినయ్‌కృష్ణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రమోహన్, ఎంపీడీవో నాగశేషాద్రిసూరి, ఎంపీవో ఇందిర, ఏవో విజయరెడ్డి పాల్గొన్నారు.

కేయూ తెలుగు విభాగాధిపతి నియామకంపై రగడ

పరస్పరం రిజిస్ట్రార్ మల్లారెడ్డికి ఫిర్యాదులు

కేయూ క్యాంపస్ జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం కొత్త విభాగాధిపతి నియామకంపై వర్సిటీలో రోజు రోజుకీ రగడ పెరుగుతోంది. ఇప్పటి వరకు విభాగాధిపతిగా కొనసాగిన ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి మరణంతో తెలుగు విభాగాధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయడం వర్సిటీ ఉన్నతాధికారులకు సవాల్‌గా మారింది. రెండు రోజులుగా వర్సిటీలో తెలుగు విభాగాధిపతి, బీవోఎస్ చైర్మన్‌ల నియామకంపై చర్చ జరుగుతోంది. సీనియార్టీకే ప్రాధాన్యత ఇస్తూ వర్సిటీ అధికారులు వర్సిటీ అకాడమిక్ పోస్టులను భర్తీ చేయడం వర్సిటీలో ఆనవాయితీగా వస్తోంది. వర్సిటీలోకి ఎవ్వరూ ముందుగా సర్వీస్‌లోకి వస్తే వారికే పదవులు ఇవ్వడం జరుగుతోంది. ఐతే గతానికి భిన్నంగా తెలుగు విభాగాధిపతి నియామకంలో వర్సిటీ అధికారులు నాన్చివేత ధోరణి ప్రదర్శించడం ఐశ్వర్యం కల్గిస్తోంది. సాధారణంగా వర్సిటీలోని సర్వీస్ రికార్డుల మేరకు సీనియర్ అధ్యాపకులకు వర్సిటీ పదవులు కేటయిస్తారు. అయితే ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు ఆలస్యం చేయడంలో అంతర్యం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇదిలా ఉండగా శుక్రవారం వర్సిటీ తెలుగు విభాగం కాంట్రాక్టు అధ్యాపకులు నాకంటే నాకు పదవీ ఇవ్వలంటూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలను వేర్వేరుగా కలిశారు. విజ్ఞపన పత్రాలను అందచేసి తమ వాదనలను విన్నవించారు. అయితే ఇప్పటికిప్పుడే వర్సిటీ అధికారులు తెలుగు విభాగాధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. తెలుగు విభాగంలోని కాంట్రాక్టు అధ్యాపకులలో ఎవ్వరిని ఆయా పోస్టుల్లో నియామిస్తారనే అంశంపై మీమాంస కొనసాగుతోంది.

ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి


ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న లక్ష్మిబాయి

వరంగల్ వ్యవసాయం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ ఫీజు వసూళ్లలో కార్యదర్శులు నిర్లక్ష్యం విడనాడాలని, లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి ఆదేశించారు. శుక్రవారం ఆమె అడిషనల్ డైరెక్టర్ రవికుమార్‌తో కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ లక్ష్మిబాయి మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్ కమిటీల వారీగా ఫీజు వసూలుచేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎక్కువ బకాయి ఉన్నవారికి లీగల్ నోటీసులు పంపాలన్నారు. అసెస్‌మెంట్లు, లైసెన్సుల జారీకి సంబంధించిన అంశాలపై కార్యదర్శులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. వచ్చే మిర్చి సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కోల్డ్ స్టోరేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

సమస్యలపై విన్నపం..

కార్యదర్శులతో సమావేశం అనంతరం ఏనుమాముల మార్కెట్‌కు సంబంధించిన సమస్యలను జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి, అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మార్కెట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, దడువాయిలకు పీవోటీ మిషన్లు ఇవ్వాలని, ఏనుమాములతో పాటు లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో క్లీనింగ్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వివరించారు. స్పందించిన లక్ష్మిబాయి కొద్ది రోజుల్లోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ బీవోఎస్‌గా ప్రొఫెసర్ రవికుమార్


వీసీ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న రవికుమార్

కేయూ క్యాంపస్ జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, యోగ నూతన బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వరంగల్ జాతీయ సాంకేతిక విద్యా సంస్థ(నిట్) ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ పి.రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేయగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి రవికుమార్‌కు నియామక ఉత్తర్వులను అందచేశారు. కేయూ పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో వీసీ డాక్టర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి రవికుమార్‌కు ఉత్తర్వులను అందచేసి అభినందనలు తెలిపారు. కాగా, రవికుమార్ రెండేళ్ల పాటు బీవోఎస్‌గా కొనసాగుతారు.

కేయూ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామచంద్రం బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ రామచంద్రం

కేయూ క్యాంపస్ జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ ఎడ్యుకేషన్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వర్సిటీ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన డాక్టర్ సీహెచ్.రణధీర్‌రెడ్డి నుంచి ప్రిన్సి పాల్‌గా ప్రొఫెసర్ వల్లూరి రాంచంద్రం చార్జీ తీసుకున్నారు. ఈ సందర్భంగా రిజి స్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రాష్ట్ర ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, కేయూ ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.రాంనాథ్‌కిషన్, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ తదితరులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రేపు సమావేశం

మడికొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల పాలిట పెనుభూతంగా మారిన చెత్తడంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం మడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19 (ఆదివారం) జరుగనున్న సమావేశానికి ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని సామాజికవేత్తలు పిలుపునిచ్చారు. సమస్య పరిష్కారం కోసం ఏం చేద్దాం, ఎలా ముందుకు పోదాం, శాంతియుతంగా సమస్యను ఎలా పరిష్కరించుకుందాం..అనే విషయాలను కూలంకషంగా చర్చించి సమస్యను పరిష్కరించుకుందామని తెలిపారు.

మహా ర్యాలీని జయప్రదం చేయండి

మిట్టపెల్లి సురేందర్, వడ్లకొండ వేణుగోపాల్‌రావు పిలుపు


సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రజా, కుల సంఘాల నాయకులు

బాలసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోనివేయిస్తంభాల ఆలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈనెల 20న నిర్వహించే మంద కృష్ణ మాదిగ పాల్గొంటున్న మహార్యాలీని విజయవంతం చేయాల్సిందిగా కవి, రచయిత మిట్టపెల్లి సురేందర్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ నేతృత్వంలో కుల సంఘాలు, ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేయి గొంతులు, లక్ష డప్పులు మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శన లోపు వర్గీకరణ చేస్తే అదే రోజున విజయోత్సవం జరుపుకుంటామని లేకుంటే సర్కారుకు సావుడప్పు మోగిస్తామని అన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని, మాలల కుట్రలు తిప్పికొట్టేందుకు ప్రతీ మాదిగ బిడ్డ డప్పు చంకనేసుకొని తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీరణపై వేసిన కమిషన్లు, కమిటీలు సానుకూలంగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాయని ఆయా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో కూడా వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయని వారు తెలిపారు. రూ. లక్షల కోట్లు సంపాదించిన గడ్డం వివేక్ కుటుంబం సుప్రీంకోర్టు తీర్పును అమలు కాకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా వ్యక్తిగతంగా వర్గీకరణకు సానుకూలంగా ఉన్నప్పటికీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అడ్డుపడుతున్నారని వారు విమర్శించారు.

కార్యక్రమంలో మంద కుమార్ మాదిగ, బొడ్డు దయాకర్, బొచ్చు తిరుపతి, రెడ్డి సంఘం నాయకులు గోపు జయపాల్‌రెడ్డి, మేకల కేదారి యాదవ్, బైరపాక జయాకర్, వీరదాసు వెంకటరత్నం, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా శ్రీధర్‌రావు, వేల్పుల సూరన్న మాదిగ కాపు, బుట్టి శ్యామ్ తదితర ప్రజా, కుల సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.

వర్గీకరణ అమలుకు సుదీర్ఘ పోరాటం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తొర్రూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉప కులాల వర్గీకరణ కోసం ముప్పై ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నామని, పోరాటాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా మాలలు అడ్డుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల సభను విజయవంతం చేయాలని తొర్రూరు పట్టణంలో డప్పు కళాకారులతో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు, అక్కడి నుంచి విశ్రాంతి భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశ్రాంతి భవనంలో ఆయన మాట్లాడారు. మొదట అంబేద్కర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వర్గీకరణ అమలుకు మాలలు అడుగడుగునా అడ్డు పడుతున్నారని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ ఆవే దన, ఆకాంక్ష తెలియజేయడానికే ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే సభకు ఇంటికో డప్పును చంకన పెట్టుకుని రావాలని కోరారు.

ర్యాలీలో రోడ్డు పక్కన చెప్పులు కుట్టేవారితో మాట్లాడి చెప్పులు కుట్టారు. త్వరలోనే వర్గీకరణ వస్తుందని వారిక భరోసా ఇచ్చారు. తొర్రూరుకు హాజరైన మంద కృష్ణ మాదిగను మాదిగ ఉద్యోగ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఉద్యోగ సంఘాల నాయకులు సోమారపు ఐలయ్య,మహంకాళి బుచ్చయ్య, మంగళపల్లి రాం చంద్రయ్య, మంగళపల్లి శ్రీనివాస్, ఎన్.వెంకన్న, సుంచు సంతోష్, రంజిత్, భిక్షపతి, బి.వెంకన్న, ఆర్.ఉపేందర్, పూర్ణచందర్, సురేందర్, రమేష్ పాల్గొన్నారు.


తొర్రూరులో చెప్పులు కుడుతున్న మంద కృష్ణ మాదిగ

మార్కెట్ డైరెక్టర్‌కు పెన్షనర్ల వినతి

వరంగల్ వ్యవసాయం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ, పెన్షనర్స్ డైరెక్టర్ లక్ష్మిబాయి శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు అడిషనల్ డైరెక్టర్ రవికుమార్‌ను పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు నాగపురి సారయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మార్కెట్ కమిటీలలో ఉన్న పెన్షనర్లకు ఒకే చెక్ ద్వారా పెన్షన్లు మంజూరు చేస్తున్నారని, అదేవిధంగా మన రాష్ట్రంలో ఉన్న 1650 మంది పెన్షనర్లకు హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచి ఒకే చెక్ ద్వారా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు పెన్షనర్లు అశోక్ కుమార్, వెంకటేశ్వర్లు, వీరన్న, జగన్మోహన్, సజ్జద్అలీ, రాంచెంద్రం, బియాబానీ, సాంబారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన '12 గంటల పాటల పల్లకి'


పాటల పల్లకిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వేదికపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పాటలు పాడుతున్న గాయకులు

తెలంగాణ ఉద్యమంలో పాటలదే కీలక పాత్ర

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వడ్డెపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో పాటలదే కీలక పాత్ర అని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కళాకారులకు అండగా నిలుస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించిన పాటల పల్లకిలో 12 గం టలు కార్యక్రమానికి టీపీసీసీ సాంస్కృతిక సారథి సేన కన్వీనర్ చక్రాల రఘు అధ్యక్షత వహించారు. కళాకారులు తమ ఆట పాటల ద్వారా ఉర్రూతలూగించారు. కళాకారులు ఆలాపించిన తెలంగాణ, జానపద, పాటలతో పాటల పల్లకి పల్లవించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ... ప్రజా ఉద్యమాలకు పాటలే పునాది అని అన్నారు. ఒక పాట లక్షలాది మందిని కదిలిస్తుందని చెప్పారు. ప్రజా ఉద్యమాలకు, తెలంగాణ ఉద్యమాలకు ఊపిరులూదింది కళాకారులేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అర్హులైన వారందరికీ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గాయకుడు, రచయిత నేర్నాల కిశోర్, అంతడుపుల రమాదేవి, తెలంగాణ జానపదుల కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, కళాకారులు పూసాల రమణాచారి, పెనుగొండ ఎల్లయ్య, అంబాల సతీష్, బండి రమ, ఎండి రజాక్, సింగరేణి సదానందం, గోనెల సమ్మన్న, గజ్జెల వినోద, గుమ్మడి జలపతి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6150	5600
పల్లికాయ (పచ్చిది)	4800	4100
కందులు	6802	5560
పెసళ్లు	7153	6570
పత్తి	7260	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14800	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	12000	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	14500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

గ్రూప్-2 పరీక్ష 'కీ' విడుదల

» ఈ నెల 22 వరకు అభ్యంతరాలకు అవకాశం

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గత డిసెంబరు 15, 16 తేదీల్లో నిర్వహించిన గ్రూప్-2 రాత పరీక్ష 'కీ'ని శుక్రవారం విడుదల చేసింది. నాలుగు సెషన్లలో జరిగిన నాలుగు ప్రశ్నపత్రాల ప్రిలిమినరీ 'కీ'తో పాటు మాస్టర్ ప్రశ్న పత్రాలను కమిషన్ వెబ్‌సైట్ (www.tspsc.gov.in)లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే అభ్యర్థులు లాగిన్ అయి ఆంగ్లంలో సమర్పించాలని, అభ్యంతరాలతోపాటు వాటిని రుజువు చేసే ఆధారాలను కూడా సమర్పించాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు 'కీ'పై అభ్యంతరాలను సమర్పించాలని తెలిపారు. ఈ-మెయిల్ లేదా వ్యక్తిగతంగా సమర్పించే విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

ఇంటర్ ఫీజు గడువు 25 వరకు పొడిగింపు

వచ్చే మార్చిలో జరగనున్న ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలకు రూ.2,500 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 25వ తేదీ వరకు ఇంటర్‌బోర్డు పొడిగించింది. కాగా, జాతీయ ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటించింది. దరఖాస్తులను http://scholarships.gov.inలో సమర్పించాలని సూచించింది.

చర్లపల్లిలో ట్రాన్స్‌జెండర్లకు ఓఎస్‌ఓపీ స్టాల్

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్'(ఓఎస్‌ఓపీ) స్టాల్‌ను కేటాయించారు. జాస్మిన్ అనే ట్రాన్స్‌జెండర్ ఎంటర్‌ప్రెన్యూర్ ఈస్టాల్‌లో చిరుతినుబండారాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. త్రిపుర, సహస్ర అనే ఇద్దరు జనపనార సంచులను ఇక్కడ విక్రయిస్తున్నారు. అలాగే కిరణ్‌రాజ్ అనే ట్రాన్స్ మ్యాన్ తయారు చేసిన సబ్బులను అందుబాటులో ఉంచారు. చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ఓఎస్‌ఓపీ స్టాల్‌ను నిర్వహించే అవకాశం ట్రాన్స్‌జెండర్లకు లభించడం పట్ల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు.

బరువు తగ్గలేదు కదా.. ఆ ఫీజు వెనక్కివ్వండి

» కలర్స్ హెల్త్‌కేర్‌కు రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బరువు తగ్గింపు చికిత్స సఫలం కాకపోవడంతో వసూలు చేసిన ఫీజును తిరిగి చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఓ సంస్థను ఆదేశించింది. 'వెయిట్ లాస్ ట్రీట్‌మెంట్' పేరుతో వసూలు చేసిన రూ.1.05 లక్షల ఫీజు, దానిపై 9% వడ్డీతోపాటు రూ.50 వేల పరిహారం చెల్లించాలన్న జిల్లా ఫోరం తీర్పును సమర్థించింది. ఎద్దుమైలారం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని అధిక బరువు తగ్గించుకునేందుకు 2022 ఏప్రిల్‌లో కలర్స్ హెల్త్‌కేర్ ఇండియాను ఆశ్రయించింది. ఆ సంస్థ నిపుణులు క్రిప్టో ట్రీట్‌మెంట్ ద్వారా 20 కిలోల వరకు బరువు తగ్గవచ్చని చెప్పారు. వెంటనే రూ.50 వేలు చెల్లించిన ఆ విద్యార్థిని 8 నెలల పాటు చికిత్స తీసుకుంది. చికిత్స తీసుకుంటున్న సమయంలో మరో రూ.55 వేలు చెల్లించింది. చికిత్స తీసుకున్న తర్వాత కూడా బరువులో మార్పులేకపోవడంతోపాటు, ఆ సంస్థ డైటీషియన్‌లు, వైద్యులు తనతో అమర్యాదకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించింది. తనకు జరిగిన సేవాలోపానికి పరిహారం కోరుతో మెదక్ జిల్లా ఫోరంలో ఫిర్యాదు చేసింది. ఇరువర్గాల వాదనలు విన్న జిల్లా ఫోరం చికిత్స పేరుతో వసూలు చేసిన రూ.1.05 లక్షలు, దానిపై 9% వడ్డీ, రూ.50 వేల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ కలర్స్ హెల్త్ కేర్ ఇండియా ప్రతినిధులు రాష్ట్ర ఫోరాన్ని ఆశ్రయించారు. రాష్ట్ర ఫోరం ఇన్‌ఛార్జ్ అధ్యక్షుడు మీనా రంగనాథన్, సభ్యుడు వి.వి. శేషుబాబుల ధర్మాసనం కలర్స్ హెల్త్‌కేర్ అప్పీలును కొట్టివేసింది. పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రజలు, మేధావుల మద్దతు మాదిగలకే..

ఫిబ్రవరి 7న హైదరాబాద్‌కు తరలిరావాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ



తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకుల మద్దతుతో పాటు ప్రజల మద్దతూ మాదిగలకే ఉన్నా.. 30 ఏండ్ల పోరాటానికి మాలలు అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం తొర్రూరులో డప్పు కళాకారులతో ర్యాలీ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ వర్గీకరణకు అనుకూలమైనా కొంతమంది ఆ పార్టీలో ఉన్న మాల నాయకులు వ్యతిరేకమని, వారి మూలంగానే తెలంగాణలో వర్గీకరణ అమలు ఆగుతుందని ఆరోపించారు. వర్గీకరణ పోరాటం చివరి దశకు చేరిందని, ఈ ఆఖరి పోరాటానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు, మేధావుల పూర్తి మద్దతు ఉందని చెప్పారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ అమలులో జాప్యం చేయవద్దని ఆయన కోరారు.

వర్గీకరణ కోరే వారిని బహిష్కరించాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి



గోదావరిఖని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ కులాల వర్గీకరణను సమర్థించే వారిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో రామ్మూర్తి మాట్లాడారు. డిసెంబరు 1న నిర్వహించిన మాలల సింహగర్జనను జీర్ణించుకోలేక వర్గీకరణను సమర్థించేందుకు మంద కృష్ణ మాదిగ సూడో మేధావులను సమీకరించుకుంటూ బహుజనుల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. బహుజనుల ఐక్యత కోసం మాల మహానాడు ఆధ్వర్యంలో 2 వేల గొంతులు, 2 లక్షల గుతుపలతో బల ప్రదర్శన చేస్తామని చెప్పారు. వర్గీకరణను సమర్థిస్తే రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వారవుతారని, రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వాళ్లకు దేశంలో ఉండే అర్హత లేదన్నారు. దేశాన్ని కులాలు, మతాలుగా వర్గీకరిస్తూ మనువాదాన్ని బలపరుస్తున్న బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం మానుకోవాలని, లేదంటే ప్రజలు మంద కృష్ణను కొట్టి చంపే రోజు వస్తుందని ఆయన హెచ్చరించారు.

పెట్రోల్ బంకు, ఫంక్షన్ హాలుకూ రైతుబంధు

(మొదటిపేజీ తరువాయి)

ఇలాంటి సిత్రాలు ఎన్నో ప్రస్తుత సర్వేలో బయటపడుతున్నాయి. పెట్రోల్ బంకు, ఫంక్షన్ హాళ్లు, పార్కింగ్ స్థలాలను నిర్వహిస్తున్న భూములకూ కొందరు ఆరేళ్ల పాటు రైతు బంధు సాయం పొందినట్టు తెలుస్తోంది.

పెట్రోలు బంకు, ఫంక్షన్ హాల్‌కు 'పెట్టుబడి సాయం'

జనవరి 26 నుంచి రైతు భరోసా పథకం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని అనుకుంటోంది. ఈ నేపథ్యంలో సాగుకు యోగ్యం కానీ భూముల గుర్తింపునకు అధికారులు గురువారం నుంచి క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. సర్వే నెంబర్ల ఆధారంగా గతంలో రైతుబంధు పొందిన భూముల వివరాలను పరిశీలిస్తున్నారు. సర్వే వివరాలతో సీసీఎల్‌ఏకు రోజువారీ నివేదికలు పంపిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయి విచారణలో పలు అంశాలు రెవెన్యూ అధికారులను ఆశ్చర్యపరుస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలో ఉన్న కర్తనూర్‌లో ఓ పెట్రోల్ బంకుకు రైతు బంధు తీసుకుంటున్నారు. సదరు భూమిలో కొన్నేళ్లుగా పెట్రోల్‌బంకు కొనసాగుతున్నా.. సాగు భూమిగా చూపి రైతుబంధు పొందినట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో మరో వ్యక్తి 10 ఎకరాల్లో ఫంక్షన్ హాల్ నిర్మించి దానిని నెలకు రూ.లక్షకు మరొకరికి అద్దెకు ఇచ్చారు. కానీ, ఆ ఫంక్షన్ హాల్ భూమికీ రైతు బంధు కింద సాయం పొందినట్లు గుర్తించారు. తెల్లాపూర్‌లో ఓ వ్యక్తి కార్ పార్కింగ్ కోసం కేటాయించిన నాలుగు గుంటల స్థలానికి రైతు బంధు పొందుతున్నారు. కొన్నిచోట్ల ఆలయాలకు, మరి కొన్ని చోట్ల పరిశ్రమలకు, లేఅవుట్లుగా ఉన్న స్థలాలకు, నాలా పొందిన భూములకు కూడా చెల్లింపులు జరిగినట్టు అధికారులు తమ సర్వేలో గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఉదంతాలు బయటికొస్తున్నాయి. ముఖ్యంగా రాజధానికి ఆనుకుని ఉన్న జిల్లాల్లో సాగులో లేని వేల ఎకరాల భూములకు రైతు బంధు చెల్లించినట్లు తాజా సర్వేలో వెలుగుచూస్తోంది.

ఆరేళ్లలో రూ.25,672 కోట్లు పక్కదారి

వ్యవసాయ శాఖ గత ఏడాది జూలైలో మంత్రివర్గ ఉపసంఘానికి ఇచ్చిన నివేదిక ప్రకారం.. గత ప్రభుత్వ పాలనలో రైతు బంధు కింద ఆరేళ్లలో.. సాగు చేయని భూములకు రూ.25,672 కోట్లు పెట్టుబడి సాయం అందింది. మొత్తం 12 విడతల్లో రూ.80,453 కోట్ల నిధులు రైతు బంధు పథకం కోసం విడుదల చేయగా.. అందులో రూ.25,672 కోట్ల సాగులో లేని భూములకు అందినట్లు నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 157.43 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, 74.58 లక్షల మంది పట్టాదారులు ఉన్నారని నివేదికలో తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ ఏటా 152.51 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారని వ్యవసాయ శాఖ వివరించింది. ఈ లెక్కన చూసినా సాగులో లేని సుమారు 4.92 లక్షల ఎకరాల భూములకు రైతు బంధు అందినట్లు తెలుస్తోంది.

'రైతు భరోసా'వర్తించని భూమి తక్కువే !

రాష్ట్రంలో 'రైతు భరోసా' సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సాగు యోగ్యం కానీ భూముల గుర్తింపు ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. సాగు యోగ్యం కాని భూములకు పెట్టుబడి సాయం ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతు బంధు లబ్ధిదారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమైంది. అయితే, పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉన్న పలు ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో సాగుయోగ్యం కానివి కింద అధికారులు గుర్తించిన భూములు చాలా స్వల్పంగా ఉన్నాయి. సర్వే జరిగిన పది గ్రామాల్లో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన పరిశీలనలో ఈ విషయం తేలింది. రియల్ ఎస్టేట్ వెంచర్లు, పరిశ్రమలకు మళ్లిన భూములు, రహదారుల కింద వదిలేసిన భూములు, రాళ్ల రప్పలున్న భూములు, ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములను మాత్రమే సాగు యోగ్యం కానివిగా అధికారులు గుర్తిస్తున్నారు. ఉదాహరణకు.. వరంగల్ ఉమ్మడి జిల్లా చిట్యాల మండలంలోని చైన్ పాక రెవెన్యూ గ్రామంలో 544 మంది రైతులకు చెందిన 1,264 ఎకరాలకు గతంలో రైతుబంధు సొమ్ము అందింది. అయితే, రైతు భరోసా సర్వేలో ఇందులో 21 మంది రైతులకు చెందిన 27.25 ఎకరాలను మాత్రమే సాగుకు పనికిరాని భూమిగా గుర్తించారు. అంటే, చైన్ పాక్ పరిధిలో సాగు యోగ్యం కాని భూమి స్వల్పమే.

- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో సుమారు 2,600 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో సాగు యోగ్యం కాని భూమి దాదాపు 20 ఎకరాలుగా గుర్తించారు. ఈ 20 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా వర్తించకపోవచ్చు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో మొత్తం 1,638 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో 4.25 ఎకరాలను సాగుకు యోగ్యం కాదని తేలింది. కొత్తపల్లి గ్రామంలో 1071 ఎకరాలుండగా 4 గుంటల భూమి సాగు యోగ్యం కాని భూమి జాబితాలో చేరింది. లోదిపూర్‌లో 255 ఎకరాలకు గాను 4.10 ఎకరాలను, నాచారంలో 789 ఎకరాలకు గాను 8.36 ఎకరాలను సాగుకు యోగ్యం కాదని గుర్తించారు.
- నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లింగాపూర్‌లోని 822 ఎకరాల భూముల్లో 3.07 ఎకరాలను సాగు యోగ్యం కానీ భూములుగా గుర్తించారు.
- నల్లగొండ జిల్లా గుడిపల్లిలో 1,516 మంది రైతులకు చెందిన 4,223 ఎకరాలకు రైతుబంధు అందేది. ఇందులో 30 మందికి చెందిన 20 ఎకరాలను సాగు యోగ్యం కాని భూమిగా గుర్తించి రైతు భరోసా నుంచి మినహాయించారు. చెరువులో పట్టాలు పొందిన మరో 14 మందికి చెందిన 35 ఎకరాల భూమి విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు.
- కరీంనగర్ మండలం ఇరుకుల గ్రామంలో 1348 మంది రైతులకు చెందిన 1223 ఎకరాల భూమికి రైతుబంధు అందేది. తాజా సర్వేలో ఇటుక బట్టీలు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న 52 ఎకరాలను సాగు యోగ్యం కాని భూమిగా గుర్తించారు.
- ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం రెవెన్యూ గ్రామంలో గతంలో 2585 ఎకరాల భూమికి రైతు బంధు వచ్చేది. రైతు భరోసా సర్వేలో 28 ఎకరాలను వెంచర్లగా గుర్తించారు. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో గతంలో 2912 ఎకరాలకు రైతు బంధు ఇచ్చేవారు. ఇప్పుడు సర్వేలో 20 ఎకరాలను వెంచర్ల భూమిగా గుర్తించారు.
- భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సర్వారం రెవెన్యూ పరిధిలో మొత్తం 1089 ఎకరాల భూమి ఉండగా... ఇళ్ల ప్లాట్లుగా మారిన 27 ఎకరాలను రైతు భరోసా నుంచి తొలగించారు.

దండుమైలారంలో 700 ఎకరాల కోత

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో మొత్తం 5,526 ఎకరాల రెవెన్యూ భూమి ఉండగా 3,788 ఎకరాలకు రైతుబంధు అందేది. రైతు భరోసా సర్వేలో ఇందులో సుమారు 400 ఎకరాలను గుట్టల ప్రాంతంగా గుర్తించారు. మరో 300 ఎకరాల్లో వెంచర్లు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో సుమారు 700 ఎకరాలు సాగుయోగ్యం కాని భూములు జాబితాలో చేరినట్టు అయింది.

కనుల పండువగా త్రిశూల స్నానం

- వీరభద్రస్వామికి పల్లెరం
- కొత్తకొండకు వేలాదిగా హాజరైన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న వీరభద్రస్వామి ఆలయం



వీరభద్రుడికి గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భీమదేవరపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల్లో భద్రకాళి సమేత వీరభద్రస్వామి త్రిశూల స్నానం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం రోజున నిత్యహోమాన్ని ప్రారంభించిన అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమంతో ముగింపు పలికారు. తొమ్మిది రోజులు విశేషంగా పూజలు నిర్వహించి కలశ పూజ చేశారు. బ్రహ్మోత్సవ కుంభాభిషేకం నిర్వహించారు. ఇందులో పాల్గొంటే సంవత్సరం కాలం పాటు దోషాలు నివృత్తి జరుగుతాయని స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకి సేవలో ఊరేగించారు. వీరశైవులు పల్లెరంతో స్వామివారి వీధిలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామి వారి పల్లెర కార్యక్రమాన్ని కన్నుల పండువగా తిలకించారు. అనంతరం పుష్కరిణి వరకు తీసుకెళ్లి, పవిత్ర పుష్కరిణిలో భూతబలిని నిర్వహించి పుష్కరిణిలో త్రిశూలస్నానం నిర్వహించారు. త్రిశూలేశ్వరిణితో పాటు అధికారులు, అర్చకులు, భక్తులు దివ్య స్నానం ఆచరించారు. త్రిశూల స్నానం ఆచరించే భక్తులు వారికిఉండే శరీర బాధలు, రోగ బాధలు, శత్రు బాధలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. దీంతో శుక్రవారం ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుష్కరిణిలో స్నానం చేశారు. అనంతరం ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్‌ఐ సాయిబాబు, ప్రధాన అర్చకులు రాజయ్య, మొగిలిపాలెం రాంబాబు, వీరభద్రయ్య, వినయ్‌శర్మ, శ్రీకాంత్, శివకుమార్, శరత్‌చంద్ర, రమేష్, ఎర్రోజు రాజు సిబ్బంది పాల్గొన్నారు.



పల్లెరం కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, సీఐ రమేష్, ఎస్‌ఐ సాయిబాబు

వీరభద్రుడికి మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే పల్లా

కొత్తకొండ వీరభద్రస్వామిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవా రం దర్శించుకున్నారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాను చిన్ననాటి నుంచి వీరభద్రస్వామి జాతరకు ఎడ్లబండిలో వచ్చేవాడినన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులతో కలిసి వీరభద్రస్వామిని దర్శించుకునేవారమన్నారు. వీరభద్రస్వామి రాష్ట్ర ప్రజలను చల్లగా చూడాలని, ఆశీర్వదించాలని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాడ సరిత, నాయకులు భూపతి రాజు, సంపత్, మహ్మద్ జానీ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. క్యూలైన్లీ అన్ని కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్‌ఐ సాయిబాబు బందోబస్తును నిర్వహించారు.

నేడు అగ్ని గుండాలు

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండాల కార్యక్రమం శనివారం తెల్లవారు జామున నిర్వహిస్తామని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. అగ్నిగుండాల్లో నడిచే భక్తుల శరీర బాధలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో వీరభద్రస్వామి అగ్నిగుండంలో నడిచేందుకు భక్తులు పోటీ పడుతుంటారు.

ఉత్సాహంగా పోలీస్ క్రీడలు ప్రారంభం

- మూడో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2025ను ప్రారంభించిన సీపీ
- పోటీలకు హాజరైన వరంగల్ కమిషనరేట్ పరిధిలోని జట్లు
- ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలన్న అంబర్ కిషోర్ ఝా



పావురాలు, బెలూన్లు ఎగురవేసి క్రీడలు ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ మూడో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2025 శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జేఎన్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ఈ పోలీసు క్రీడలను సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించగా... కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్‌జోన్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సీఏఆర్), లెథల్ వెపన్స్ జట్ల కెప్టెన్లు, జట్టు సభ్యులు గ్రౌండ్‌లో మార్చ్‌ఫాస్ట్ చేశారు. మూడు రోజుల పాటు 12 అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. తొలుత జాతీయ స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన పోలీస్ క్రీడాకారులతో క్రీడా జ్యోతిని గ్రౌండ్‌లో ప్రదర్శించి సీపీకి అందజేశారు. పావురాలను ఆకాశంలో ఎగురవేసి వాలీబాల్, పరుగు పందాలను ప్రారంభించారు. అలాగే కాజీపేటలోని సెయింట్ గ్యాబ్రియల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా క్రీడల్లో రాణిస్తున్న పోలీసులు ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు పని ఒత్తిళ్లను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, జనగామ ఏఎస్పీ పండరీ చేతన్ నితిన్, ఏసీపీలు, సీఐ, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



పరుగు పోటీలో పాల్గొన్న మహిళా పోలీసు క్రీడాకారులు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

ఐనవోలు ఆదాయం రూ.1.80 కోట్లు

హుండీల లెక్కింపు

ఐనవోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లన్న జాతర హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 91 రోజులకు హుండీల ద్వారా రూ. 31,59,335 లక్షలు రాగా వివిధ అర్జిత టిక్కెట్ల ద్వారా రూ. 1,48,67,173 కోట్లు వచ్చాయి. మొత్తం హుండీ, టిక్కెట్లు కలిపితే రూ.1,80,26,508 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. గత జాతరకంటే ఈ జాతరలో రూ.15,40,895 లక్షల ఆదాయం అదనంగా వచ్చింది. జాతరకు వచ్చిన భక్తులు హుండీల్లో మిశ్రమ వెండి బంగారం అభరణాలను స్వామి వారికి కానుకలుగా సమర్పించగా వాటిని తిరిగి హుండీల్లో వేసి సీల్‌చేసి భద్రపరిచారు. హుండీ లెక్కింపును దేవాదాయశాఖ వరంగల్ డివిజన్ పరిశీలకులు డి. అనిల్‌కుమార్ వ్యవహరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాణి, పోలీసు సిబ్బంది రమేష్, రాజ్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించగా మహబూబాబాద్‌కు చెందిన లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.


అడ్డంకులు తొలగేదెన్నడో?

(5వ పేజీ తరువాయి)

కూడా ఇందులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు 300 ఐసీయూ పడకలు, 1,399జనరల్ వార్డు పడకలు, 25 కీమో థెరపీ పడకలు ఇలా మొత్తం 2,100 పడకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 42 లిఫ్టులు, పెషేంట్ అటెండెంట్స్ కోసం 450 పడకలతో ధర్మశాల, 8లక్షల కెపాసిటీతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఒకేసారి ఆరు డెడ్‌బాడీలకు శవ పరీక్షలు చేసే వీలుగా పోస్టుమార్టం గదితో పాటు అనేక హంగులతో ఈ అస్పత్రి నిర్మాణం చేపట్టారు.

ఏడాది దాటినా పేదల వైద్యంపై పట్టింపేదీ?

వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు ఏడాది కాలంగా ఓరుగల్లులో వైద్యరంగాన్ని గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎంకు పాలనాధికారి కూడా దిక్కులేని పరిస్థితి నెలకొంది. ఎంజీఎంలో కార్డియాలజీ, ఆర్థో, న్యూరో, పీడియాట్రిక్, గ్యాస్ట్రో తదితర కీలకమైన విభాగాల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారనే ఆవేదన వ్యక్తమవుతోంది. అంతేకాకుండా సిటీ స్కానింగ్, 2డీ ఎకో యంత్రాలు పని చేయకున్నా పట్టించుకునే వారు లేరు. దీంతో ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోందని పేదలు ఆందోళన చెందుతున్నారు. అలాగే రూ.1,725.95కోట్లతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అస్పత్రి దాదాపు 70శాతం పూర్తవగా.. మిగతా పనిని పూర్తి చేసి పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు ప్రజాప్రతినిధులు కసరత్తు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ విచారణ సాకుతో పనులు పూర్తి చేయకపోవటంతో పేదలకు పెద్ద రోగం వస్తే ప్రైవేటు అస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. లక్షల్లో బిల్లులు చెల్లించేందుకు మెడలో తాళి.. ఉండే గుడిసెను అమ్ముకోవాల్సి వస్తుందని పేదలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో వరంగల్ అభివృద్ధి పేరుతో హైదరాబాద్‌లో నాలుగైదు సార్లు, హనుమకొండ కలెక్టరేట్‌లో మూడు, నాలుగు సార్లు సమీక్షలు నిర్వహించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, వరంగల్ నగరంలో భూగర్భ డ్రెయినేజీలపైనే సమీక్షలు నిర్వహించారని, పేదలకు ప్రాణం పోసే వరంగల్ ఎంజీఎం దీనస్థితిపైనా, అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణంపై ఏ ఒక్కసారి కూడా పూర్తి స్థాయిలో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, భూగర్భ డ్రెయినేజీలతో పాటు ప్రజలకు ప్రభుత్వ వైద్యం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని పాలకులు విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంజీఎంతో పాటు సూపర్ స్పెషాలిటీ అస్పత్రులను పట్టించుకోకుండా, కార్పొరేట్ అస్పత్రులకు అవకాశం ఇచ్చేలా నేతల తీరు ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వేముల రోహిత్ వర్ధంతి

నివాళులర్పించిన ప్రజా సంఘాల నేతలు

వడ్డేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మనువాదుల కుట్రలో అసువులు బాసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి వేముల రోహిత్ 9వ వర్ధంతిని హనుమకొండ అశోక కాలనీలో దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, రాష్ట్ర జిల్లా నాయకులు బొర్ర సంపూర్ణ, మేకల అనిత, మల్లేశం, రవి, మాదాసి అబ్రహం, రాజు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వడ్డేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందించనున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డేపల్లి పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో ప్రభుత్వ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారి అన్ని వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా సర్వే అధికారులు నమోదు చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేను గడువులోగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాజీపేట మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌గౌడ్, గృహ నిర్మాణ శాఖ పీడీ దోర్నాల రాజేందర్ యాదవ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

పైపులైన్ లీకేజీ పనులకు మరమ్మతు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌కు నీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా వరంగల్ నగరంలో రెండు రోజుల పాటు నీటి సరఫరా బంద్ చేయడం జరుగుతుందని బల్దియా ఈఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం పూల రంగయ్య కిరాణషాపు వద్ద ఏర్పడిన పైప్‌లైన్ లీక్ కావడంతో మరమ్మతులు చేపట్టడం జరిగిందని తెలిపారు. దీంతో శని, ఆది వారాలు రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వెల్లడించారు. కేఎంసీ వాటర్ ట్యాంక్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల, రంగంపేట, మట్టెవాడ, కొత్తవాడ, రామన్నపేట, పోతననగర్, హంటర్‌రోడ్డు, సంతోషిమాత కాలనీ, గాయత్రినగర్, శాయంపేట ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు గుర్తించి బల్దియా ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సహకరించాలని శ్రీనివాస్ కోరారు.

ఐఎన్‌టీయూసీలో ముగ్గురు లీగల్ సెల్ బాధ్యుల నియామకం



నర్సింహరాములు, నాగేశ్వర్, నర్సింహస్వామి

వరంగల్ లీగల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ లీగల్ సెల్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీగా న్యాయవాది పి.నర్సింహరాములును నియమిస్తూ ఆదేశాలు జారీ చేశా రు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి బుద్ధారామ్ ప్రక టనలో పేర్కొన్నారు. అదేవిధంగా లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా కొంతం నాగేశ్వర్, హనుమకొండ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా సూరం నర్సింహస్వామిని నియమించారు. వారి నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించండి

- ఎంఈవో ఈసరి రవీందర్

హసన్‌పర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : బడి బయటి పిల్లల్ని బడిలో చేర్పించి సహకరించాలని ఎంఈవో ఈసరి రవీందర్ తల్లిదండ్రులను కోరారు. మండలంలోని సిద్దాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని కొత్తపల్లి హ్యాబిటేషన్‌లో బడి బయటి పిల్లల ఇంటింటి సర్వే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీ భాషబోయిన నాగరాజు ఇంటింటా తిరిగి బడి బయటి పిల్లల వివరాలను సేకరించి నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఇందుకు పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనని చెప్పారు. పిల్లలు బడిలో కాకుండా పనుల వద్ద ఉంటే ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఆరోగ్యశాఖ మంత్రి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

వరంగల్ మెడికల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పల్లె దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్, డైరీని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అనంతరం పల్లె దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్స్ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్ర మంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పట్నం రవి కుమార్, జనరల్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, కోశాధికారి ఎల్. రవి కుమార్, డాక్టర్ విజయ, డాక్టర్ విజయ్, డాక్టర్ అమిత్, డాక్టర్ రాహు ల్, డాక్టర్ అజయ్, డాక్టర్ రాజు, డాక్టర్ హర్ష, డాక్టర్ సౌజన్య, డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు బొట్ల భిక్షపతి మాదిగ

హసన్‌పర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు బొట్ల భిక్షపతి మాదిగ అన్నారు. మండల కేంద్రంలో వేల గొంతుల లక్ష డప్పుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారంజరిగినఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో హసన్‌పర్తి మారుమ్రోగింది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి, ఎస్సీల వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా బొట్ల భిక్షపతి మాదిగ, పుట్ట రవి మాదిగ, మారపల్లి రాంచంద్రారెడ్డి, బోడ యుగందర్, పుల్ల రవీందర్, జన్ను రవీం దర్‌లు ఉద్యమానికి సంఘీభావం తెలుపారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రతీ ఇంటి నుంచి మాదిగ, మాదిగ ఉపకులాలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, ఆరెపల్లి పవన్, కేతపాక ఎల్లేష్, రాజారపు భిక్షపతి, దామెర విద్యాసాగర్, రేణికుంట్ల దుర్గాప్రసాద్, తాళ్ల రమేష్, చాతళ్ల వేణు, తాళ్ల సంపత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే

- జీపీలు, వార్డులు, డివిజన్లలో బృందాల పర్యటన
- షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్న ప్రక్రియ
- సంక్షేమ పథకాల దరఖాస్తుల ఆధారంగా వివరాల సేకరణ



అలియాబాద్‌లో వ్యవసాయేతర భూములను సర్వే చేస్తున్న బృందం

హనుమకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుకు గాను ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే ముమ్మరంగా సాగుతోంది. రెండోరోజైన శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో లబ్ధిదారుల గుర్తింపు సర్వే షెడ్యూల్ ప్రకారం కొనసాగింది. శుక్రవారం ఉదయం 8 గంటలకే సర్వే అధికారులు గ్రామ పంచాయతీలు, మునిసిపల్‌వార్డులు, వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో పర్యటించారు. రైతు భరోసా లబ్ధిదారుల నిర్ధారణకు వివరాలు సేకరిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాగేతర భూములకు రైతు బంధు వర్తించిందా లేదా అనేది కూడా పరిశీలించి, అలాంటి భూములను తొలగించేందుకు జాబితాలను తయారు చేస్తున్నారు. అలాగే ఇందిరమ్మ రైతు కూలీ భరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు అందచేయడానికి సంబంధించి అర్హులైన వారిని గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో ప్రధానం గా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) ద్వారా సేకరించి ఏడాదిలో 20 రోజులకన్నా తక్కువ రోజులు పని చేసిన కూలీలను గుర్తిస్తున్నారు. వారు 20 రోజుల కన్నా తక్కువ పనిచేశారా.. లేదా అనేది నిర్ధారించుకునేందుకు వారి జాబ్ కార్డులను, మస్టర్లను పరిశీలిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం సూపర్ చెక్ చేస్తున్నారు. లబ్ధిదారులు దాఖలు చేసిన దరఖాస్తుల ఆధారంగా సర్వే చేస్తున్నారు. ఇళ్లు ఉన్నాయా? లేవా? సొంత స్థలం ఏమైనా ఉందా అనేవి ఆరా తీస్తున్నారు. స్థలం ఉన్నవారికి ఇళ్ల మంజూరులో ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉంది. ఇంటి స్థలం లేనివారికి మొదట ఇప్పటికే పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయి స్తారు. లేదా ఇల్లు నిర్మించి ఇస్తారు. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పేర్లతో జీపీలు, వార్డులు, డివిజన్ల వారీగా జాబితాలు రూపొందించారు. వీటిలో కొందరి పేర్లు లేకపోవడంతో అయోమయంలో పడుతున్నారు. మరికొంత మంది ఈ సర్వేకు దూరంగా ఉండడం, వివరాలు పూర్తిగా చెప్పకపోవడంతో రేషన్ కార్డుల దరఖాస్తుల జాబితాలో వారి పేర్లు లేకుండా పోయాయి. పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న అనేక మంది పేర్లు జాబితాలో లేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వరంగల్ జిల్లాలో గురువారం 136 గ్రామపంచాయతీలు, వార్డులు, డివిజన్లలో సర్వే నిర్వహించారు. వీటిలో 68గ్రామ పంచాయతీలు కాగా మిగతా 68 వార్డులు, డివిజన్లు. సర్వేలో భాగంగా 2740 రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలించారు. అలాగే 506 మంది రైతులకు చెందిన 43677 ఎకరాల్లో సర్వే చేసి 412 ఎకరాల మేర సాగేతర భూములున్నట్టు గుర్తించారు. శుక్రవారం కూడా 136 జీలు, వార్డులు, డివిజన్లలో సర్వే జరిగింది. కాగా రెండవ రోజు శుక్రవారం రేషన్ కార్డులకు సంబంధించి 2753 దరఖాస్తులను పరిశీలించారు. జిల్లాలో మొత్తం 12773 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇక రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించేందుకు 183 మంది పట్టాదారులకు చెందిన 23561 ఎకరాలను సర్వే చేయగా ఇందులో 140.13 ఎకరాలు సాగేతర భూమిగా తేలింది. ఇందిరమ్మ వ్యవసాయ కూలీల ఆత్మీయ భరోసా లబ్ధిదారులను గుర్తించేందుకు వారి బ్యాంక్ ఎకౌంట్ల వివరాలను పంపాలని ప్రభుత్వం కోరింది. 20 రోజుల కన్నా తక్కువ పనిచేసిన 10880 మంది వివరాలను డీఆర్‌డీఏ పంపించింది. వీరికి చెందిన బ్యాంక్ ఎకౌంట్లలో 80 శాతం మేరకు శుక్రవారం పంపించారు. మిగతా వాటిని శనివారం పంపుతారు.. కాగా హనుమకొండ జిల్లాలో శుక్రవారం 266 గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డులు, జీడబ్ల్యూఎంఎస్ డివిజన్లలో బృందాలు సర్వే నిర్వహించాయి. అర్బన్‌లో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వే జరిగింది.



వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో రేషన్ కార్డుల సర్వే చేస్తున్న అధికారులు

ఎన్పీడీసీఎల్ 327 యూనియన్ కంపెనీ కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న శ్రీధర్, నాయకులు

రాంనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) యూనియన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యవర్గాన్ని శుక్రవారం హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. కంపెనీ అధ్యక్షుడిగా పి.మహేందర్‌రెడ్డి, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.ఎస్.ఎన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.సదయ్య, పి.గంగాధర్, సెక్రెటరీగా కె. శ్రీనువాస్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, రహమత్‌అలీ, రాజేశ్, అమర్‌నాథ్, సుధాకర్, శ్రీనువాస్, సంధ్య, త్రినాథ్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా లక్ష్మయ్య, బాబు, వెంకన్న, రవి, రియాజ్, శ్రీనువాస్, ఆర్గనైజింగ్‌సెక్రటరీలుగా పాక శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, అలీం, కోటి, ట్రెజరర్‌గా కట్ల సదయ్య, ఆఫీస్ సెక్రెటరీగా సునిల్‌కుమార్ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీతో పాటు ఇటీవల రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నీలం ఐలేశ్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌ను 327 యూనియన్ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, ఇతర నాయకులు భారీ గజమాలతో సత్కరించారు.

సిండి 'కేటుగాళ్ల'లో వణుకు

- రహస్య ప్రదేశంలో చర్చలు
- రహస్య బాస్ వద్దకు పరుగో.. పరుగు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో నిఘా వర్గాల ఆరా

వరంగల్ కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది కాలంగా బల్దియా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కొందరు కాంట్రాక్టర్లు సీనియర్ గుత్తెదార్‌తో కలిసి అడ్డదారిలో పనులు దక్కించుకుని నాసిరకం పనులు చేస్తున్నారు. సంబంధిత అధికారులకు పర్సంటేజీ చొప్పున చేతులు తడిపి బిల్లులు కాజేస్తున్నారు. ఇటీవల ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలంప్‌మెంట్ ఫండ్) సీటీఎస్ జనరల్ ఫండ్ కింద రూ. 12.49 కోట్ల పనులను కొందరు కాంట్రాక్టర్లు ముఠాగా ఏర్పడినట్టు బల్దియాలో బాహాటంగానే చర్చ జరిగింది. దీంతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' లో సిండి 'కేటుగాళ్లు' అనే వార్త ప్రచురితమయ్యింది. వార్తాకథనం కాంట్రాక్టర్లలో దుమారం లేపింది. అభివృద్ధి పనులను దక్కించుకునేందుకు తెరవెనుక అడ్డదారిలో చక్రం తిప్పిన మాజీ బడా కాంట్రాక్టర్ తన కోటరీలో ఉన్న కొందరు కాంట్రాక్టర్లను సాయంత్రం రహస్య ప్రదేశానికి పిలిచి చర్చలు జరిపినట్టు తెలిసింది. సిండికేట్ విషయం ఎలా బయటకు పొక్కింది ? ఎవరు చెప్పారు ? అనే కోణంలో ఆరాదీసినట్టు తెలిసింది. దీనిపై వారికి లీకులు ఇచ్చిన అధికారులపై కూడా అనుమానం వ్యక్తం చేస్తూ కొందరికి ఫోన్ చేసి పిలిపించుకునే ప్రయత్నం చేయగా కలెక్టరేట్‌లో జరిగిన ఎస్సీ కమిషన్ కార్యక్రమంలో ఉన్నట్టు చెప్పడంతో తేలుకుట్టిన దొంగల్లా మిన్నకుండిపోయారు. అంతే కాకుండా కొందరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లను సైతం పిలిపించుకుని లీకులు ఇచ్చింది ఎవరని ప్రశ్నించినట్టు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా బడా కాంట్రాక్టర్ పరుగు పరుగున ఉదయాన్నే ఆయన గాడ్ ఫాదర్‌కు వెళ్లి విషయాన్ని వెల్లడించి రిలాక్స్ అయినట్టు తెలిసింది. ఐతే ఇప్పటికైనా కమిషనర్ సింగిల్ టెండర్ల (సింగిల్‌బిడ్డర్) టెండర్ ఆమోదిస్తుందా ? లేక పేపర్‌లో వచ్చిన వార్తతో నిరాకరిస్తుందా అని అనుమానపడుతున్నారు.

చెత్తకుప్పలో సైన్‌బోర్డు

- రెండు మాసాలుగా చెత్తకుప్పలోనే
- పట్టించుకోని బల్దియా అధికారులు



బల్దియా కార్యాలయం చెత్తకుప్పలో దర్శనమిస్తున్న సైన్‌బోర్డు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బల్దియా అధికారుల తీరు అధ్వానంగా మారింది. బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో చెత్తకుప్పలో పడిపోయిన 'వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిశుభ్రతకు కట్టుబడి ఉన్నాం' అని ప్రజలకు కనిపించాల్సిన బోర్డు చెత్తకుప్పలో దర్శనమిస్తోంది. బల్దియా అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువుటెత్తు కాదా? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని క్యాంటీన్‌కు కుడివైపున ప్రధాన ద్వారానికి కార్యాలయ సూచిక బోర్డు ఉండేది. ఇటీవల క్యాంటీన్ మరమ్మతు పనులు జరుగుతుండగా అక్కడి వెలువడిన చెత్తను ఒక్క చోట వేశారు. ఈక్రమంలో అక్కడ పనులు చేస్తుండగా అదే ప్రాంతంలో తుప్పు పట్టి కనిపించిన బోర్డులు కూడా అక్కడ పనులు చేస్తున్న వారు చెత్తకుప్పలో పడవేశారు. గత రెండు మాసాలుగా బోర్డు చెత్తలోనే కలిసిపోయి మరింత తుప్పుపట్టింది. కొందరు సిబ్బంది గుర్తించి బోర్డు ఉన్నట్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లిగా పట్టించుకోలేదు. చెత్తకుప్పలో బోర్డును చూసిన వారు సోషల్ మీడియాలో సెండ్ చేయడంతో వైరల్‌గా మారింది. అయినా సాయంత్రం వరకు అధికారులు పట్టించుకోవడం లేదని, నగర శుభ్రతకు పాటుపడుతున్నామని చెప్పుకొచ్చే అధికారులు, పాలక వర్గం కార్యాలయం ఆవరణలో శుభ్రత పాటించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నూతన విద్యుత్ లైన్ ప్రారంభం


హసన్‌పర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 55వ డివిజన్ భీమారం యాదవనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లుయాదవ్ శుక్రవారం నూతన విద్యుత్ లైన్‌ను ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఈ కాలనీ ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడేవారన్నారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మూడు విద్యుత్ లైన్‌ను ఐదు లైన్‌ల విద్యుత్ లైన్‌గా ఏర్పాటు చేసి ప్రజలకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. విద్యుత్ లైన్‌కు సహకరించిన విద్యుత్ అధికారులకు, సిబ్బందికి స్థానిక కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదానికి కారణమైన కానిస్టేబుల్‌పై కేసు

వరంగల్ క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు గాయపడిన ఘటనలో కానిస్టేబుల్ సాయికృష్ణపై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సతీష్ కథనం ప్రకారం... కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ సాయికృష్ణ ద్విచక్ర వాహనంపై గురువారం విధులకు వెళ్తుండగా కుమార్‌పల్లి మార్కెట్ ఏరియాలో షాహిద్ అనే బాలుడు గాలిపటాలు ఎగురవేస్తూ ఆకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చాడు. ఈ క్రమంలో షాహిద్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు కాగా వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. షాహిద్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డి అడిక్షన్ సెంటర్‌లో తనిఖీలు

- నిర్వాహకులపై కేసు నమోదు



తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వరంగల్ మెడికల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని హెల్పింగ్ హ్యాండ్ డి అడిక్షన్ సెంటర్‌పై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్ డ్రగ్స్, షెడ్యూల్ హెచ్ డ్రగ్స్ సైకియాట్రీ వైద్యుల సలహా లేకుండానే రోగులకు ఇస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు గుర్తించారు. ఔషధ నియంత్రణ శాఖ చట్టం ప్రకారం డీ అడిక్షన్ సెంటర్‌లోని మెడికల్ షాపును సీజ్ చేశారు. ఈ రకం మందులు మానసిక వ్యాధి నిపుణుల సలహా లేకుండా ఇవ్వడం వల్ల అనర్థాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ దాడుల్లో ఔషధ నియంత్రణశాఖ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పీఆర్ఓ డాక్టర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల భవనం సందర్శన

హనుమకొండ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాన్ని ఐటీడీఏ పీవో చిత్రమిశ్ర శుక్రవారం సందర్శించారు. గిరిజన పాఠశాల భవనంలో స్టడీసర్కిల్, శిక్షణ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవనంలో తాగునీరు, టాయిలెట్స్, భవనంలోని రూమ్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీటీడీవో ప్రేమకళ, ఏటీడీవో రమాదేవి, ఈఈ వీరభద్రం అధికారులు పాల్గొన్నారు.



బాలసముద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల భవనంను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్ర

సౌత్ జోన్ క్రికెట్ పోటీల్లో కేయూ జట్టు విజయకేతనం

కేయూ క్యాంపస్ జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌లో కాకతీయ యూనివర్సిటీ జట్టు ఒక్క పరుగు తేడాతో రెండవ రోజు విజయకేతనం ఎగురవేసింది. శుక్రవారం చైన్నైలోని మద్రాస్ వర్సిటీలో యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక క్రికెట్ జట్టుతో కేయూ జట్టు తలపడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన కాకతీయ యూనివర్సిటీ జట్టు యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక వర్సిటీ జట్టుపై నిర్ణీత 20 ఓవర్లకు గాను 19.3 ఓవర్లలోనే ఆలౌటు ఐనప్పటికీ 133 పరుగులు భారీ స్కోర్‌ను నమోదు చేసింది. తర్వాత రెండో ఇన్నింగ్‌లో బ్యాటింగ్‌కు దిగిన యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక జట్టు భారీ స్కోర్ సాధించే దిశగా వికెట్లన్ని కోల్పోయి లక్ష్య సాధనలో వెనుకబడింది. చివరకు ఒకే ఒక్క పరుగు తేడాలో కాకతీయ యూనివర్సిటీ జట్టు గెలుపొందింది. కేయూ జట్టులో కెప్టెన్ విశాల్ యాదవ్ 41 పరుగులు, పర్హాన్‌లు 21 పరుగుల స్కోర్‌ను చేశారు. కాకతీయ యూనివర్సిటీ జట్టు 1 పరుగు తేడాతో ఘన విజయం సాధించడంపై కేయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, కోచ్ మట్టెడ కుమార్, మేనేజర్ మహ్మద్ అలీలను వర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకటేశ్ అధ్యక్షతన మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి పోరాటాలు తీవ్రం చేస్తామన్నారు. గతంలో రైతాంగం చేసిన పోరాట ఫలితంగా పంటలకు మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంతో నిర్లక్ష్యం వహిస్తుందని దుయ్యబట్టారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీని యర్ నాయకుడు కల్లెపు వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, రమేష్, వాంకుడోతు వీరన్న, నాయకులు సాంబయ్య, కుమారస్వామి, ఉపేందర్ పాల్గొన్నారు.

కేరట్ మనదే!

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్స్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమ



స్యలు ఏర్పడినప్పుడు వాటిని సరి చేసే గుణం వీటి కుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటీన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతే కాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!

> కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.

'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

తాజా తాజా చట్నీలు

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు:

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం- అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

తయారీ విధానం:



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్లు ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

జాగ్రత్తలు:

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

ముల్లంగి ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

జాగ్రత్తలు:

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

చేమ ఆకుల చట్నీ

కావాల్సిన పదార్థాలు:



సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింత పండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

జాగ్రత్తలు:

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు

దుస్తులపై మరకలా... వదిలించండిలా...


ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!

- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్ పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తేలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
SINCE 1965

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి



పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!

'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేదవ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమవేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతారామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ ఛిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ.. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే,



నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్ అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.

మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్



'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎస్వీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

పెద్దోడిని అభినందించిన చిన్నోడు

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.



29వ వర్ధంతి
నా పరిపూర్ణ, పరిశుద్ధ హృదయంతో..
నిను కొల్చు భాగ్యం ఇంకెప్పుడూ..
ప్రభూ... ఈ జన్మకూ...
BOMMARILLU
ఆయన వీరాభిమాని
"బొమ్మరిల్లు వారి" సంస్థ అధినేత
వై.వి.ఎస్. చౌదరి




SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
KING OF SANKRANTI
A BOBBY KOLLI FILM
డాకు మహారాజ్
SURYADEVARA NAGA VAMSI - SAI SOUJANYA
A THAMAN S MUSICAL
ADITYA MUSIC




MAHAAKAAL PICTURES
TRAILER OUT NOW
IN CINEMAS FROM
24th JAN
హాలీ
DIRECTOR SRIVIDYA BASAWA PRODUCER S PRASHANTH REDDY



GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
RAGAM MOVIES
MOVIE MAXX
SREENIWAAS MAMIDALA
SVM
SRI VEDAKSHARA MOVIES
CHINTHAPALLI RAMARAO
TOVINO THOMAS
IDENTITY
తెలుగులో
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్
చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్
థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.
AKHIL PAUL - ANAS KHAN
RAJU MALLIATH DR ROY C J
24TH JAN 2025



SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
ZEE STUDIOS
DIL RAJU PRODUCTION
SANKRANTI BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS



DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
BLOCKBUSTER PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH
T-SERIES


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్

కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జివాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజిలకు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.

రాష్ట్రపతి స్వయంగా ముందుకొచ్చి..

అర్జున అవార్డు కోసం దశాబ్ధాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్‌టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్ గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి స్వయంగా ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.


అవార్డు స్వీకరిస్తున్న మురళీకాంత్ పేట్కర్

ఆనందంగా ఉంది



రాష్ట్రపతి చేతులమీదుగా క్రీడా పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని పారా అథ్లెట్ దీప్తి జివాంజి తెలిపింది. క్రీడల్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకునేందుకు ఈ అవార్డు దోహదం చేస్తుందని దీప్తి వెల్లడించింది. ఇక, అర్జున అందుకున్న మన క్రీడారత్నం, వరంగల్ ముద్దుబిడ్డ దీప్తికి అభినందనలు అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గతేడాది పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో దీప్తి కాంస్య పతకం గెలుచుకొని చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.

చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్లను శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.


స్టార్లు సాఫీగా..


సబలెంకా

- ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్
- ఏడో సీడ్ పెగులాకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కొకొ గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టాసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పౌలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్త్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. కాగా, 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడెర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌లో అడుగుపెట్టారు. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్‌లో ప్రవేశించింది.

ఫైనల్లో విహాన్



హైదరాబాద్: దుబాయ్‌లో జరుగుతున్న టెన్ ప్రొ గ్లోబల్ జూనియర్ టూర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తెలంగాణకు చెందిన విహాన్ ములుకుట్ల సింగిల్స్ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాడు. అండర్-12 బాలుర సింగిల్స్ సెమీఫైనల్లో హైదరాబాద్ చిన్నారి విహాన్ 6-4, 6-3తో గాబ్రియెల్ బ్రెగ్వాజ్ (కజకిస్థాన్)పై గెలిచి ఫైనల్ చేరాడు.

అమ్మాయిలూ.. అదరగొట్టాలి

- డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్
- తొలి రోజే ఆరు మ్యాచ్‌లు
- రేపు విండీస్‌తో యువ భారత్ పోరు

నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్‌కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఏ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్‌ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

భారత్ షెడ్యూల్

జనవరి 19	వెస్టిండీస్‌తో
జనవరి 21	మలేసియాతో
జనవరి 23	శ్రీలంకతో

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి

త్రిష మరోసారి..



గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

భారత మహిళల జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషిత, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

సింధుకు చుక్కెదురు

- సెమీస్‌కు సాత్విక్ జోడీ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హాంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యూక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.

సెమీస్‌కు భారత్

ఖోఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో భారత జట్లు టైటిల్ దిశగా దూసుకు పోతున్నాయి. ఈక్రమంలో మన మహిళలు, పురుషుల జట్లు సెమీఫైనల్లో అడుగుపెట్టాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ప్రియాంక ఇంగ్లే సారథ్యంలో మహిళల జట్టు 109-16 పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ప్రతీక్ వైకర్ కెప్టెన్సీలో పురుషుల జట్టు 100-40 పాయింట్ల తేడాతో శ్రీలంకపై విజయం సాధించింది. కాగా, ఈ ప్రపంచ కప్‌లో భారత మహిళల జట్టు వరుసగా నాలుగోసారి 100 పాయింట్ల మార్క్‌ను అందుకోవడం విశేషం. శనివారం జరిగే సెమీఫైనల్లో మహిళల జట్టు దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. మరో సెమీస్‌లో నేపాల్-ఉగాండా ఢీకొంటాయి. ఇక భారత పురుషులు సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకుంటారు. రెండో సెమీస్‌లో ఇరాన్-నేపాల్ తలపడతాయి.

విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు | కర్ణాటక X విదర్భ మ. 1.30 నుంచి

'ఆటో' పెట్టుబడుల కేంద్రంగా భారత్

నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని



న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్‌ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాట వేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.

వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.


రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు



మెర్సిడెస్ బెంజ్.. ఆటో ఎక్స్‌పోలో సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సిరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్‌ఎస్ 600 నైట్ సిరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఎల్‌ఏ కారును ఆవిష్కరించింది.



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్లు కంపెనీ ప్రకటించింది.

బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.



పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెలూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరు కు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

12,000 నియామకాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

కస్టమర్లకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్‌నే ఉపయోగించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే: మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

మారుతి ఈ-విటారా



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్టు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ తెలిపారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒకదశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	131
వరంగల్	112	గుంటూరు	130
కరీంనగర్	112	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	127	అనంతపురం	109
గోదావరి	131		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ

హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,270 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,820 ▲	77,000 ▲	93,500 ▲
విశాఖపట్నం	79,290 ▲	72,680 ▲	91,760 ▼
రాజమండ్రి	84,270 ▲	74,500 ▲	91,700 ▲
ప్రొద్దుటూరు	80,350 ▲	74,400 ▲	93,500 ▼
ముంబై	79,239 ▲	72,583 ▲	90,820 ▼

ఏసీబీకి చిక్కిన ఇద్దరు అవినీతి అధికారులు

- లంచంతో దొరికిపోయిన కోఠి ఈఎన్‌టీ ఏవో, డిండి ఆర్‌ఐ

డిండి/చంపాపేట/మంగళ్‌హాట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు లంచగొండి అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు చిక్కారు. కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఎక్స్‌రే విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహించే శ్రీనివాస్ 3 నెలల క్రితం పదవీ విరమణ పొందారు. రిటైర్మెంట్ బెనిఫిట్ల కోసం ఏవోగా ఉన్న ఆర్.సంతోష్ తివారిని కలిశారు. ఆయన ఫైలు కదిలించేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేయడంతో రూ.17 వేలు ఇచ్చారు. మిగిలిన రూ.3 వేలు కూడా ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో శ్రీనివాస్ ఏసీబీని ఆశ్రయించారు. ఆస్పత్రిలో సంతోష్ తివారికి శ్రీనివాస్ రూ.3 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నల్లగొండ జిల్లా డిండి మండలం పడమటితండాకు చెందిన రాత్లావత్ పాండు తన కూతురి వివాహం మూడేళ్ల కింద చేశాడు. అప్పుడే కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఏళ్లు గడుస్తున్నా కల్యాణలక్ష్మి సాయం అందకపోవడంతో ఆర్ఐ శ్యాంనాయక్‌ను కలిశాడు. దీంతో ఆయన చెక్కు మంజూరు చేసేందుకు రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. రూ.5 వేలు ఇచ్చేందుకు అంగీకరించిన పాండు.. ఏసీబీని సంప్రదించాడు. ఈనేపథ్యంలోనే పాండు ఆర్ఐకి రూ.5 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మావోయిస్టులపై నిరంతర నిఘా: డీజీపీ



మహబూబ్‌నగర్, జనవరి17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా ఉందని డీజీపీ జితేందర్ చెప్పారు. తెలంగాణ, ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల ఘటనల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందన్నారు. రాష్ట్రంలోకి మావోయిస్టుల చొరబాట్లు జరుగుతున్నాయన్న సమాచారం లేదన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని పోలీసు కార్యాలయంలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో కర్ణాటక, ఛత్తీస్‌ఘఢ్ పోలీసులతో కలిసి నేరస్తులకోసం గాలిస్తున్నామన్నారు. పాత పోలీస్ స్టేషన్‌లను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించామని, త్వరలోనే సమీక్ష నిర్వహిస్తామన్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

- నిర్మల్ జిల్లా కాల్వ అడవుల్లో ఘటన

దిలావర్‌పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు.. మరోవైపు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం.. వెరసి ఆ వృద్ధ దంపతులకు జీవితంపై విరక్తి కలిగింది. దీంతో ఇంటి నుంచి దూరంగా ఉన్న అడవుల్లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన నిర్మల్ జిల్లాలో గురువారం జరిగింది. సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామానికి చెందిన కొరిపెల్లి భాస్కర్ రెడ్డి(62), అనసూయ (60) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. భాస్కర్‌రెడ్డి ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తూ.. ఏడాదిన్నర క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. విరమణతో వచ్చిన బెనిఫిట్స్‌తో పాటు తెలిసిన వ్యక్తుల వద్ద మరికొంత అప్పు చేసి ఇంటి నిర్మాణం చేశారు. తీసుకున్న అప్పులకు వడ్డీతో కలిపి రూ. 70 లక్షల వరకు అయ్యింది. అయితే ఓవైపు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం.. మరోవైపు అప్పులు ఇచ్చిన వారు తీర్చాలంటూ ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురైన భాస్కర్‌రెడ్డి దంపతులు.. గురువారం సాయంత్రం దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ అడవుల్లోకి వెళ్లి చీరతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

'ఇంటికి నిప్పు' ఘటనలో ప్రదీప్ తండ్రి మృతి

అల్వాల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్న కూతురిని ప్రేమించిన యువకుడి ఇంటిపై పెట్రోల్ పోసి యువతి చిన్నాన్న నిప్పు పెట్టిన ఘటనలో యువకుడి తండ్రి ప్రకాశ్(60) గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మరణించాడు. ప్రదీప్‌తో పాటు అతని కుటుంబసభ్యులను హతమార్చాలనే కుట్రతోనే ప్రధాన నిందితుడు వివేకానంద ఈ ఘటనకు పాల్పడినట్లు అల్వాల్ పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే వివేకానందతోపాటు అతనికి సహకరించిన పవన్(29), ఏల్లేష్(31)ను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే ఘటనలో వివేకానంద చేసిన పెట్రోల్ దాడిలో గాయపడిన చిన్నారి చాందినీ(4) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో 25 శాతం కాలిన గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతోంది.

సిరిసిల్లలో ప్రభుత్వ కార్యాలయాలకు కరెంట్ కట్

సిరిసిల్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో అధికారులు కరెంట్ కట్ చేశారు. సెస్ అధికారులు నోటీసులు ఇచ్చినా చెల్లింపులు జరగక పోవడంతో శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం, ఫారెస్ట్ కార్యాలయం, తహసీల్ కార్యాలయాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మున్సిపల్ విద్యుత్ బకాయిలు రూ.4.58 కోట్లు ఉండగా, తహసీల్ కార్యాలయం రూ.1.70 లక్షలు, ఫారెస్ట్ కార్యాలయం రూ.5.47 లక్షలు, సిరిసిల్ల పొదుపు భవన్‌కు సంబంధించి రూ.7.45 లక్షల బకాయిలున్నాయి. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. చివరకు బకాయిల చెల్లింపునకు అధికారులు ముందుకు రావడంతో సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విశాఖ నుంచి ఖాళీగా వెళ్లిన ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి చర్లపల్లికి వేసిన జన సాధారణ్ ప్రత్యేక రైలు శుక్రవారం ఇక్కడి నుంచి ఖాళీగా వెళ్లింది. ఉదయం 10 గంటలకు బయలుదేరిన ఈ రైలులో దాదాపుగా అన్ని కోచ్‌లూ ఖాళీగానే ఉన్నాయి. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులు సికింద్రాబాద్ సమీపాన చర్లపల్లిలో కొత్త టెర్మినల్ ప్రారంభించారు. దాంతో అక్కడి వరకు వెళ్లేలా కొన్ని రైళ్లను నడుపుతున్నారు. విశాఖపట్నం-చర్లపల్లి మధ్య ఆ విధంగానే సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం జన సాధారణ్ రైళ్లు నడపనున్నట్టు ప్రకటించారు. ఏయే ప్రాంతాల మధ్య ఏయే రైళ్లు ఏ సమయానికి నడుస్తాయో అధికారులు ముందుగానే మీడియా ద్వారా ప్రచారం చేశారు. అయితే ఈ విషయం చాలా మందికి తెలియక ఈరైళ్లను ఉపయోగించుకోలేకపోతున్నారు. విశాఖ-చర్లపల్లి రైలు విషయంలోనూ అదే జరిగిందని రైల్వేవర్గాలు పేర్కొన్నాయి.

లీజు పెంచుతున్నాం!

- కేంద్ర ప్రభుత్వ సంస్థలకు జయశంకర్ వర్సిటీ లేఖలు
- 12 సంస్థలకు 600 ఎకరాలిచ్చిన వ్యవసాయ విశ్వవిద్యాలయం
- లీజు రూ.10వేలకు పెంచాలని పాలకమండలి యోచన

రాజేంద్రనగర్, జనవరి17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థలకిచ్చిన భూముల లీజును పెంచాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకమండలి నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయ వర్సిటీకి సంబంధించిన భూములను లీజుకు తీసుకున్న కేంద్ర ప్రభుత్వ సంస్థలకు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య నేతృత్వంలోని పాలకమండలి లేఖలు రాసింది. ఎప్పుడో 30,40 ఏళ్ల క్రితం ఎకరాకు రూ5, రూ.10 చొప్పున వర్సిటీ భూములను కేంద్ర ప్రభుత్వ సంస్థలకు లీజుకు ఇచ్చారు. సుమారు 12 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు 600 ఎకరాల భూమిని కేటాయించారు. ప్రస్తుతం ఈ లీజును ఎకరాకు రూ. 10వేలకు పెంచాలని పాలకమండలి నిర్ణయం తీసుకుంది. అదే విషయాన్ని లీజు పొందిన సంస్థలకు తెలుపుతూ లేఖలు రాసింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి లీజు పెంచే అవకాశం ఉందని అంటున్నారు. అదే జరిగితే సంవత్సరానికి రూ.60 లక్షల ఆదాయం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వస్తుందని, దీంతో వర్సిటీలో విద్యా, పరిశోధన, విస్తరణ రంగాల అభివృద్ధి తో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవచ్చని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. వర్సిటీ భూములను లీజుకు తీసుకున్న వాటిలో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(నార్మ్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ (ఐఐఓఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్(ఐఐఎంఆర్) తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలున్నాయి.

ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో నేడు గ్రీన్‌కో ఎండీ విచారణ



- చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను ప్రశ్నించనున్న ఏసీబీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన ఏస్ నెక్స్ట్‌జెన్, దాని మాతృసంస్థ గ్రీన్‌కో ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను శనివారం ఏసీబీ అధికారులు ప్రశ్నించనున్నారు. ఫార్ములా-ఈ కారు రేసు కేసు విచారణ ప్రారంభమయ్యాక ఏసీబీ అధికారులు ఇప్పటికే గ్రీన్‌కో, ఏస్ నెక్స్ట్‌జెన్, ఏస్ రేస్, ఏస్ అర్బన్ డెవలపర్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి పలు కీలక ఆధారాలు సేకరించారు. మరోవైపు చలమలశెట్టి అనిల్‌కుమార్‌కు, మాజీమంత్రి కేటీఆర్‌కు మధ్య సాన్నిహిత్యం ఉందని, అందుకే త్రైపాక్షిక ఒప్పందానికి ముందు గ్రీన్‌కో నుంచి బీఆర్ఎస్ పార్టీకి రెండు విడతలుగా రూ.41 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు వచ్చాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా, హైదరాబాద్ వేదికగా 4 సెషన్లలో ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహించడం కోసం పురపాలకశాఖ, ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో), ఏస్ నెక్స్ట్‌జెన్ మధ్య 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రమోటర్‌గా ఉంటూ 9, 10, 11, 12 సెషన్లకు సంబంధించిన ఫీజును ఎఫ్ఈవోకు చెల్లిస్తోంది. వాస్తవానికి ప్రమోటర్ పాత్రలో తెరపైకి వచ్చిన ఏస్ నెక్స్ట్‌జెన్, దీని సిస్టర్ కంపెనీ ఏస్ రేస్‌కు స్పోర్టింగ్‌లో ఎలాంటి అనుభవం లేదు. ఈ కంపెనీలన్నింటిలో చలమలశెట్టి అనిల్‌కుమార్ కీలక హోదాల్లో ఉన్నారు. బ్రిటన్‌కు చెందిన ఎఫ్ఈవోతో మాజీ మంత్రి కేటీఆర్ తొలి దఫా చర్చలు జరిపిన తర్వాత హఠాత్తుగా ఏస్ నెక్స్ట్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను 2022 జూలైలో రిజిస్ట్రేషన్ చేయించారు. రిజిస్ట్రేషన్‌కు 15రోజుల ముందే గ్రీన్‌కో నుంచి రూ.10 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి అందాయి. అంతకు 2నెలల ముందు అదే సంస్థ నుంచి రూ.31 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు గులాబీ పార్టీకి వచ్చాయి. ఆ తర్వాతే ఏస్ నెక్స్ట్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలు తెరపైకి రావడం, వీటిలో ఏస్ నెక్స్ట్‌జెన్‌కు ప్రమోటర్ హోదా దక్కడం జరిగింది. ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీ.. ఎఫ్ఈవోకు చెల్లించాల్సిన ఫీజు కోసం అనిల్‌కుమార్ చలమలశెట్టికి చెందిన ఏస్ అర్బన్ డెవలపర్స్ నుంచి రూ.90 కోట్ల రుణం తీసుకుంది. ఈ విషయం ఇటీవలే ఏసీబీ తనిఖీల్లో వెల్లడైంది. అయితే 10వ సెషన్ రేసు ప్రారంభం కావడానికి ముందే ఏస్ నెక్స్ట్‌జెన్ వెనక్కి తగ్గింది. ఓవైపు ఫార్ములా-ఈ కారు రేసు వల్ల రూ. 700 కోట్ల వ్యాపారం జరిగిందని కేటీఆర్ చెబుతుంటే.. ఈ కంపెనీ రెండో సెషన్‌కు వెళ్లకుండా వెనక్కి తగ్గడానికి కారణమేంటన్న విషయంపై స్పష్టత కోసం ఏసీబీ అధికారులు యత్నిస్తున్నారు. ఏస్ నెక్స్ట్‌జెన్ వెనక్కి తగ్గడం వల్లే రెండో ఒప్పందం జరగడం, ఒప్పందానికి ముందే రూ.45.71 కోట్లను హెచ్ఎండీఏ నిధుల నుంచి ఎఫ్ఈవోకి చెల్లింపులు జరిగాయి. అనిల్‌కుమార్ కంపెనీల నుంచి రూ.41 కోట్లు బాండ్ల రూపంలో అందడం వల్లే కేటీఆర్ ఈ కంపెనీపై న్యాయపరమైన చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించారా? అనే విషయాలను ఏసీబీ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

6 హామీల్లో అర గ్యారెంటీనే అమలు

మహిళలకు ఉచిత బస్సు తప్ప మిగతావి తుస్సు.. పూర్తి రుణ మాఫీ నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- ఈ నెల 26న రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలి
- లేదంటే వెంటాడుతాం.. ఎన్ని కేసులైనా తగ్గం..
- షాబాద్ రైతు ధర్నాలో కేటీఆర్



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కేటీఆర్

షాద్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల్లో అర గ్యారెంటీని (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) మాత్రమే అమలు చేసి మిగతావి తుస్సుమనిపించారని.. ఇది రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. "రైతులందరికీ రుణ మాఫీ కాలేదని నిరూపించడానికి మేం సిద్ధం. పూర్తయిందని మీరు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటాం. మా ఎమ్మెల్యేలతో పాటు పార్టీ కార్యకర్తలం తా రాజీనామా చేస్తారు. రేవంత్.. మాతో గ్రామాలకు మీరు వస్తారా? మీకు సమయం లేకుంటే మంత్రులనైనా పంపించండి" అని సవాల్ విసిరారు. అమ్మకు అన్నం పెట్టనోడు.. పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుగా తెలంగాణలోనే పూర్తిగా విఫలమైన సీఎం రేవంత్ ఢిల్లీలో చక్రం తిప్పుతానని అనడం పెద్ద జోక్‌గా పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో శుక్రవారం బీఆర్ఎస్ రైతు దీక్ష కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి రైతుకు రూ.15 వేలు చెల్లించాల్సిందే. రైతు కూలీలకు కూడా రూ.12 వేలు ఇవ్వాల్సిందేనని అన్నారు. రైతు భరోసా పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించడం సరికాదన్నారు. "లోక్‌సభ ఎన్నికలకు ముందు రైతు భరోసా జమ చేసి తర్వాత చేతులెత్తేశారు. వానాకాలం పంట రైతు భరోసా రూ.7500 ఇవ్వలేదు. మేం నిలదీస్తుంటే దసరా, దీపావళి అని దాటవేశారు. ఇప్పుడు జనవరి 26 అని చెబుతున్నారు. ఇకనైనా ఇస్తారా? ఈ దీక్ష ఆరంభం మాత్రమే. కాంగ్రెస్ హామీలను అమలు చేయకుంటే వెంటాడుతూనే ఉంటాం. ప్రశ్నిస్తే రేవంత్ సర్కార్ కేసులు పెడుతోంది. ఎన్ని కేసులైనా భయపడేదే లేదు" అని అన్నా రు. ఒక్కో రైతుకు ప్రభుత్వం రూ.17,500, రాష్ట్రంలోని 1.67 కోట్ల మంది మహిళలకు రూ.30 వేలు బాకీ పడిందని.. స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు కాంగ్రెస్ వాళ్లు ఓట్ల కోసం వస్తే ముందు ఈ డబ్బులను చెల్లించి ఓట్లు అడగండి అని డిమాండ్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రాహుల్, రేవంత్‌పైనే కేసులు పెట్టాలి

సీఎం రేవంత్ పచ్చి మోసగాడు, అబద్ధాల కోరు అని.. హామీలు అమలు చేయనందుకు రేవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మోసం కేసు పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యానించారు. త్వరలోనే చేవెళ్ల నియోజకవర్గానికి ఉప ఎన్నిక రాబోతుందని జోస్యం చెప్పారు. దీక్షలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీమంత్రులు మహమూద్ అలీ, సబిత, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.

అలీబాబా అరడజన్ దొంగల్లా రేవంత్ దోపిడీ ముఠా సంచారం

- మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

షాద్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అలీబాబా అరడజన్ దొంగల మాదిరిగా సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధించిన దోపిడీ ముఠా సంచరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. సీఎం సోదరులు తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డితో పాటు వేం నరేందర్‌రెడ్డి, రోహిన్‌రెడ్డి, ఫహీం, ఖురేషి, ఏవీ రెడ్డిలు ముఠాగా ఏర్పడి రాష్ట్రంలో తిరుగుతున్నారన్నారు. ఈ ముఠా పలు కంపెనీల యాజమాన్యాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తోందని ఆరోపించారు. కబ్జాలు, భూదందాలే వీరి లక్ష్యం అని అన్నారు. శుక్రవారం కేటీఆర్ మీడియాతో చాట్‌చాట్‌గా మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి పెద్ద అవకాశవాది.. మోసకారి.. ఇందుకు నిదర్శనం ఎన్నికల హామీలను విస్మరించడమే.. అలాగే రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలు కూడా తెలంగాణ ప్రజలను మోసం చేసి వెళ్లిపోయారు. తెలంగాణ కాంగ్రెస్ చేస్తున్న మోసాలపై సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను పార్టీ నాయకులు ప్రశ్నించాలి" అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జగిత్యాలలో జరుగుతున్న పార్టీ విభేదాల గురించి ఎలా ప్రశ్నిస్తున్నారో అలాగే రాష్ట్రంలో జరుగుతున్న మోసాల గురించి కూడా ప్రశ్నిస్తే బాగుంటుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఈడీ, ఏసీబీ కేసులు పెడుతున్నా తాము ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గ్రీన్ కో కంపెనీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి రూపాయి లాభం కూడా జరగలేదని, మరి క్విడ్‌ప్రోకో అనే మాట ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఒక మంత్రిగా నిర్ణయం తీసుకున్నానని, ఇప్పటికీ దానికే కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. త్వరలోనే పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని చెప్పారు.

టన్ను బొగ్గుపై చందా రూ.25కు పెంపు

- స్వచ్ఛంద సహాయాన్ని పెంచాలని నిర్ణయం
- సీఎంపీఎఫ్ నిధిని వృద్ధి చేసేందుకు యోచన
- హైదరాబాద్‌లో తొలిసారిగా సీఎంపీఎఫ్‌వో ట్రస్టీల భేటీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికుల సామాజిక భద్రత కోసం టన్ను బొగ్గుపై స్వచ్ఛంద సహాయం రూపంలో వసూలు చేస్తున్న రూ.10 చందాను రూ.25కు పెంచాలని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(సీఎంపీఎఫ్‌వో) నిర్ణయించింది. సీఎంపీఎఫ్‌వో 183వ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పింఛన్ నిధిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం కేవలం థర్మల్ కేంద్రాలకు వినియోగించే బొగ్గు నుంచే చందాను వసూలు చేస్తున్నారు. ఇకపై వంటకు వాడే బొగ్గుపై కూడా టన్నుకు రూ.25 చందాను వసూలు చేయాలని నిర్ణయించారు. సగటున 100 టన్నుల బొగ్గు వెలికి తీస్తే.. అందులో కుకింగ్ కోల్ వాటా 15-20 టన్నులుగా ఉంటుందని గుర్తించారు. దాంతో కుకింగ్ కోల్‌పై చందా వసూలుకు నిర్ణయం తీసుకున్నారు. పింఛన్ నిధి ఏ మాత్రం ఆశాజనకంగా లేదని, దీన్ని పెంచుకోకపోతే బొగ్గు గని కార్మికులకు రానున్న రోజుల్లో పింఛన్ కూడా ఇవ్వలేని పరిస్థితి రావచ్చనే అభిప్రాయానికి వచ్చారు. పింఛన్‌దారుల సంక్షేమం దృష్ట్యా పింఛన్ నిధి సుస్థిరతకు కృషి చేయాలనే నిర్ణయంలో భాగంగా నిధి పెంపునకు ట్రస్టీలు అంగీకారం తెలిపారు. పింఛన్ నిధి పెరిగితేనే కార్మికుల సంక్షేమానికి మరింత వీలు కలుగుతుందని గుర్తించారు. తొలిసారిగా హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఇందులో కేంద్ర బొగ్గు శాఖ ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సీఎంపీఎఫ్ అధికారులు, బొగ్గు కంపెనీల ప్రతినిధులు, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విచారణకు కౌశిక్ రెడ్డి

మంగళ్‌హాట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని మాసబ్‌ట్యాంక్ పోలీసులు శుక్రవారం విచారించారు. దాదాపు గంటపాటు ఇన్‌స్పెక్టర్ పరశురాం ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డిని దాదాపు 32 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. గత డిసెంబరులో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అసభ్యంగా మాట్లాడినందుకు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. విచారణకు ఈ నెల 16న హాజరు కావాల్సిన కౌశిక్ రెడ్డి.. అధికారుల అనుమతితో శుక్రవారం విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి ఆరు హామీల విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

మెరుగైన విద్యకు 'ప్యూర్'తో ఒప్పందం

హైదరాబాద్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్(ప్యూర్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఈ ఒప్పందం జరిగింది. సంస్థ కార్యదర్శి బి. సైదులు, ప్యూర్ సీఈవో డా. శైలా తల్లూరి ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి అవసరమైన కార్యాచరణకు మార్గాన్ని సృష్టిస్తుంది. ముఖ్య లక్ష్యాలలో అధునాతన సాంకేతికత, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణను అందించడం, డిజిటల్ ల్యాబ్‌లు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం, విద్యార్థుల్లో నాయకత్వం, బృంద చైతన్యం, సామాజిక సేవల్ని ప్రోత్సహించడానికి ప్యూర్ యువజన క్లబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ భాగస్వామ్యంతో విద్యార్థులకు పరిశ్రమల సందర్శనలు, వారి భవిష్యత్తుకు మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

విశాఖ ఉక్కును నంబర్ 1గా తీర్చిదిద్దుతాం.. బాబు ప్రయత్నాలతోనే పునరుద్ధరణ

- లాభాల్లోకి తేవాలనే ఆర్థిక సాయం
- ఆగస్టులో 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి
- ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీలు ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా పరిరక్షించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని, దాన్ని లాభాల బాటలోకి మళ్లిస్తామని ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. ఇందులోభాగంగానే, కేంద్ర కేబినెట్ రూ. 11,440 కోట్ల భారీ సాయం ప్రకటించిందని తెలిపారు. విశాఖ ఉక్కు ప్లాంట్ పునరుద్ధరణకు ఈ నిధులను వినియోగించడం జరుగుతుందని కుమారస్వామి వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దేశంలోనే నంబర్ వన్ ప్లాంట్‌గా మార్చడాన్ని ఒక సవాలుగా తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఏడునెలలుగా ఎన్నో సార్లు ఈ ప్లాంట్ పునరుద్ధరణ గురించి చర్చించారని, ఒక దశలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తాను, చంద్రబాబు అర్ధరాత్రి రెండు గంటలవరకు చర్చించామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఎంతో ఉదారంగా వ్యవహరించారని చెప్పారు. విశాఖ ఉక్కు పునరుద్ధరణలో భాగంగా ఇది కేబినెట్ మంజూరుచేసిన తొలి ప్యాకేజీ మాత్రమేనని, తదుపరి దశల్లో కూడా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రస్తుత ప్యాకేజీలో భాగంగా రూ. 10,300 కోట్లు ఈక్విటీ మూలధనంగా ఉంటుందని, రూ. 1140 కోట్ల వర్కింగ్ కాపిటల్ రుణాన్ని నాన్ క్యూములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ కాపిటల్‌గా మారుస్తామని కుమారస్వామి చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ఉత్పత్తి ప్రారంభిస్తుందని ఆయన వెల్లడించారు. "గత ఏడాది అక్టోబరు 9న సీఎం చంద్రబాబుతో కలిసి నేను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశాను. రాత్రి రెండు గంటల వరకు సమావేశం జరిగింది. చివరకు నిర్మలా సీతారామన్ కొంత ఆర్థిక సహాయం చేసేందుకు అంగీకరించారు. తర్వాత ఎస్‌బీఐ క్యాప్ అధికారులతో ఒక కమిటీని వేశాం. ప్లాంటు పునరుద్ధరణపై మెకాన్ సంస్థ సలహా కూడా తీసుకున్నాం. ఆ తర్వాత మంత్రుల బృందం సమావేశమై పలు సలహాలు ఇచ్చింది. చివరకు రూ. 11,440 కోట్ల ప్యాకేజీ నిర్ణయమైంది" అని కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి వివరించారు. 93 శాతం సామర్థ్యాన్ని సాధించడాన్ని ఆర్థిక శాఖ తమకు లక్ష్యంగా విధించిందని, ఈ ఏడాది ఆగస్టు కల్లా దానిని సాధిస్తామని చెప్పారు. కాగా, ఇవే వివరాలతో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రెస్ నోట్ విడుదల చేశారు.

కూటమి 'ఉక్కు' పట్టు

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తదితరులు విశాఖ ఉక్కు సమస్యను ఢిల్లీ పెద్దలకు తెలియజేసి భారీగా ఆర్థిక సాయం చేయాలని కోరారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే విశాఖపట్నం రప్పించారు. ఇక్కడి సమస్యలు చూపించారు.

కోడిగుడ్లు, పలావ్‌తో తిరుమలకు

- భక్తుల ఫిర్యాదుతో పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): టీటీడీలో భద్రతా తనిఖీల వైఫల్యం మరోసారి బట్టబయలైంది. కోడిగుడ్లు, పలావ్ ఉన్న భారీ పాత్రతో ఓ బృందం నేరుగా అలిపిరి మీదుగా తిరుమలకు చేరుకుంది. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు సమీపంలోని గుమ్మిడిపూడికి చెందిన 28 మందితో కూడిన ఇతర మతానికి చెందిన ఓ బృందం శుక్రవారం ఉదయం అలిపిరి నుంచి ఘాట్‌లో తిరుమలకు చేరుకుంది. రాంభగీచ బస్టాండ్‌కు సమీపంలోని పార్కింగ్‌లో వారు తమ వెంట తీసుకువచ్చిన కోడిగుడ్ల కూర, పలావ్ తింటుండగా చూసిన భక్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. టూటౌన్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఆ బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. కాగా, తాము తలకోనకు వెళ్లాలనుకున్నామని, తిరుమలలో వాతావరణం బాగుంటుందన్న డ్రైవర్ సలహా మేరకు తిరుమలకు వచ్చామని పట్టుబడిన వ్యక్తులు పోలీసులకు తెలిపారు. నిబంధనల గురించి తమకు తెలియదని వారు వివరణ ఇచ్చారు.

నేడు ఏప్రిల్ నెల ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన ఏప్రిల్ నెల లక్కీడిప్ కోటాను టీటీడీ శనివారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలను 18న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఈ టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం జనవరి 18 నుంచి 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో భక్తులు నమోదు చేసుకోవాలి. టికెట్లు పొందిన భక్తులు 20 నుంచి 22న మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే లక్కీడిప్ ద్వారా టికెట్లు జారీ చేస్తారు. ఇక, 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను, ఏప్రిల్ 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న వసంతోత్సవాల టికెట్లను విడుదల చేస్తారు. ముఖ్యంగా 24వ తేదీన ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదుల కోటాను విడుదల చేయనున్నారు. భక్తులు 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు.

పీవీ సునీల్‌కు బిగుస్తున్న ఉచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

నొక్కేశారని.. ఆ సొమ్ముకు బిల్లులడిగిన కాంట్రాక్టర్‌ను 'నీకు బిల్లు కావాలా.? డ్రగ్స్ సరఫరా చేస్తున్నావనే కేసు కావాలా?' అంటూ బెదిరించారని.. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీకి ఫిర్యాదు చేశారు. ఐపీఎస్ అధికారిగా పనిచేస్తూ.. అక్రమ సంపాదనతో తరచూ దుబాయ్‌కి వెళ్లిన సునీల్ కుమార్ బినామీలతో కలసి కుమారుల పేరిట అక్కడ వ్యాపారాలు చేస్తున్నట్లు ఏసీబీకి రాసిన లేఖలో రఘురామ పేర్కొన్నారు. ఆయన బ్యాంకు లావాదేవీలు, ప్రయాణ వివరాలను సమర్పించారు. మరోవైపు.. వైసీపీ ప్రభుత్వంలో సునీల్ చేసిన అరాచకాలపై బాబు సర్కారు విచారణకు ఆదేశించింది. అమాయకులపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు సోషల్ మీడియాలో హైకోర్టు న్యాయమూర్తులపై అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ మూకలను వదిలేయడం.. ఇలా సునీల్‌పై పలు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం... విచారణ అధికారులుగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీశ్ కుమార్ గుప్తాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తనపై వచ్చిన ఆరోపణలకు సునీల్ కుమార్ ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని, ఆయనపై అభియోగాలను విచారించి సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో సునీల్ అరెస్టు తప్పదని పోలీసు ఉన్నతస్థాయి వర్గాలు చెబుతున్నాయి.

అడ్డగోలుగా అరాచకాలు

ఏపీలో వైసీపీ హయాంలో సీఐడీ ఏడీజీగా నియమితులైన సునీల్ కుమార్.. అప్పటి సీఎం జగన్ నిర్ణయాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినవారిపై ఏకంగా దేశద్రోహం కేసు నమోదు చేసి కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసేవారు. ప్రతిపక్షాలకు చెందినవారు నోరెత్తితే అర్ధరాత్రి సమయంలో వారి ఇంట్లోకి చొరబడి స్టేషన్‌కు ఎత్తుకొచ్చేవారు. సీఐడీ కస్టడీలో నాటి వైసీపీ ఎంపీ రఘురామరాజును టార్చర్ చేసినవారిలో కామేపల్లి తులసిబాబు కూడా ఉన్నారన్న ఆరోపణలపై ఇటీవల పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా తులసిబాబు కీలక అంశాలు వెల్లడించినట్లు తెలిసింది. అందులో సునీల్ అక్రమాల గురించిన వివరాలు కూడా ఉండటంతో వాటిని నిర్ధారించుకున్న పోలీసులు ప్రభుత్వానికి సమాచారం అందించారు. దీంతో ఇప్పటికే సీఐడీ మాజీ ఏడీజీపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం... రఘురామ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని సునీల్‌పై చర్యలకు సిద్ధమవుతోంది. అలాగే.. రఘురామ ఫిర్యాదు నేపథ్యంలో సునీల్ కుమార్‌పై ఏసీబీ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. ఎట్టిపరిస్థితుల్లోనూ సునీల్ అరెస్టు తప్పదనే వ్యాఖ్యలు న్యాయవాదుల్లోనూ వినిపిస్తున్నాయి.

డిస్కమ్‌లలో 3,260 కొలువులు!

» త్వరలో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల్లో కొలువుల మోత మోగనుంది. త్వరలోనే 3260 పోస్టులను భర్తీ చేయాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్)లో 2212 జేఎల్ఎం(జూనియర్ లైన్‌మెన్), 30 సబ్ ఇంజనీర్, 18 అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టులు, దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)లో 600 జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం), 300 సబ్ ఇంజనీర్, 100 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ)లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను సమర్పించిన పంపిణీ వ్యాపారం, వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్) పిటిషన్లలో డిస్కమ్‌లు పేర్కొన్నాయి. మొత్తం 3260 కొలువులకు ఏకకాలంలో డిస్కమ్‌లు నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగాల భర్తీ జరిగే అవకాశం ఉంటుందని దక్షిణ డిస్కమ్ అధికారులు తెలిపారు. కొత్త నియామకాల అనంతరం దక్షిణ డిస్కమ్‌లో ఉద్యోగుల వేతనాల ఖర్చు రూ.3166.15కోట్ల నుంచి రూ.3779కోట్లకు పెరుగుతుందని, ఉత్తర డిస్కమ్‌లో ఉద్యోగుల వేతనాల ఖర్చు రూ.2389.02 కోట్ల నుంచి రూ.2869 కోట్లకు పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఈ మేరకు నిధులు రాబట్టుకోవడానికి వీలుగా డిస్కమ్‌లు ఈఆర్సీకి ప్రతిపాదనలు సమర్పించాయి.

ఆస్ట్రేలియాలో తెలంగాణ బృందం

» మెల్‌బోర్న్‌లో క్రీడలు, మౌలిక వసతులపై అధ్యయనం

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో క్రీడలు, మౌలిక వసతులపై అధ్యయనం చేసేందుకు ఆ దేశంలో పర్యటిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రతినిధుల బృందం శుక్రవారం విక్టోరియా రాష్ట్రం మెల్‌బోర్న్ నగరంలో అక్కడి ప్రభుత్వ అధికారులతో సమావేశమైంది. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆస్ట్రేలియా దేశంలో క్రీడల అభివృద్ధి కోసం అమలుచేస్తున్న విధానాలను పరిశీలించింది. క్రీడల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకుంది. ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న రాష్ట్ర బృందంలో కరాటే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు(క్రీడలు) జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ ఎండీ సోనీబాల, హాకీ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆస్ట్రేలియాలో పర్యటించి క్రీడలు, మౌలిక వసతులపై రాష్ట్ర ప్రతినిధుల బృందం అధ్యయనం చేస్తోంది.

అర్చకులకు పింఛన్ సదుపాయం కల్పించండి

» బ్రాహ్మణ సంఘాల సమాఖ్య విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అర్చకుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌కు బ్రాహ్మణ సంఘాల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కమిషనర్‌ను కలిసి సమాఖ్య ఛైర్మన్ కృష్ణమూర్తి ఇతరులు వినతిపత్రం అందజేశారు. ధూపదీప ఆలయాల్లో ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. 10 వేల భృతిని రూ. 20 వేలకు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే దేవాదాయ శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ వేతనం పొందుతున్న అర్చకులకు పింఛన్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ క్యాటగిరీతో సంబంధం లేకుండా డీఏ ఇతర సదుపాయాలు అర్చకులందరికీ సమంగా కల్పించాలన్నారు.

'మహబూబ్‌నగర్'లో సూపర్ స్పెషాలిటీ సేవలు

» త్వరలో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు: మంత్రి దామోదర

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిని కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. త్వరలోనే కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. రూ.10 కోట్లతో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసి, ఉగాది నుంచి సేవలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆస్పత్రుల పనితీరు, వైద్య ఆరోగ్య సేవలపై శుక్రవారం ఇక్కడి కోఠిలోని తెలంగాణ వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో వైద్యం కోసం రోగులు హైదరాబాద్‌కు రావాల్సి వస్తుందని సమీక్షలో జిల్లా ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ వీలైనంత తొందరగా సూపర్ స్పెషాలిటీ సేవల విభాగాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

21 నుంచి లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఈనెల 26న ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనను ఈనెల 20 వరకు పూర్తిచేసి.. అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రజల ముందు వెల్లడిస్తారు. అక్కడ వచ్చే అభ్యంతరాలు, అభ్యర్థనలను ఆధారంగా చేసుకొని తుది అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక అధికారుల సమక్షంలో.. ఈనెల 21, 22, 23 తేదీల్లో గ్రామసభలు నిర్వహించాలని సీఎస్ శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

నాలుగేళ్లలో పథకాలన్నీ అమలు చేసి చూపిస్తాం

» కేటీఆర్‌కు నోటి దురుసు: చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

» ప్రజల దృష్టిని మరల్చేందుకు రైతు దీక్ష: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 'మా ప్రభుత్వానికి ఇంకా నాలుగేళ్ల టైమ్ ఉంది. ఈ నాలుగేళ్లలో అన్ని స్కీములూ అమలు చేసి చూపిస్తం' అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నాలుగేళ్లలో పథకాలు అమలు చేయకుంటే ప్రజలే తమకు బుద్ధి చెబుతారన్నారు. కేటీఆర్‌కు నోటి దురుసు ఎక్కువైందని, అతి త్వరలో ఆయన చేసిన స్కామ్‌లన్నీ బయటికి రాబోతున్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే కేటీఆర్ పిచ్చాసుపత్రికి వెళ్లడం ఖాయమన్నారు. 2014, 2018 ఎన్నికల మ్యానిఫెస్టోల్లోని అంశాల్లో 20 శాతం కూడా బీఆర్ఎస్ అమలు చేయలేదన్నారు. కేటీఆర్‌కు చేయాల్సింది లై డిటెక్టర్ టెస్టు కాదని, నార్కో అనాలసిస్ టెస్టు అని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది రుణ మాఫీ కాదని, వడ్డీ మాఫీనేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల మేరకు రుణమాఫీ చేశామని.. సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఆత్మీయ భరోసాల కింద ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు గుర్తు చేశారు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేటీఆర్ రైతు దీక్ష పేరిట నాటకాలాడుతున్నారని విమర్శించారు. కాగా, నిండు సభలో అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానిస్తే.. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ దేశాన్నే అవమానించారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు మండిపడ్డారు.

జీవిత బీమా పునరుద్ధరించండి: గిగ్ వర్కర్లు

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గత తొమ్మిదేళ్ల రాష్ట్రంలో అమల్లో ఉన్న గిగ్ వర్కర్ల జీవిత బీమా ముగిసిపోయిందని, అధికారుల నిర్లక్ష్యంతో ఈ పథకం నిలిచిపోయిందని, దీనిని వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ గిగ్ వర్కర్స్ ప్లాట్‌ఫాం కోరింది. సామాజిక భద్రత పథకంలో భాగంగా రాష్ట్రంలోని రవాణా, రవాణేతర ఆటో క్యాబ్ డ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టులకు 2015 నుండి అమలులో ఉన్న ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం రూ. 5 లక్షల ప్రమాద బీమా అందించిందని గిగ్ వర్కర్స్ ప్లాట్‌ఫాం వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు.

కళాశాలలో ఉండగానే.. కొలువు ఖాయం!

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు నేరుగా శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. ఈ విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఇప్పటికే అధ్యయనం చేసింది. అక్కడి విధానాన్ని రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసి ఇక్కడ అమలు చేయాలని నిర్ణయించింది.

ఐటీఈతో స్కిల్స్ యూనివర్సిటీ ఒప్పందం

సింగపూర్ ఐటీఈ స్ఫూర్తితో తెలంగాణలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. తన శిక్షకులకు ఐటీఈతో శిక్షణ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం ఐటీఈ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వీరి సమక్షంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉన్న సింగపూర్ ఐటీఈ తమ పాఠ్యాంశాలను (కరికులమ్) తెలంగాణ రాష్ట్రంతో పంచుకోనుంది. ఇక్కడి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు కావాల్సిన సహకారం అందించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యా విధానంలో ఇదో విప్లవాత్మకమైన నిర్ణయమన్నారు. చదువు పూర్తయ్యాక ఉద్యోగం వస్తుందా, రాదా.. అన్న ఆందోళనలో ఉండే యువతకు తాజా ఒప్పందం శుభవార్త అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు పరిశ్రమలకు నైపుణ్యమున్న మానవ వనరులు లభిస్తాయని పేర్కొన్నారు. ఐటీఈ ప్రతినిధులతో భేటీ అనంతరం సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు.



సింగపూర్ విదేశాంగ శాఖ మంత్రిని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వానికి సింగపూర్ ఐటీఈ అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. పారిశ్రామిక రంగంలో సింగపూర్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని సీఎం రేవంత్ కొనియాడారు.

స్థానిక ఎన్నికలు

ఫిబ్రవరి చివర్లో?



(మొదటిపేజీ తరువాయి)

వారాల్లో గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్తులకు ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు గాంధీభవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి మూడో వారంలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీలకు, నాలుగో వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

బీసీ రిజర్వేషన్ పెంపే చిక్కుముడి!

ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు బీసీ రిజర్వేషన్ పెంపు అంశం చిక్కుముడిగా మారింది. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏయే కులాల జనాభా ఎంత ఉంది? వారి రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులెలా ఉన్నాయి? అనే విషయాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనను ముగించుకుని వచ్చాక.. ఈ సర్వేపై మంత్రివర్గం సమీక్ష చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఆ సమావేశంలోనే సర్వే నివేదికను ఆమోదిస్తారని, ఆ తర్వాత ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహించి చర్చ చేపట్టే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు చేయరాదంటూ సుప్రీంకోర్టు తీర్పు ఉంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ జనాభా దామాషా ప్రకారం 27 శాతం రిజర్వేషన్ ఆ వర్గాలకు అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో కాంగ్రెస్ హామీ మేరకు బీసీలకు 42 శాతం అమలు చేయాలంటే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కులగణన సర్వే నివేదికను పరిగణనలోకి తీసుకుని బీసీల రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుకునేలా అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఇందుకు అనుమతించకపోతే.. స్థానిక ఎన్నికల్లో రేవంత్ సర్కారు ఏ వైఖరి అవలంబిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. పాత పద్ధతిలోనే ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి.. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టిక్కెట్లు ఇస్తుందా? లేక ఇతర మార్గాలను అన్వేషిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

అలా అయితే ఎన్నికలు ఏప్రిల్ లోనే!

ఈ నెల 26 నుంచి రైతులకు రైతు భరోసా, భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డుల మంజూరు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో ఈ పథకాల వేడిలోనే స్థానిక ఎన్నికలు కానిచ్చేయాలంటూ స్థానిక నాయకులు కోరుతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నామని, ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే 15 రోజుల్లో నిర్వహణ పూర్తి చేస్తామని అంటున్నారు. అయితే ఫిబ్రవరిలో ఎన్నికలు జరపాలని ప్రభుత్వం భావిస్తే.. అదే నెల 10వ తేదీ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంటుంది. దీంతో ఎన్నికల కోడ్ లోపు పథకాల అమలు పూర్తవుతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు పూర్తిస్థాయిలో నిధులు సమకూరడం సాధ్యమవుతుందా? అన్న చర్చ జరుగుతోంది. కానీ, సంక్రాంతి తర్వాత రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ముందే ప్రకటించినందున.. ఆ మేరకు నిధుల సేకరణ జరుగుతోందని, ఆత్మీయ భరోసాకూ నిధులు సమకూరుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అయితే కోడ్ అమల్లోపు ఈ నాలుగు పథకాలు అసంపూర్ణంగా అమలైతే.. దాని ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశం ఉంటుందన్న చర్చ కూడా పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో పథకాలు పూర్తి స్థాయిలో అమలైన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తే మాత్రం.. ఏప్రిల్ లేదా మే నెలలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందంటున్నారు.

సబ్ ప్లాన్ నిధులు సకాలంలో వాడాలి

» వ్యయాలను నెలకోసారి వెల్లడించాలి: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ శాఖలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్ట నియమ నిబంధనల ప్రకారం నిధులను సకాలంలో ఖర్చు చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం శాఖల వారీగా చేసిన వ్యయ వివరాలను ప్రతి నెల రోజులకు ఒకసారి వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. శాఖలవారీగా కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను సంతృప్త స్థాయిలో వినియోగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆదాయం బాగా పెరిగేలా ప్రణాళికలను రూపొందించాలని, వీటికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈనెల 23న నిర్వహించబోయే సమావేశానికి రావాలని ఆయన చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను గుర్తించి, స్వయం సహాయక సంఘ సభ్యులుగా చేర్పించాలని, వారికి వడ్డీ లేని రుణాలను అందించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇందిర జలప్రభ పథకం కింద ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి, ఎస్సీ, ఎస్టీ రైతులకు చేయూతనివ్వాలన్నారు. అటవీ భూముల్లో సౌర విద్యుత్తు ద్వారా మోటార్లను వినియోగించి, వెదురు, అవకాడో, పామాయిల్, అంతర పంటల సాగుకు ప్రణాళికను రూపొందించాలని పేర్కొన్నారు.

అర్బన్ పార్కుల అభివృద్ధి


» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, జనవరి 17(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలోని పట్టణప్రాంతాల్లో ఉన్న అటవీ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో అడవులు అంతరించిపోతున్నందున ప్రకృతిని కాపాడుకునేందుకు అర్బన్ ప్రాంతాల్లో ఉన్న అటవీపార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం పట్టణ సమీపంలోని వెలుగుమట్ల అర్బన్ అటవీ పార్కును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల, కొత్తగూడెం, సత్తుపల్లి అటవీ పార్కుల అభివృద్ధికి రూ.3కోట్లు మంజూరు చేసిందన్నారు వెలుగుమట్ల అటవీపార్కులో రోజుకు 10వేలమంది పర్యాటకులు, సందర్శకులు వచ్చేలా అభివృద్ధి చేయాలని, సహజసిద్ధమైన వివిధ రకాల మొక్కలు, నాటాలని సూచించారు.

త్వరలో సర్వేయర్లు, గ్రామాధికారుల నియామకం

» అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు: పొంగులేటి



హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్వేయర్లు, గ్రామాధికారుల నియామకాలను త్వరలో చేపట్టనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం విధివిధానాలను తక్షణమే రూపొందించి, ఎంపిక, పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తదితర అంశాలపై సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన వారికి పరీక్ష నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్‌ను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని, అదనంగా మరో 1000 మంది సర్వేయర్ల అవసరం ఉందన్నారు. అందుకు అవసరమైన ఎంపిక ప్రక్రియకు ప్రణాళికలు రూపొందించాలని, ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులతో కూడిన జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.

పదేళ్లు ద్రోహం చేసి ఇప్పుడు నీతులా?

బీఆర్ఎస్ చీకటి ఒప్పందాల వల్లే కృష్ణా జలాల్లో రాష్ట్రానికి తీరని అన్యాయం

» మన వాటా సాధించడంలో విఫలం

» రాష్ట్ర ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పోరాటం: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించడంలో పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయిందని, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 2015 జూన్‌లో నీటి వాటాల పంపిణీకి ఒప్పందం జరగ్గా... 811 టీఎంసీల్లో ఏపీ 512 టీఎంసీలు వాడుకోవడానికి, తెలంగాణ కేవలం 299 టీఎంసీలు వాడుకునేలా చేసుకున్న ఒప్పందంపై అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం సంతకాలు చేసిందని చెప్పారు. కృష్ణా జలాలను పదేళ్లపాటు పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారని ఆక్షేపించారు. కృష్ణా జలాలకు సంబంధించి తెలంగాణలో ఉన్న పరివాహక ప్రాంతం, ఆయకట్టు ఆధారంగా వాటాలు పెరగాలని కాంగ్రెస్ పార్టీ తొలినుంచి పోరాటం చేస్తోందని ఉత్తమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు టీఆర్ఎస్(బీఆర్ఎస్) చేసుకున్న ఈ చీకటి ఒప్పందంతో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాలను తేల్చాలని పోరాటం చేయకుండా తాత్కాలిక కేటాయింపులకు ఎందుకు అంగీకరించారని నిలదీశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 70 శాతం, ఏపీకి 30 శాతం మాత్రమే కేటాయింపులు ఉండాలనే వాదనను కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా ట్రైబ్యునల్‌లో లేవనెత్తిందన్నారు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నిలదీసినందుకే సెక్షన్ (3) అంశం తెరపైకి వచ్చిందన్నారు. నదీ జలాల వాటాలు తేల్చకుండా జాప్యం కావడంలో ప్రధాన దోషి బీఆర్ఎస్ అని, వాళ్ల హయాంలోనే తెలంగాణకు ద్రోహం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ట్రైబ్యునల్ ద్వారా తొందరగా నీటి కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచామన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలించిందని, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ సామర్థ్యాన్ని అదనంగా మరో 44 వేల క్యూసెక్కులకు పెంచిందని విమర్శించారు. పోతిరెడ్డిపాడు విస్తరణ పనులకు ఏపీ ప్రభుత్వం అనుమతులిస్తే.... బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చూసీ చూడనట్లు నటించిందని ప్రశ్నించారు. ఇక గోదావరి జలాలను రాయలసీమ దాకా తీసుకెళ్లి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చెప్పిందెవరు...? కేసీఆరా...? కాదా...? అని నిలదీశారు.

జల వివాదాలపై బ్రిజేశ్ ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు హర్షణీయం

» ఇది ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వ విజయమే: హరీశ్ రావు



హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల కేటాయింపు విషయంలో 1956 అంతర్‌రాష్ట్ర జల వివాదాల చట్టం సెక్షన్-3 ప్రకారం వాదనలు వింటామని బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లపాటు చేసిన పోరాట ఫలితంగానే ఈ విజయం దక్కిందన్నారు. కృష్ణా జలాల కేటాయింపులు రాష్ట్రాలవారిగా ఉండాలి తప్ప ప్రాజెక్టుల వారిగా ఉండకూడదని మొదటినుంచీ కేసీఆర్ చేసిన వాదనతో ట్రైబ్యునల్ ఏకీభవించిందని, దీంతో నదీజలాల కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులను తమ ఘనతగా చెప్పుకోవడం కాంగ్రెస్ పార్టీ భావదారిద్ర్యానికి నిదర్శనమన్నారు. ఇది కాంగ్రెస్ గొప్పతనమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19నుంచి 21వరకు వాదనలు వింటామని బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ప్రకటించిన నేపథ్యంలో బలమైన వాదనలు వినిపించేలా నిష్ణాతులైన న్యాయవాదులను ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ తరఫున సూచిస్తున్నామన్నారు. కాగా, కృష్ణా జలాల కేటాయింపులు రాష్ట్రాలవారిగా ఉండాలి తప్ప ప్రాజెక్టుల వారిగా ఉండకూడదని మొదటినుంచీ కేసీఆర్ చేసిన వాదనతో బ్రిజేశ్ ట్రైబ్యునల్ ఏకీభవించడం సంతోషకర పరిణామమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. బీడుబడ్డ తెలంగాణ భూములకు కృష్ణా జలాలను మళ్లించాలని కేసీఆర్ చేసిన కృషికి ఫలితమిదని ఎక్స్ వేదికగా ఆమె వెల్లడించారు.

అందుబాటులోకి కొడంగల్ వైద్య కళాశాల?

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కొడంగల్ వైద్య కళాశాల 50 వైద్య సీట్లతో అందుబాటులోకి రానున్నది. ఈ మేరకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ)కు వైద్య విద్యా సంచాలకుల(డీఎంఈ) కార్యాలయం దరఖాస్తు చేసింది. ఎన్ఎంసీ సూచించిన చెక్ లిస్టు(మెడికల్ కాలేజీ అనుమతులకు అవసరమైన వివరాలు, ఫార్మాట్)ను డీఎంఈ కార్యాలయం శుక్రవారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. ఎన్ఎంసీ దానిని పరిశీలించి కళాశాల చలాన్‌ను జనరేట్ చేస్తుంది. ఈ చలాన్ ద్వారా దాదాపు రూ.5.90 లక్షలను చెల్లించాల్సి ఉంటుందని వైద్యాధికారులు తెలిపారు.

ట్రైబ్యునల్ ఉత్తర్వులపై స్టే లేదా రద్దు!

» సుప్రీంకోర్టులో గట్టి వాదనలకు ఏపీ నిర్ణయం

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్-2 గడువు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మీద ఈ నెల 23న సుప్రీంకోర్టులో జరిగే విచారణలో గట్టిగా వాదనలు వినిపించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం ఆదేశాలపై 'స్టే' కోరాలని తీర్మానించింది. కృష్ణానది జలాల పంపకాలపై పునఃసమీక్ష చేపట్టాలని కోరుతూ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్-2 గడువును పెంచుతూ 2023లో కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 23న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్-2ను రద్దు చేయాలని కోరడం, లేదంటే గడువు పెంచుతూ కేంద్రం జారీ చేసిన ఆదేశాలపై స్టే విధించాలని సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు, కేంద్ర మార్గదర్శకాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వాదనలను వినేందుకు బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్-2 కూడా సిద్ధమైంది. గురువారం దీనికి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలకు ట్రైబ్యునల్ కొన్ని సూచనలు చేసింది. కేంద్ర గెజిట్ మేరకు సెక్షన్-3 కింద రాష్ట్రాల పిటిషన్లపై వాదనలు వింటామని స్పష్టం చేసింది. తర్వాత రాష్ట్ర విభజన చట్టం పరిధిలోని సెక్షన్ 89 పరిధిలోకి వచ్చిన ప్రాజెక్టులు, వాటికి కేటాయించిన కృష్ణా జలాలపై సమీక్షిస్తామని పేర్కొంది. కాగా, ట్రైబ్యునల్ సూచనలే తమకు విజయం దక్కేలా చేశాయని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కృష్ణా జలాల పంపకాలపై తమ వాదనలు నెగ్గాయని పేర్కొంది. అయితే.. సెక్షన్ 89 రాష్ట్రానికి రక్షణ కవచంగా ఉంటుందని.. ప్రాజెక్టులు లేకుండా కేవలం పరివాహక ప్రాంతంపై ఆధారపడి కేటాయింపులు ఉండవని ఏపీ ప్రభుత్వం చెబుతోంది.

వివేకా హత్య కేసులో అవినాష్ కోర్టుకు హాజరు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి శుక్రవారం నాంపల్లి సీబీఐ కోర్టుకు వచ్చారు. ఆయనతో పాటు తండ్రి భాస్కర్ రెడ్డి సహా అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులందరూ విచారణకు హాజరయ్యారు. తమపై మోపిన అభియోగాలను నిందితులంతా తిరస్కరించడంతో తదుపరి విచారణను కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఆయన కుమార్తె సునీతారెడ్డి ఫిర్యాదు మేరకు సీబీఐ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

శివార్లలో భారీ లే అవుట్లు

హైదరాబాద్ తూర్పువైపున హెచ్ఎండీఏ అభివృద్ధి ప్రణాళిక .. వేగంగా అడుగులు.. అధికారులతో ప్రచారం

- భూములిచ్చేందుకు ముందుకొచ్చిన రైతులు
- ఐదు ప్రాంతాల్లో 515 ఎకరాల సమీకరణ
- అభ్యంతరాల స్వీకరణపై నోటిఫికేషన్ల జారీ
- గడువు ముగిసిన తర్వాత రైతులతో ఒప్పందం
- రైతులకు, హెచ్ఎండీఏకు 60:40 నిష్పత్తిలో వాటాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) భారీ ఎత్తున భూ సమీకరణకు (ల్యాండ్ పూలింగ్) సిద్ధమైంది. స్థిరాస్తి సంస్థల తరహాలో భూములను అభివృద్ధి చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. గతంలో ఉప్పల్ భగాయత్‌ను అభివృద్ధిపరిచినట్లుగా.. నగరం తూర్పు వైపునా రియల్ ఎస్టేట్‌ను పరుగులెక్కించేందుకు సరికొత్త లే అవుట్లకు హెచ్ఎండీఏ కసరత్తు ప్రారంభించింది. దీంట్లో భాగంగా పెద్ద అంబర్‌పేట్, ఘట్‌కేసర్, బాలాపూర్ మండలాల పరిధిలో.. భూ సమీకరణ పథకం కింద 515 ఎకరాల్లో భారీ లేఅవుట్లను చేసేందుకు తాజాగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. కొర్రెముల, తిమ్మాయిగూడ, కుత్బుల్లాపూర్, కుర్మల్‌గూడ, నాదర్‌గుల్ ప్రాంతాల్లో లేఅవుట్లు చేయనున్న భూములపై అభ్యంతరాలను స్వీకరిస్తోంది.



హెచ్ఎండీఏ లే అవుట్లకు భారీ డిమాండ్

హెచ్ఎండీఏ అనుమతులతో ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు చేసే స్థలాలకు భారీ డిమాండ్ ఉంటోంది. హెచ్ఎండీఏనే స్వయంగా విక్రయించే భూములు, స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడుపోతుంటాయి. హైదరాబాద్ శివార్లలో రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా ముందుకుపోతుండడంతో చాలా మంది రైతులు, భూ యజమానులు తమ స్థలాలను అభివృద్ధి చేయడానికి రియల్ ఎస్టేట్ సంస్థలను ఆశ్రయించటం, ఈ క్రమంలో పలువురు మోసపోయిన దాఖలాలున్నాయి. ఇటువంటి మోసాలకు తావు లేకుండా.. హెచ్ఎండీఏ లేఅవుట్లను అభివృద్ధి చేయడానికి ఉమ్మడి రాష్ట్రంలో భూసమీకరణ పథకాన్ని చేపట్టారు. హెచ్ఎండీఏకు తలమానికంగా నిలిచిన ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌కు.. భూసమీకరణ పథకం కిందనే రైతుల నుంచి భూములను సేకరించారు. అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో విలువైన స్థలాలను రైతులకు అందించారు. ఇదే విధానాన్ని కొనసాగించేందుకు గత ప్రభుత్వ హయాంలో భూసమీకరణ పథకం-2017 పేరుతో మార్గదర్శకాలను రూపొందించారు. ఈ పథకం కింద ఇన్ముల్‌నర్వా, లేమూరు ప్రాంతాల్లో హెచ్ఎండీఏ లేఅవుట్లను అభివృద్ధి చేసింది.

ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూసమీకరణ పథకంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అధికారులకు లక్ష్యాలను విధించి శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేసింది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ అధికారులు వివిధ ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. భూసమీకరణ పథకం వల్ల ప్రయోజనాలను వివరించడంతో పెద్దఎత్తున రైతులు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తిమ్మాయిగూడలో 156 ఎకరాలు, అదే మండలంలోని కుత్బుల్లాపూర్‌లో 130 ఎకరాలు, బాలాపూర్ మండలం కుర్మల్‌గూడ, నాదర్‌గుల్ గ్రామాల పరిధిలో 115 ఎకరాలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెములలో 114 ఎకరాలను అభివృద్ధి చేయాలని హెచ్ఎండీఏ సంకల్పించింది. మొత్తంగా 515 ఎకరాల భూములిచ్చేందుకు రైతులు అంగీకరించడంతో ఆయా సర్వే నెంబర్ల ఆధారంగా అధికారులు నోటిఫికేషన్లు జారీ చేశారు. ఐదు ప్రాంతాల్లో నాలుగు భారీ లేఅవుట్లకు వేర్వేరుగానే అభ్యంతరాల స్వీకరణకు హెచ్ఎండీఏ తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా సర్వే నెంబర్లపై ఎలాంటి అభ్యంతరాలున్నా 30 రోజుల్లో తమకు తెలియజేయాలని స్పష్టం చేసింది. గడువు తర్వాత వచ్చే అభ్యంతరాలను తిరస్కరిస్తామని పేర్కొంది. ఈ 30 రోజుల్లోనే భూ వివాదాలు, కోర్టు కేసులు, యజమాన్య హక్కుల అంశాలను పరిగణలోకి తీసుకుని హెచ్ఎండీఏ అధికారులు తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

60:40 నిష్పత్తిలో వాటాలు

నోటిఫికేషన్లలో ప్రకటించిన ఆయా భూములపై అభ్యంతరాల స్వీకరణ పూర్తవగానే హెచ్ఎండీఏ.. రైతులతో ఒప్పందం చేసుకోనుంది. ఈ భూములను అభివృద్ధి చేసిన తర్వాత లేఅవుట్లలో రైతులకు 60 శాతం వాటా ఇవ్వనుండగా.. హెచ్ఎండీఏ 40 శాతం వాటాను తీసుకోనుంది. ఈ మేరకు ఆరు నెలల వ్యవధిలో ఒప్పంద ప్రక్రియను, డ్రాఫ్ట్ లేఅవుట్లను రూపొందించడానికి హెచ్ఎండీఏ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆ తర్వాతే హెచ్ఎండీఏ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో లేఅవుట్లను 30 అడుగులు, 40 అడుగులు, 60 అడుగుల రోడ్లు, అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా వ్యవస్థ, పార్కులతో అభివృద్ధి చేయనున్నారు. ఈ లేఅవుట్లకు 100 అడుగుల అప్రోచ్ రోడ్డు ఉండేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ భారీ లేఅవుట్ల అభివృద్ధికి మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నకిలీ డాక్యుమెంట్ల తయారీ ముఠా అరెస్ట్

- ఇన్సూరెన్స్ పత్రాలు, ఆధార్, ఓటరు కార్డుల సృష్టి
- పోలీసుల అదుపులో ముగ్గురు.. పరారీలో 15 మంది
- శంషాబాద్ పరిధిలోని మధురానగర్‌లో దందా

శంషాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ వాహన బీమా పత్రాలు, డాక్యుమెంట్లను తయారు చేస్తున్న ముఠాను ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. అందులో ముగ్గురిని అరెస్టు చేయగా, 15 మంది పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 26 నకిలీ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లతో పాటు హార్డ్‌డిస్క్, మూడు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ స్టేషన్ సీఐ బాల్‌రాజ్ శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మునిసిపల్ పరిధిలోని మధురానగర్‌లో కొంత కాలంగా ఈ దందా నడుస్తోంది. ప్రధాన నిందితులు బహదూర్‌పూరకు చెందిన మహ్మద్ అవేస్, శంషాబాద్‌కు చెందిన బి.శ్రవణ్ కుమార్‌గౌడ్, షాబాద్ మండలం సర్దార్ నగర్ గ్రామానికి చెందిన శివకుమార్ మరో 15 మంది ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. వాహనాల నకిలీ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లు, ఆధార్, ఓటరు, పాన్ కార్డులు, గ్యాస్ బిల్లులు, బ్యాంకు పాస్ బుక్కులు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, రెవెన్యూ పట్టా పాస్ బుక్‌లు, తదితర పత్రాలను ఈ ముఠా సభ్యులు తయారు చేస్తున్నారు. పక్కా సమాచారంతో శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం దాడులు చేసి ప్రధాన నిందితులు మహ్మద్ అవేస్, శ్రవణ్‌కుమార్, శివకుమార్‌ను పట్టుకున్నారు. మరో 15 మంది పరారయ్యారు. ఏ2 నుంచి ఏ14 వరకు ఉన్న నిందితులు జంట నగరాల్లోని ఆర్టీఏ కార్యాలయాల్లో పని చేస్తున్నారు. వీరు పలు ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో నకిలీ డాక్యుమెంట్లు తయారు చేస్తున్నారని పోలీసులు గుర్తించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.